बालभारती
हीरक महोत्सव

# తెలుగు

# బాలభారతి

## ఆరవ తరగతి



# టెలీ మానస్ హెల్ప్ లైన్

**Tele-MANAS (Tele Mental Health Assistance and Networking Across States)**

**(14416/1800-89-14416)**

జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం క్రింద టెలీ-మానస్ అను కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం అక్టోబర్ 2022 నుంచి మహారాష్ట్ర రాష్ట్రంలో అమలు చేయబడుతుంది. టెలీ-మానస్ కార్యక్రమం కింద హెల్ప్ లైన్ నంబర్ 14416 ద్వారా ఉచిత 24×7 ఏకీకృత మరియు సమగ్ర మానసిక ఆరోగ్య సేవలు అందించబడతాయి. ఇందులో వివిధ మానసిక సమస్యలకు నిపుణుల ద్వారా చికిత్స మరియు కౌన్సెలింగ్ అందించబడతాయి. టెలీ-మానస్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసిన తరువాత మీరు అందించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంటుంది. కాబట్టి విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు తమ సమస్యలను ఎలాంటి సందేహాలు, సంకోచాలు లేకుండా ఈ హెల్ప్ లైన్ నంబరుకు ఫోన్ చేసి (కాల్ చేసి) చెప్పండి. మార్గదర్శనం పొందండి. ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకుని ఇతరులను కూడా సహాయం కోరమని చెప్పండి.

# మనోదర్పణ్

మనోదర్పణ్ (8448440632) ఈ సేవ ఉచిత చరవాణి సేవ జూలై 2020 నుంచి శిక్షా మంత్రాలయం ద్వారా జాతీయ శైక్షణిక పరిశోధన మరియు ప్రశిక్షణ పరిషద్ లోని మనోదర్పణ్ కక్ష్య ద్వారా విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మానసికశాస్త్ర మార్గదర్శనం మరియు సహాయం అందించడానికి ఉదయం 8 గంటలనుంచి సాయంత్రం 8 గంటల సమయంలో వారంలోని అన్ని రోజుల్లో అందుబాటులో ఉంచడం జరిగింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవసరమైన మార్గదర్శనం, కౌన్సెలింగ్ పొందడానికి ఈ హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్ చేయవచ్చును.

ఈ పాఠ్యపుస్తకం రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ మహారాష్ట్ర, పుణె రూపొందించిన విద్యా పాఠ్యప్రణాళిక ప్రకారం తయారు చేయబడి వారి ద్వారా ధ్రువీకరింపబడినది. ప్రభుత్వ తీర్మానం క్రమ సంఖ్య : అభ్యాస్–2116/(ప్ర.క్ర. 43/16) ఎస్‌డి–4 తేది 25.04.2016 ప్రకారం ఏర్పాటైన సమన్వయ సమితి యొక్క తేది 19.05.2026 నాటి సమావేశంలో ఈ పాఠ్య పుస్తకాన్ని 2026–2027 విద్యా సంవత్సరం నుండి నిర్దేశించుటకుగాను అనుమతి ఇవ్వబడినది.

# తెలుగు బాలభారతి

## ఆరవ తరగతి



మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె–411 004.

ప్రక్కనున్న చదరంలోని క్యూఆర్ కోడ్ (QR CODE) ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేసినచో మీకు డిజిటల్ పాఠ్యపుస్తకం మరియు పాఠ్యపుస్తకంలోని అంశాలకు సంబంధించిన దృశ్య, శ్రవణ, దృశ్య–శ్రవణ స్వరూపంలోని అధ్యయన–అధ్యాపన సాహిత్యం లభిస్తుంది.

ప్రథమ ముద్రణ: 2026

© మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్య ప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె-411004.

ఈ పుస్తకమునకు సంబంధించిన సర్వహక్కులు మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్య ప్రణాళిక పరిశోధన సంస్థవి. ఈ పుస్తకము నందలి ఏ భాగమును సంచాలకులు, మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ వారి లిఖిత అనుమతి లేకుండా ఉటంకించటం చేయరాదు.

**తెలుగు భాషాసమితి**

శ్రీమతి భమిడిపాటి శారద, అధ్యక్షులు

శ్రీమతి టి. సుశీల, సభ్యులు
శ్రీమతి విద్యా బెనర్జి, సభ్యులు
శ్రీ కే. వై. కొండన్న, సభ్యులు
శ్రీమతి కె. అనురాధ, సభ్యులు
శ్రీ భూమనపల్లి విజయభాస్కర్ రెడ్డి, సభ్యులు
శ్రీమతి ఏ. ఎస్. యాదవ్, సభ్యులు
శ్రీ రాజ్‌కుమార్ ముత్యాల్‌వార్, సభ్యులు
శ్రీ ప్రభాకర్ భీమనాథ్, సభ్యులు
శ్రీమతి రేఖ దాసరి, సభ్యులు
శ్రీమతి శివకుమారి కుందర, సభ్యులు

డా॥ శ్రీమతి తులసి భారత్ భూషణ్, సభ్య కార్యదర్శి

**నాణ్యత సమీక్షకులు**

శ్రీ. బేతి మల్లేశం కృష్ణహరి (నాణ్యత నిపుణులు)
శ్రీ. మోర గణేశం (న్యాయ నిపుణులు)
శ్రీమతి రమణకుమారి (CWSN నిపుణులు)

**సంయోజకులు :**

డా. శ్రీమతి తులసీ భారత్‌భూషణ్
విశేషాధికారిణి తెలుగు (వి.క.),
పాఠ్యపుస్తక సంస్థ, పుణె.
శ్రీ భూమనపల్లి విజయభాస్కర్ రెడ్డి
సహాయ విశేషాధికారి తెలుగు (వి.క.)

కాగితం : 70 జి.ఎస్.ఎమ్. క్రీమ్‌వోవ్
ముద్రణాదేశం :
ముద్రకులు :

ముఖ చిత్రము: శ్రీ భటు రాందాస్ బాగలే
చిత్రములు : ది రినైస్సెన్స్, పుణె
శ్రీ గండూరి శ్రీనివాస్
అక్షర కూర్పు : విజయ్ ఆర్ట్ ప్రింటర్స్, పుణె

**నిర్మితి**

శ్రీమతి మిథాలి శితప్
I/C ముఖ్య నిర్మితి అధికారి
శ్రీ రాజేంద్ర పాండ్లోస్కర్
నిర్మితి అధికారి

**ప్రకాశకులు**

శ్రీ హేమంత్ వ. బాబర్
I/C నియంత్రకులు
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ ప్రభాదేవి, ముంబయి

# భారత సంవిధానము

## ప్రస్తావన

**భారతదేశ ప్రజలమగు మేము**, భారతదేశమును **సార్వభౌమ్య**
**సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యముగ**
నెలకొల్పుటకు మరియు అందలి పౌరులెల్లరకు
సామాజిక, ఆర్థిక, రాజకీయ **న్యాయమును**,
భావము, భావప్రకటన, విశ్వాసము,
ధర్మము, ఆరాధన -- వీటి **స్వాతంత్ర్యమును**,
అంతస్తులోను, అవకాశములోను **సమానత్వమును**
చేకూర్చుటకు; మరియు వారందరిలో
వ్యక్తి గౌరవమును, జాత్యైక్యతను,
అఖండతను తప్పక ఒనగూర్చు **సౌభ్రాత్రమును**,
పెంపొందించుటకు; సత్యనిష్ఠా పూర్వకముగ తీర్మానించుకొని,
ఈ 1949వ సంవత్సరము నవంబరు ఇరువది యారవ
దినమున **మా సంవిధాన సభయందు ఇందుమూలముగ,**
**ఈ సంవిధానమును అంగీకరించి, అధిశాసనము చేసి**
**మాకు మేము ఇచ్చుకొన్నవారమైతిమి.**

# భారత సంవిధానము

## పార్ట్ – IV A

## ప్రాథమిక బాధ్యతలు

**51 ఎ) ప్రాథమిక బాధ్యతలు**

**ప్రతి పౌరుడు ఈ క్రింది బాధ్యతలను మనసారా స్వీకరించి బాధ్యతాయుతంగా ప్రవర్తించవలెను.**

ఎ) రాజ్యాంగ శాసనబద్ధుడై యుండుట. శాసనమందలి ఆశయములనూ, శాసనం స్థాపించే సంస్థలనూ, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని అంకితభావంతో గౌరవించుట.

బి) స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అన్ని రంగాలలో వ్యవహరించుట.

సి) దేశ సార్వభౌమత్వాన్ని, సమన్వయతనూ, సమగ్రతను రక్షించుట.

డి) దేశరక్షణలో అనుక్షణం సంసిద్ధుడై ఉండుట.

ఇ) ప్రజాజీవనంలో అన్యోన్యతనూ, భ్రాతృభావాన్ని పోషించుట, మత, భాష ప్రాంతీయతత్త్వాలకు వర్గవైరుధ్యములకు అతీతముగా ఉండుట. స్త్రీలను అగౌరవపరచే ఆచారములను విడనాడుట.

ఎఫ్) అమూల్యమైన భారతీయ చారిత్రక సంపదనూ, సుసంపన్న సంస్కృతినీ పరిరక్షించుట.

జి) పర్యావరణాన్ని అడవులను, కొలనులనూ, నదులనూ రక్షించుట, అభివృద్ధి పరచుట, మృగరక్షణ జలజంతు జీవరాసులపై కరుణార్ద్రత.

హెచ్) శాస్త్రీయ మరియు మానవతా దృక్పథాలను అలవరచుకొనుట, జిజ్ఞాసను పెంపొందించు కొనుట, సంస్కరణ తత్త్వమును పెంపొందించుట.

ఐ) హింసను విడనాడుట, ప్రజల ఆస్తుల విధ్వంసం చర్యలను నిరోధించుట.

జె) వ్యక్తిత్వ శక్తి సామర్థ్యాల ఔన్నత్యాన్ని పెంపొందించుకొనుట ద్వారా మరియూ సమిష్టికృషి ద్వారా అన్ని రంగాలలో గణనీయమైన స్థాయిని చేరుటకొరకు, శిఖరాగ్ర సాధనకొరకు నిరంతరంకృషి సల్పుట.

కె) రక్షకులు లేదా సంరక్షకులుగా ఉన్నవారందరూ 6 నుంచి 14 సంవత్సరముల లోపల పసివారికి విద్యాభ్యాసము చేయు అవకాశమును కల్పించవలెను.

## జాతీయ గీతము

జనగణమన – అధినాయక జయ హే
భారత – భాగ్యవిధాతా
పంజాబ, సింధు, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కల, బంగ,
వింధ్య, హిమాచల, యమునా, గంగా,
ఉచ్ఛల జలధితరంగ,
తవ శుభ నామే జాగే, తవ శుభ ఆశిస మాగే,
గాహే తవ జయగాథా,
జనగణ మంగలదాయక జయ హే,
భారత – భాగ్యవిధాతా
జయ హే, జయ హే, జయ హే,
జయ జయ జయ, జయ హే

## ప్రతిజ్ఞ

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరు నా సహోదరులు.

నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడచుకొంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధిలే నా ఆనందానికి మూలం.

# ప్రస్తావన

బాలమిత్రులారా!

నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనది. మీ చేతికి అందిన ఈ ఆరవతరగతి తెలుగు బాలభారతి పాఠ్యపుస్తకము మీకు తప్పక ఆనందాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం.

ఈ పాఠ్యపుస్తకంలోని కవితలు, పద్యాలు అన్నీ కూడా మీకు నచ్చుతాయి. మీరు వాటిని ఆనందంగా చదువుతారు, పాడుతారు కూడా. వివిధ పాఠాలు మరియు సాహిత్య రచనలు చదివేటప్పుడు మీకు మీ స్వీయ అనుభవాలు గుర్తుకు వస్తాయి. పాఠ్యపుస్తకంలోని పాఠాలు మరియు కవితలను అర్థం చేసుకుంటూ చదివేటపుడు మీ ఊహాశక్తికి ప్రేరణ లభిస్తుంది. ప్రతి పాఠం, కవిత మొదలగు వాటికి సందర్భోచితంగా ఇచ్చిన ఆకర్షణీయమైన రంగుల చిత్రాలు పాఠ్యాంశాన్ని మరింత బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడతాయి. ఈ పుస్తకము విద్యాభ్యాసానికి మాత్రమే కాక మీ ఆలోచనాశక్తి, కృత్యకౌశల్యం కూడా అభివృద్ధి చెందడానికి ఉపయోగపడుతుంది.

''పదజాలం పెంపొందించుకుందాం'' అను శీర్షిక కింద ఇవ్వబడిన పాఠంలోని కొత్తపదాలను మరలా మరలా చదవండి. అర్థాన్ని గ్రహించండి. మాట్లాడేటప్పుడు ఆ పదాలను సరైన రీతిలో ఉపయోగించండి. దీనివలన తెలుగుభాషలోని వివిధ పదాలు పరిచయమవుతాయి. తద్వారా మీరు తెలుగుభాషను చక్కగా మాట్లాడగలుగుతారు. భాషను గురించి తెలుసుకుందాం, భాషావగాహన ద్వారా పరిపుష్టమైన భాషోపయోగం కొరకు ఆవశ్యకమైన వ్యాకరణం సులభంగా అర్థమవుతుంది. స్వీయస్పందన, ప్రసారమాధ్యమాలు, ప్రాజెక్టుపని, గద్య పద్య చర్చ మొదలగు కృత్యాలద్వారా భాషాజ్ఞానం, అవగాహన, అభివృద్ధి చక్కగా అలవడుతాయి. "సృజనాత్మకత'' శీర్షిక ద్వారా మీలో దాగి ఉన్న సృజనశీలతను వ్యక్తపరచడానికి చక్కని అవకాశం లభిస్తుంది. వివిధ భాషా క్రీడల ద్వారా పదసంపద అభివృద్ధి చెందుతుంది.

ఈ విధంగా వివిధ కృత్యాలు, కార్యక్రమాల నిర్వహణల ద్వారా భాషపై ఆసక్తి పెరుగుతుంది. పుస్తకాలు, వార్తాపత్రికలు, వ్యాసాలు. కంప్యూటర్ మొదలగు వాటి సహాయంతో ఉపయుక్తమైన నూతన సమాచారాన్ని పొందడం అలవడుతుంది.

వీటన్నిటి ద్వారా మీరు శుద్ధమైన, స్పష్టమైన మరియు ప్రభావంతమైన తెలుగు భాషను మాట్లాడటం, చదవడం, రాయడం నేర్చుకుంటారు. ఇంట్లో, పాఠశాలలో, ఆటల సందర్భంలో, స్నేహితులతో, ఇతరులతో చక్కనైన తెలుగుభాషను సగర్వంగా ఉపయోగిస్తారు. బాలమిత్రులారా! ఈ పాఠ్యపుస్తకంతో స్నేహం చేయండి, ఆసక్తిగా చదవండి, అర్థం చేసుకోండి, మాట్లాడండి, రాయండి మరియు ఆనందంగా నేర్చుకోండి.

మీ విద్యా ప్రయాణానికి మరియు మీ తెలుగు భాషా ప్రగతికి హృదయపూర్వక శుభాకాంక్షలు.

(అనురాధ ఓక్)
సంచాలకులు,
మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్య పుస్తక నిర్మితి మరియు
పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ,
పుణె-411004.

పుణె
తేది : 1 మే 2026
భారతీయ సౌరమాన తేది : వైశాఖం11, 1948
మహారాష్ట్ర దినోత్సవం

# ఆరవవ తరగతి తెలుగు బాలభారతి (ప్రథమ భాష) - అధ్యయన ఫలితాల జాబిత

| క్రమ సంఖ్య | లక్ష్యం | అధ్యయన ఫలితాలు | పుట సంఖ్యలు |
|---|---|---|---|
| 1 | 1.1.1 | విన్న మరియు చదివిన వార్తల్లోని ముఖ్యాంశాలను, సారాంశాన్ని చెబుతారు | 5,59,71,72,75 |
| 2 | 1.1.2 | ప్రకటనలను అవగాహన పూర్వకంగా చదువుతారు మరియు ప్రకటనలపై ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇస్తారు. | 21,95,96,97 |
| 3 | 1.2.1 | పరిచిత వ్యక్తుల ఇంటర్వ్యూలను చూస్తారు. మరియు వారి ఇంటర్వ్యూలను ప్రణాళిక చేస్తారు మరియు నిర్వహిస్తారు. | 64,93 |
| 4 | 1.3.1 | సరైన భాషను ఉపయోగించి సామాజిక అనుభవాల గురించిన అధికారిక, అనధికారిక ప్రశ్నలు అడుగుతారు. | 92,93 |
| 5 | 1.4.1 | యోగ్య శైలిని ఉపయోగించి వివిధ ప్రయోజనాల కొరకు అనధికారిక లేఖలు, విమర్శనాత్మక వ్యాసాలు మరియు నివేదికలు రాస్తారు. | 28,29,31,32,37,76 |
| 6 | 1.5.1 | దృశ్య, శ్రావ్య లేక దృశ్యశ్రావ్య మాధ్యమాల కొరకు విషయానుసారం మరియు సందర్భానుసారం నినాదాలు, సందేశాలు మరియు సంభాషణ లేఖనం చేస్తారు. | 4,14,31,49 |
| 7 | 2.1.1 | వివిధ సంస్కృతి మరియు కాల వ్యవధిలోని సాహిత్యంలో వివిధ రకాలను ఆస్వాదిస్తారు మరియు విశిష్టతను చెబుతారు. (జానపద సాహిత్యం మరియు మహారాష్ట్రలోని వివిధ మాండలిక భాషలోని సాహిత్యం) | 65,66,70,86,87,99 |
| 8 | 2.2.1 | తెలుగు సంధులు (ఉకార, ఇకార, యడాగమాదులు), సమాసములు-రకాలు, సంధులు-రకాలను గుర్తించి సంబోధిస్తారు మరియి ఉదాహరణ చెబుతారు. | 5,10,13,19,22,30,32,33, 36,37,40,41,44,48,49 |
| 9 | 2.2.2 | పాఠ్యాంశంలోని సామెతలు, జాతీయాల అర్థాలను వివరించి సొంత వాక్యములలో ఉపయోగిస్తారు. వివిధ గడినుడులను సాధిస్తారు. వివిధ పొడుపు కథలను విప్పుతారు. | 11,12,24,25,26 |
| 10 | 2.3.1 | ఇంట్లో మరియు స్థానికంగా జరుపుకొనే వేడుకలు, పండుగలపై తమ అభిప్రాయాలను మౌఖిక మరియు రాతపూర్వకంగా వ్యక్తపరుస్తారు. | 38,39,91 |
| 11 | 3.1.1 | నామవాచకము, నామవాచక రకాలు, సర్వ నామము, విశేషణము మరియు విశేష్యము, విశేషణ రకాలు, క్రియా మరియు క్రియల-రకాలు, అనులేఖన నియమాలు వ్యాకరణ అంశాలు వివరాలు తీసుకుంటారు. మరియు దానిని లేఖనములో సరైన పద్ధతిలో ఉపయోగం చేస్తారు. | 5,10,15,22,27,32,33, 37,41 |
| 12 | 3.2.1 | కథ మరియు కవిత ఈ సాహిత్య రకాల విశిష్టతలను, భిన్నత్వం, శైలి, ముఖ్యాంశాలు గుర్తిస్తారు. | 14,17,35,56,70,86,87 |
| 13 | 3.3.1 | సొంత భాషలో కథ మరియు కవితలను రాస్తారు. | 5,68,69,90,92,93 |
| 14 | 4.1.1 | వివిధ సాహిత్య రకాల పుస్తకాలను చదువుతారు. వాటి సారాంశాన్ని వివరిస్తారు మరియు రాస్తారు. | 56,59,64,65,66 |
| 15 | 4.2.1 | ప్రాజెక్టులు, ఉపక్రమాల కొరకు అధ్యాపకుల సహకారంతో సందర్భాన్ని శోధిస్తారు. | 16,45 |
| 16 | 4.3.1 | వివిధ నియతకాలిక పత్రికలలోని సంఘటనలను చదువుతారు. తమ అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తారు. | 5,59,71,72 |
| 17 | 5.1.1 | భాషలోని వర్ణమాల యొక్క అచ్చులు, హల్లులు, ఉచ్చారణ విషయాలు మొదలగు మౌలిక వివరాలు వివరిస్తారు. | 3,4 |
| 18 | 5.2.1 | ప్రసంగం ఎక్కువ మనోరంజకం, ఆనందదాయకం కావడానికి భాషలోని ప్రాసలు, అనుకరణలు ఉపయోగపడును. | 23,42,55 |
| 19 | 5.3.1 | వివిధ భాషా క్రీడలు ఆడుతారు. (ఉదాహరణ: అక్షరాలు తారుమారు చేసి వివిధ రీతులలో ఉపయోగించి వినోదాత్మక క్రీడలు తయారు చేస్తారు.) | 23,25,26 |
| 20 | 5.4.1 | సులభ పొడుపు కథలు, గడినుడి సొంతంగా తయారు చేస్తారు. | 23,25,26 |

## ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు.....

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక సంస్థ నూతన పాఠ్య ప్రణాళికానుసారం ఆరవతరగతి తెలుగు బాలభారతి (ప్రథమ భాష) పాఠ్యపుస్తకాన్ని రూపొందించినది. ఆరవ తరగతి విద్యార్థుల వయోపరిమితి, గ్రహణశక్తి మరియు ఈ తరగతిలో వారు పొందవలసిన అధ్యయన ఫలితాలను దృష్టిలోనుంచుకొని పాఠ్యాంశాల ఎంపిక జరిగినది. బోధనాధ్యయన ప్రక్రియ విద్యార్థి కేంద్రముగా, ఆనందదాయకముగా నుండవలెను; స్వీయ అధ్యయనానికి ప్రాధాన్యత నివ్వవలెనను దృక్పథముతో ఈ పాఠ్యపుస్తకము తయారుచేయబడినది.

పాఠ్యపుస్తకము విషయసూచికకు ముందుఇచ్చిన అధ్యయన ఫలితాలను (లెర్నింగ్ అవుట్‌కమ్స్), వాటి ప్రక్కన ఇవ్వబడిన పుటల సంఖ్యను గమనించండి. ఆయా అధ్యయన ఫలితాలను సాధించుటకుగాను అంశాలు పాఠ్యపుస్తకములో ఎచ్చటెచ్చట ఇవ్వబడినవో ఆ పుటల సంఖ్యలు తెలియజేస్తాయి. ఈ విధంగా ఒక్కొక్క అధ్యయన ఫలితాన్ని దానిని సాధించుటకుగాను, పాఠ్య పుస్తకంలో ఇచ్చిన అధ్యయన అనుభవ (లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్) అంశాలను గమనించి దానిపై దృష్టిని కేంద్రీకరించి, అధ్యయన అధ్యాపనలు సాగినచో విద్యార్థులు పెంపొందించ వలసిన అధ్యయన ఫలితాలను పొందుట సాధ్యమవుతుంది.

విద్యార్థులలో మాతృభాషపై మక్కువ, అభిరుచి కలగాలి. వారిలో జ్ఞానము, ఆలోచనా శక్తి అభివృద్ధి కావాలి. సమాచారాన్ని/విషయాన్ని జ్ఞాపకముంచు కొనుటకంటే 'బూమ్స్ టాక్సానమీ' ప్రకారం ఉత్తరోత్తర అర్థం చేసుకొనుటకు, అన్వయించుటకు, విశ్లేషించుటకు, సృష్టించుటకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలి.

విద్యార్థులు భాషపై పట్టు సాధించాలి. పాఠశాల విద్య నిజ జీవితంలో ఉపయోగపడాలి. నైతిక విలువలను పాటిస్తూ, సమాజానికి ఉపయోగపడే సంస్కారవంతులైన దేశభక్తిగలిగిన ఉత్తమ పౌరులుగా రూపొందాలి.

పాఠ్యపుస్తకంలోని విషయాల అధ్యాపనులను సమర్థవంతంగా నిర్వహించడమేగాక, అధిక సమాచారాన్ని విద్యార్థులే స్వయంగా, ఉత్సాహంగా పొందినట్లు సహకరిస్తూ, ఉపాధ్యాయులు బోధకులుగా గాక సహకారి (ఫెసిలిటేటర్)గా వ్యవహరింపవలసి యున్నది. విద్యార్థులను ఆలోచించజేసి, వారు ప్రశ్నించడం ద్వారా విషయ పరిజ్ఞానం పొందుట్లు చేయవలెను. విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేస్తూ, వారి నైపుణ్యాలను, సృజనాత్మకతను వెలికితీస్తూ, విద్యార్థుల మధ్య చర్చలను ప్రోత్సహిస్తూ, జట్టు పనులు, ప్రాజెక్టులు మొదలగువాని ద్వారా స్వయంగా నేర్చుకునే ప్రక్రియను సులభతరం చేయవలసియున్నది.

ఇందుకు గాను ఆయా అధ్యయన ఫలితాలకొరకు ఇవ్వబడిన పాఠ్యాంశాలు, అభ్యాసకృత్యాల కొరకు ఇచ్చిన ప్రశ్నలు, జతపరచుట, భాషావగహన, స్వీయస్పందన, ప్రసారమాధ్యమాలు, సృజనాత్మకత, జట్టుపని, భాషనుగురించి తెలుసుకుందాం అను శీర్షికలో ఇచ్చిన కార్యాత్మక వ్యాకరణం మొదలకు అంశాలు తోడ్పడుతాయి.

ఆరవతరగతి పూర్తయ్యేవరకు అన్ని అధ్యయన ఫలితాలను సాధించేలా విద్యార్థులను ప్రోత్సహించండి.

ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల అధ్యయన అధ్యాపన ప్రక్రియలో సంకేత భాష (Sign language) మరియు ఇతర అదనపు అధ్యాయన శాస్త్ర పద్ధతులనుయోగించవలెను. ప్రత్యేకావసరాలుగల విద్యార్థులకు సాధ్యమగు పద్ధతిలో వ్యక్తరచుటకు అవకాశం కల్పించాలి.

## విషయ సూచిక


1. భరతమాత పుత్రులం........................ 1
- కీ.శే. సమతారావు

2. మళ్లీ ఓడిన కుందేలు.......................... 6
- శ్రీ. కె. వి. లక్ష్మణరావు

3. నమ్మకం.................................... 11
- శ్రీ. టి.ఎస్. రావు

4. కృషి ప్రశస్తి .................................. 17
- కీ.శే. బోయి భీమన్న

● ప్రకటనలు ................................. 21

5. భాషా గమ్మత్తు ............................. 23

6. మిత్రునికి లేఖ .............................. 28

7. పోరునష్టం - పొందులాభం................ 34
- కీ.శే. కవి రావు

8. రాఖీ పండుగ ............................... 38

9. మన చేతుల్లోనే మన ఆరోగ్యం.............. 42
- శ్రీ. చొప్పదండి సుధాకర్

● సులభమైన వంట - తీపి తీపి వంట..... 46

10. సైనికుడు ................................. 47
- శ్రీమతి రోహిణి

11. అక్షరాల తోవ ............................. 50
- శ్రీ. ఆర్. సి. కృష్ణస్వామి రాజు

12. ఆదర్శ గ్రామము.......................... 56
- శ్రీ. గుర్రాల లక్ష్మారెడ్డి

13. బెదురు................................... 60
- శ్రీ. బెలగాం భీమేశ్వరరావు

14. శతక పద్యాలు ........................... 65
- కీ.శే. మారద వెంకయ్య

● జానపద సాహిత్య ఆస్వాదన.............. 70

15. వార్తా పత్రిక కత్తిరింపు చదువుదాం...... 71
- శ్రీ. షేక్ అబ్దుల్ హకీంజాని

16. శకునఫలం ............................... 77
- డా|| మహీధర నళినీమోహన్

17. సిద్ధించిన లక్ష్యం ......................... 82
- శ్రీ. కె. వి. లక్ష్మణరావు

18. గుర్రంగుడ్డు కథ ........................... 86

19. ధన్యజీవి.................................. 91
- శ్రీ. కల్లూరి ప్రభాకరాచారి

20. రహదారి భద్రతా వారోత్సవాలు ......... 95

21. మర్యాద రామన్న తీర్పు.................. 99
- డా|| దాసరి వెంకటరమణ

# 1 భరతమాత పుత్రులం

**నేపథ్యం :** నేటి బాలలే భావి భారత పౌరులు. ఆడుతూ, పాడుతూ పెద్ద చదువులు చదవాలి. తెలివి తేటలు పెంచుకోవాలి. దేశానికి సేవ చేయాలి. దేశాన్ని ప్రగతి పథంలో నడపాలి. వీటిని ఏవిధంగా పెంపొందించుకోవాలో ఈ గేయం ద్వారా తెలుసుకుందామా!



బాలసంఘ సభ్యులం! భరతమాత పుత్రులం.
భవిష్యత్తు తీర్చిదిద్దు, భావిభారత పౌరులం.
చదువులన్ని నేర్చెదం, మెదడు తీర్చిదిద్దెదం
తెలివితేటలన్ని నేర్చి, వెలుగుబాట నడచెదం.
ఆటలెన్నో ఆడెదం, పాటలెన్నో పాడెదం.
ఆటపాటలందు మేము, రాటుదేలి సాగెదం
దేశభక్తి నేర్చెదం, దేశసేవ జేసెదం
దేశమంటే మనుషులన్న, దివ్యబోధ మెచ్చెదం.
జాతి జెండానెత్తెదం, జాతిగీతి పాడెదం
జాతినేతలైన వారి, ప్రీతిగ పూజించెదం
సత్యమెపుడు పలికెదం, కాంతి బాట నడచెదం
శాంతి కాంతి లోకమంత, వెల్లివిరియ జేసెదం
సమత సాధించెదం, మమత లతలు పెంచెదం
జగతినంత సౌఖ్యజలధి నోలలాడించెదం.





గమనిక : ఈ చిత్రంలోని జాతీయ పతాకపు రంగులకు అధికార రీత్యా నిర్ణయించబడిన రంగులకు వ్యత్యాసమున్నచో ముద్రణాలోపమని గమనించగలరు.

**కవిపరిచయం :** **కీ.శే. చావలి రామచంద్రరావు (కలం పేరు సమతారావు)** గారు తమ రచనల ద్వారా బాలల్లో చదివే అలవాటును, ఆలోచనాశక్తిని, మంచి జ్ఞానాన్ని పెంపొందించారు. బాల సాహిత్యంలో వీరు చేసిన కృషికి గుర్తింపుగా తెలుగు బాలల రచయితల సంఘం స్వర్ణోత్సవాలలో ఘనసన్మానాన్ని పొందారు. **వెలుగుపూలు, చిన్నారిపాపలు, తెలుగు వెలుగులు, గేయకథలు** మొదలగునవి వీరి ఇతర రచనలు. ప్రస్తుత పాఠ్యభాగం వీరు రచించిన ''బాలల గేయాలు'' నుండి గ్రహించబడినది.

## I సంభాషించండి - చర్చించండి :

(1) ఆటలు - పాటలు; (2) నేటి విద్యార్థులే భావిభారత పౌరులు

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి :

### అ) పదజాలం పెంపొందించుకుందాం :

రాటుదేలి= నిగ్గుదేలి; కాంతి బాట = వెలుగు మార్గము; వెల్లివిరియు = ప్రకాశింపచేయు; మమత లతలు = అనురాగము అనెడి తీగలు; సౌఖ్యజలధి = సుఖము అనెడి సముద్రము; జగతినంతా = ప్రపంచమునంతా.

### ఆ) కింది ఖాళీలను కుండలీకరణంలోని సరియైన పదాలతో పూరించండి.

(పెంచెదం, భావిభారత, దేశసేవ, ప్రీతిగ, వెల్లివిరియ)



1) భవిష్యత్తు తీర్చిదిద్దు .............. పౌరులం.

2) దేశభక్తి నేర్చెదం ..................... జేసెదం.

3) జాతినేతలైన వారి .............. పూజించెదం.

4) సమత సాధించెదం, మమత లతలు ..................

### ఇ) కింద కొన్ని గేయపంక్తులు ఇవ్వబడినవి. వాటిని చదివి, అర్థం చేసుకొని, మీ ఆలోచనలు జట్టువారితో చర్చించండి. వాటి అర్థాన్ని లేఖన పుస్తకంలో రాయండి.

1) ఆటలెన్నో ఆడెదం, పాటలెన్నో పాడెదం;

ఆటపాటలందు మేము, రాటుదేలి సాగెదం.

2) బాలసంఘ సభ్యులం! భరతమాత పుత్రులం.

భవిష్యత్తు తీర్చిదిద్దు; భావిభారతపౌరులం.

### ఈ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.

1) విద్యార్థులు ఏ విధంగా తమ తెలివి తేటలను పెంచుకుంటారు?

2) దేశసేవ ఏయే రంగాల ద్వారా చేయవచ్చు?

3) గేయ భావాన్ని మీ సొంతమాటల్లో రాయండి.

ఉ) **అనులేఖనం :**

**విరామ చిహ్నాలను పాటిస్తూ అనులేఖనం చేయండి.**

ఆటపాటలందు మేము, రాటుదేలి సాగెదం

దేశభక్తి నేర్చెదం, దేశసేవ జేసెదం

దేశమంటే మనుషులన్న దివ్యబోధ మెచ్చెదం.

ఊ) **అచ్చులు, హల్లులు, సంయుక్తాక్షరాలు, ద్విత్వాక్షరము, ఉచ్చారణ- మూల భూత అంశాలు**

- ఉదాహరణ చూసి కింది అక్షరాలు విడదీయుము.

ఉదా: 1) కా = క్ + ఆ 2) గి = ......... + ......... 3) చో = ........ + ...... 4) ఢై = ........ + ......

ఎ)

**జతపరచండి.**

| | |
|---|---|
| పాటలు | వ్ + ఎ + ల్ + ఉ + గ్ + ఉ |
| వెలుగు | జ్ + ఆ + త్ + ఇ |
| జాతి | ప్ + ఆ + ట్ + అ + ల్ + ఉ |
| ప్రీతిగ | అ + క్ + క్ + అ |
| అక్క | ప్ + ర్ + ఈ + త్ + ఇ + గ్ + అ |

## భాషావగాహన

అ) **గుర్తించిన పదాలకు నిఘంటువు సహాయంతో పర్యాయ పదాలు రాయండి.**



ఉదా: జాతి <u>జెండా</u> నెత్తెదం

జ) పతాకం, కేతనం

1) తెలివి తేటలన్ని నేర్చి వెలుగు <u>బాట</u> నడిచెదం.

2) దేశమంటే <u>మనుషులన్న</u> దివ్య బోధ మెచ్చెదం.

3) జాతి <u>పాట</u> పాడెదం.

ఆ) **గేయంలో వచ్చిన ప్రాసపదాలు ఉపాధ్యాయుని సహాయంతో రాయండి.**

ఇ) **కింది పదాలను కలిపి రాయండి.**



1) చదువులు + అన్ని = ..........

2) దేశము + అంటే = ..........

3) జెండాను + ఎత్తెదం = ..........

4) సత్యము + ఎప్పుడు = ..........

ఈ) జతపరచండి :

| పరుషములు | వర్గద్వితీయ చతుర్థాక్షరములు |
|---|---|
| సరళములు | క, చ, ట, త, ప |
| వర్గయుక్కులు | ఙ, ఞ, ణ, న, మ |
| అనునాసికములు | గ, జ, డ, ద, బ |
| అంతస్థములు | క నుండి మ వరకు గల అక్షరములు |
| ఊష్మములు | య ర ల వ |
| స్పర్శములు | శ ష స హ |

ఉ) జతపరచండి :

| పదము | విగ్రహవాక్యము |
|---|---|
| 1) దేశభక్తి | అ) జాతి యొక్క గీతి |
| 2) దివ్యబోధ | ఆ) దేశము నందు భక్తి |
| 3) జాతిగీతి | ఇ) దివ్యమైన బోధ |

## సృజనాత్మకత

కింది నినాదాలను అభినయంతో పలకండి.



## ప్రసార మాధ్యమాలు

1) వార్తా పత్రికలు, టీ.వి., అంతర్జాలంలో వచ్చే దేశభక్తి గేయాలను చూచి, విని సొంతంగా రెండు గేయాలను రాయండి.

2) ''దేశమంటే మనుషులోయ్'' అని ఎలుగెత్తిచాటిన కవిని గురించి తెలుసుకొని రాయండి.

**విద్యార్థి సూచన**

1) మీకు నచ్చిన దేశభక్తి గేయానికి తగిన బాణిని కూర్చి అభినయంతో పాడండి.

2) వివిధ దేశాల జాతీయ పతాకాలను సేకరించి ఆల్బమ్ తయారు చేయండి.

## భాషను గురించి తెలుసుకుందాం.

### సమాసము

**సమర్థవంతమయిన రెండు లేక అంతకు మించిన పదములు ఏకపదముగా ఏర్పడుటను 'సమాసము' అందురు.**

సామాన్యముగా సమాసములో రెండు పదములు ఉండును.

మొదటి పదమును **'పూర్వపదము'** అని, రెండవపదమును **'ఉత్తర పదము'** అని అందురు.

సమాసము నందలి పదములకు విభక్తులను చేర్చి అర్థమును వివరించుటను **'విగ్రహవాక్యము'** అందురు. సమాసము చేసినపుడు విభక్తులు లోపించును.

**సమాసములో పదములకున్న ప్రాధాన్యతను బట్టి సమాసములు 4 విధములుగా విభజింపబడినవి.**

అవి (1) ద్వంద్వ సమాసము (2) అవ్యయీభావసమాసము

(3) తత్పురుష సమాసము (4) బహు వ్రీహి సమాసము.

కర్మధారయము దీనిలోని విభాగమే.

### ద్వంద్వ సమాసము

**ఉపాధ్యాయుడు :** **'ద్వంద్వము'** అనగా రెండు, జత, జంట అని అర్థం.

ఉదా: అన్నదమ్ములు. ఇందులో రెండు పదములు ఉన్నవి కదా! ఇందులోని రెండు పదాలు **సమాన ప్రాధాన్యము కలవి**. కాబట్టి ఇది **'ద్వంద్వ సమాసము'**.

దీని విగ్రహవాక్యము – **అన్నయును, తమ్ముడును.**

ఇప్పుడు కింది ద్వంద్వ సమాస పదములకు విగ్రహవాక్యాలు చెప్పండి.



**1) మంచి చెడ్డలు 2) తల్లి దండ్రులు 3) పగలు రాత్రులు**

**విహాన్ :** మంచియును చెడ్డయును. **హోప్ :** తల్లియును తండ్రియును. **నవీన్ :** పగలుయును రాత్రియును.

# 2 మళ్లీ ఓడిన కుందేలు

నేపథ్యం : తనమీద తనకున్న అతివిశ్వాసం మరియు నిర్లక్ష్యాల కారణంగా ప్రత్యర్థి తాబేలును తక్కువ అంచనావేసి ఓడిపోయిన కుందేలు కథ తెలుసుకదా! అదే కుందేలు మళ్ళీ పందెం ఎందుకు వేసిందో? ఎలా ఓడిందో? తెలుసుకుందామా!

పరుగు పందెంలో ఓడిపోయిన కుందేలు.. దిగాలుగా కూచుంది. తాబేలును తక్కువ అంచనా వేసినందుకే ఓడిపోయానని అనుకుంది. అందుకే మళ్లీ పందెం పెట్టి ఎలాగైనా దానిపై గెలవాలని నిశ్చయించుకుంది. అనుకున్నదే తడవు గబగబా వెళ్లి 'మళ్లీ పరుగుపందెం పెట్టుకుందాం. ఈసారి ఖచ్చితంగా నేనే గెలుస్తా' అంది తాబేలుతో.

'మిత్రమా! నువ్వు ఆవేశంగా ఉన్నావు. ఇలాంటప్పుడు ఏ నిర్ణయం తీసుకోకూడదు' అంది తాబేలు. అయినా కుందేలు వినిపించుకోకుండా రాజేష్ దగ్గరకెళ్ళింది.

రాజేష్ అయిదో తరగతి చదువుతున్నాడు. బళ్ళో పరుగు పందెం పోటీల్లో గెలవాలని సాధన చేస్తున్నాడు.

తాబేలును సునాయసంగా రాజేష్ ఓడించగలడు అనుకుంది. దగ్గరకెళ్ళి పరుగు పందెం విషయం చెప్పి బతిమాలింది. రాజేష్‌కి తెల్లగా, ముద్దుగా ఉండే కుందేలంటే ఇష్టం. అందుకే తాబేలును ఓడించేందుకు ఒప్పుకున్నాడు.

కుందేలు ఉత్సాహంగా తాబేలుతో 'మిత్రమా! నన్ను ఓడించటం కాదు. రాజేష్‌ని ఓడించి, అప్పుడు నీది నిజమైన గెలుపు అనిపించుకో' అంది.

'నేను గెలిస్తే... నువ్వు మళ్లీ ఓడానని ఒప్పుకుంటావా! అడిగింది తాబేలు.

'అదృష్టం అన్నిసార్లూ కలిసిరాదు. నువ్వసలు గెలిస్తే కదా!' అంది వెటకారంగా కుందేలు.

సరే! చూద్దాం. అంటూ పందానికి ఒప్పుకుంది తాబేలు.

పందాన్ని ప్రారంభించిన కుందేలు 'ఊరి చివర మర్రి చెట్టు కింద ఒక ఎర్ర రిబ్బను ఉంది. దాన్ని ముందుగా తెచ్చిచ్చిన వాళ్ళు విజేత' అంది.

కుందేలు విజిల్ వేయగానే రాజేష్ మెరుపు వేగంతో పరుగుపెట్టాడు. తాబేలు తన సహజ ధోరణితోనే మెల్లగా నడుచుకుంటూ వెళ్తోంది. తాబేలు ఓడిపోవడం ఖాయమని కుందేలు తెగ సంబరపడుతోంది.

వేగంగా వెళ్తున్న రాజేష్ జేబులోని సెల్‌ఫోన్ మోగింది. వెనక్కి చూశాడు. తాబేలు కనుచూపు





మేరలో కనిపించలేదు. తాబేలింకా ఇక్కడి దాకా రాదులే' అనుకున్నాడు. అలవాటు ప్రకారం సెల్‌ఫోన్‌లో లీనమై పోయాడు. కొంత సమయం గడిచింది. పరుగు పరుగున మర్రిచెట్టు దగ్గరకు వెళ్లాడు. రిబ్బన్ ముక్క కనిపించలేదు.

వాడిలో ఒకటే కంగారు. మరింత వేగంగా కుందేలున్న చోటుకి వెళ్లాడు. కాని ఏమి లాభం.. అప్పటికే తాబేలు రిబ్బను ముక్కను కుందేలు చేతికిస్తోంది.

ఫలితం తాబేలు మళ్లీ పందెంలో గెలిచింది. రాజేష్ ఓడిపోయాడు, ఆశ్చర్యపోవడం కుందేలు వంతయింది.

రాజేష్ తన ఓటమిని ఒప్పుకుంటూ తాబేలును అభినందించాడు. కుందేలుతో 'నువు చేసిన పొరపాటే నేనూ చేశాను. నీలానే ఓడిపోయాను'. అంటూ రాజేష్ బాధపడ్డాడు.

తాబేలు వారిద్దరివైపు చూసి మిత్రులారా! గెలుపోటములు దైవాధీనం! కానీ ఏ పనినైన నిర్లక్ష్యం చేయరాదు, దృఢ నిశ్చయంతో ముందు కెళ్ళాలి, దాని పైననే మనస్సు కేంద్రీకరించాలి. అపుడే విజయం మనది అవుతుంది'' అంది.

కుందేలు, రాజేష్ ''నిజమే మిత్రమా! చక్కగా చెప్పావు మేము ఇకముందు అలాగే నడుచుకుంటాం''. అంటూ తాబేలుకు ధన్యవాదాలు చెప్పారు.



**రచయిత పరిచయం :** **కొక్కెరగడ్డ వెంకట లక్ష్మణరావు** (కె.వి. లక్ష్మణరావు) గారు కామశాస్త్రి, అన్నపూర్ణ దంపతులకు మానేపల్లి గ్రామం, డా॥ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు జన్మించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరి కథా రచనలు అనేకం పత్రికలలో ప్రచురితం అయ్యాయి. **'అంతా ఒక్కటే, టక్కరి మొసలి, సింహానికి జలుబు చేసింది, సమయం కన్నా-సాయం మిన్న'** మొదలగు బాలల కథా పుస్తకాలు కూడా వెలువడ్డాయి. ప్రస్తుత పాఠ్యభాగం వీరి బాలల కథా పుస్తకం నుండి గ్రహింపబడినది.

## I సంభాషించండి - చర్చించండి :

అ) 'గెలుపోటములు దైవాధీనం'.

ఆ) 'నువు చేసిన పొరపాటే నేనూ చేశాను, నీలానే ఓడిపోయాను'.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి :

### అ) పదజాలం పెంపొందించుకుందాం :

వెటకారం = ఎగతాళిచేయడం; విజేత = విజయం పొందిన వాడు; ధోరణి = వ్యవహారపద్ధతి;

సునాయాసంగా = తేలికగా; పొరపాటు = తెలియక చేసిన తప్పు.

### ఆ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.

1. 'అదృష్టం అన్ని సార్లూ కలిసిరాదు' కుందేలు ఈ మాటలు ఎందుకు అన్నది, ఆలోచించండి. రాయండి.
2. ఈ కథలో కుందేలు, తాబేలు మాట్లాడుకున్నాయి కదా. ఈ విధంగా జంతువులన్నీ మనలాగానే మాట్లాడితే మనుషుల గురించి అవి ఏం మాట్లాడుకుంటాయి... ఊహించి సొంతంగా కథగా రాయండి.

## భాషావగాహన

### అ) కింది పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించి రాయండి.

| | |
|---|---|
| 1. కనుచూపుమేర | |
| 2. మెరుపు వేగం | |
| 3. దృఢ నిశ్చయం | |

### ఆ) కింది వాక్యాల్లోని వ్యతిరేక పదాలు గుర్తించి రాయండి.

ఉదా: ఎత్తు పల్లములుగల రహదారిపై జాగ్రత్తగా నడవండి. **ఎత్తు × పల్లము**

1) గెలుపు ఓటములు దైవాధీనములు. ..............................

2) కుందేలు వెనుక ముందు ఆలోచించకుండా తాబేలును సవాలు చేసింది. ..............................

### ఇ) గీత గీసిన ప్రత్యయములు ఏ విభక్తులో రాయండి.

1) మర్రిచెట్టు దగ్గర<u>కు</u> వెళ్ళాడు.

2) తాబేలు<u>ని</u> అభినందించాడు.

3) మెరుపు వేగం<u>తో</u> పరిగెత్తాడు.

**ఈ) కింది పదాలను కలిపి రాయండి.**

| | |
|---|---|
| 1. ఓడిపోయాను + అని | |
| 2. కుందేలు + ఉన్న | |
| 3. తాబేలు + ఇంక | |



**ఉ) జతపరచండి.**

| పదం | విగ్రహ వాక్యం |
|---|---|
| 1) మర్రి చెట్టు | అ) గెలుపును ఓటమియును |
| 2) గెలుపోటములు | ఆ) సహజమైన ధోరణి |
| 3) సహజ ధోరణి | ఇ) మర్రి అనుపేరు గల చెట్టు |

**ఊ) కింది సంయుక్తాక్షర, ద్విత్వాక్షర పదాలను విడదీయండి.**

ఉదా: సత్యము = స్ + అ + త్ + అ + య + మ్ + ఉ

(1) భక్తి = ..................... (2) దిద్దు = ............................ (3) వెల్లివిరియు = ............................

- **ఇచ్చిన పదాలతో గీత గీసిన అక్షరాలకు సరైన ఒత్తులు కుండలీకరణము నుండి గ్రహించి, అర్థవంతమైన పదాలుగా రాయండి.** (్ఖ, ్గ, ్డ, ్ధ, ్ల, ్థ, ్ర, ్య)

(1) గడము (2) మూరుడు (3) సానము (4) యుదము

## స్వీయ స్పందన

అ) రాజేష్ పరుగును మరిచి సెల్‌ఫోన్‌లో లీనమైనాడు. ఆ సందర్భంలో మీరైతే ఏమి చేస్తారు?

## ప్రసార మాధ్యమాలు

వార్తా పత్రికల్లో, టి.వి.లో చూసి నీకు నచ్చిన క్రికెట్ ఆటగాళ్ళ గురించి నాలుగు/ఐదు వాక్యాలు రాయండి.



## భాషను గురించి తెలుసుకుందాం.

### సంధి

**ఉపాధ్యాయుడు :** ఈ రోజు **'సంధి'** ని గురించి తెలుసుకుందాం.

రెండు పదముల కలయికను **సంధి** అంటారు. ఉదా॥ రాముడతడు.

**పూర్వ, పరస్వరములకు పరస్వరము ఏకాదేశమగుట సంధి** అనబడును.

**స్వరము** అంటే అచ్చు

**పూర్వస్వరము** – మొదటి పదములోని చివరి అచ్చు.

**పరస్వరము** – రెండవ పదములోని మొదటి అచ్చు.

ఉదాహరణకు **రాముడు + అతడు** – అను రెండు పదముల మధ్య సంధి జరిగి **''రాముడతడు''** అను రూపము ఏర్పడినది. ఇందు పూర్వపదము 'రాముడు' అనునది. **''రాముడు''** అను పదములోని చివరి అక్షరమైన డు **'డ్ + ఉ'** లోని **'ఉ'** కారము పూర్వస్వరము. రెండవపదమైన **''అతడు''**లోని **'అ'** అను అక్షరము పరస్వరము. **''ఏకాదేశమగుట''** అనగా పూర్వ పదంలోని **'ఉ'** అను అచ్చు తొలగిపోయి పరస్వరమైన **'అ'** అను అచ్చుతో కలిసి సంధి జరిగినది.

**రాము (డ్ + ఉ) + అతడు**

**రాముడ్ + అతడు =** రాముడతడు అను రూపము వచ్చును.

**ఉపాధ్యాయుడు :** **''ఓడానని''** దీనిలో ఉన్న పదాలు చెప్పండి.

**విద్యార్థులు :** **ఓడాను + అని**

**ఉపాధ్యాయుడు :** సరిగా చెప్పారు.

**'ఓడాను'** అన్న పదం పూర్వపదం. దీనిలో చివరి అక్షరమైన **'ను' (న్ + ఉ)** లోని **'ఉ'** అనునది పూర్వస్వరం. మరి పరస్వరం అని దేనిని అంటారు.

**విద్యార్థులు :** 'అని' అన్న రెండవ పదంలోని మొదటి అక్షరమైన 'అ' అనునది పరస్వరము.

**ఉపాధ్యాయుడు :** సరిగ్గా చెప్పారు. ఇప్పుడు దీనిలో **'ఉ'** అన్న అచ్చు లోపించి **'అ'** అను పరస్వరముతో సంధి జరిగినది. కనుక దీనిని **'ఉకారసంధి'** లేదా **'ఉత్వసంధి'** అంటారు.

**''ఉత్తునకు అచ్చు పరమగునపుడు సంధి నిత్యము.'' అనునది సూత్రము**

**విద్యార్థులు :** **''నిత్యము''** అంటే ఏమిటి సార్?

**ఉపాధ్యాయుడు :** **''నిత్యము''** అంటే సంధి తప్పక జరుగుట.

కింది పదాలను విడదీసి రాయండి.

**(1)** ఎలాగైనా **(2)** చదువుతున్నాడు **(3)** నిజమైన **(4)** వారిద్దరు.



# 3 నమ్మకం

**నేపథ్యం :** పిల్లలూ! టామ్ పిల్లికి, జెర్రి ఎలుకకు పడకపోవటం టి.వీ.లో చూసే ఉంటారు. పిల్లికి ఎలుకకు ఎప్పుడూ పడదు. దానిని జాతి వైరం అంటారు. కాని జాతి వైరం కలిగిన పాము-ముంగిసలు ఏమి చేశాయో ఈ పాఠంలో చూద్దామా!

ఒక చిట్టడవిలో పాము, ముంగిస నివసిస్తున్నాయి.

పాముది చక్కని నైజం. ఊరికే బుసలు కొడుతూ భయపెట్టదు. ఎవరినీ కరవదు. అందరితో కలుపుగోలుగా ఉంటుంది. తన పనేదో తాను చేసుకుంటుంది.

ఈ పాము యొక్క నైజాన్ని గమనించిన ముంగిస పాము స్నేహాన్ని కోరింది. పాము ముంగిస మాటలు నమ్మింది. దానితో స్నేహానికి అంగీకరించింది. ఆ రోజు నుండి ఆ రెండూ ఆనందంగా కలిసి తిరగసాగాయి. ఎంతో సరదాగా మాట్లాడుకునేవి. వాటి స్నేహం చూసి అడవిలోని జంతువున్నీ 'పాము ముంగిసలకు ఉండే సహజ సిద్ధమైన వైరాన్ని మరచి ఇవి ఎలా స్నేహంగా ఉంటున్నాయి. చాలా వింతగా ఉంది. ఇలాంటి స్నేహం విడ్డూరమే కాక ఆదర్శం కూడా' అని చెప్పుకునేవి. ''అందరం సహజ సిద్ధమైన వైరం మరచి స్నేహబంధంతో బ్రతికితే ఎంత బాగుంటుంది'' అనుకున్నాయి.

కానీ అడవిలో ఒక నక్క ఉంది. దాని ఆలోచనలే వేరు. స్నేహితుల మధ్య **తంపులు** పెట్టి లాభం పొందడం దానికి **వెన్నతో పెట్టిన విద్య**. అందువలన అది పాముతో ''నీకు ముంగిస గురించి తెలియదు చాలా దుర్మార్గురాలు. నీకు ఏదో ఒక రోజు అపకారం చేస్తుంది. నా మాట నమ్ము దానితో స్నేహం మానివేయి''. అని చెప్పింది. పాము ఆలోచనలో పడింది. అలాగే నక్క ముంగిసను కలిసి ''పాము నీకు ఆగర్భ శత్రువు. దానితో స్నేహం కూడని పని. దానితో **రాసుకు పూసుకు** తిరుగుతున్నావు. కానీ అది ఏదో ఒక రోజు **అదనుచూసి** నిన్ను కాటు వేయక మానదు. జాగ్రత్త అని మాయమాటలు చెప్పింది. ముంగిస ఆలోచనలో పడింది.







పాము ముంగిసలు తటస్థంగా ఉండటం గమనించింది నక్క. దాని **ఆనందానికి అంతులేదు.** ఇక ఆనాటి నుండి పాము ముంగిసలను వేరు వేరు చోట్ల కలిసి వాటి మధ్య వైరాన్ని పెంచింది.

ఒకరోజు ఆ రెండు పోరు మొదలు పెట్టాయి. వీళ్ళని మనం ఆదర్శంగా భావించామే! వీళ్ళు గొడవ పడుతున్నారంటే ఇంక ప్రపంచంలో జీవుల మధ్య సఖ్యత కష్టమని తేలిపోయింది. అని అనుకున్నాయి మిగతా జంతువులన్నీ. ''నువ్వు నా తలని కొరుకుతావా? ఎలా కొరుకుతావో చూస్తా''. నక్క బావ చెప్పింది కాబట్టి సరిపోయింది. లేదంటే నిష్కారణంగా నీ చేతుల్లో చచ్చేదాన్ని.'' అంది పాము.

''అవును నన్ను **అదనుచూసి** కాటేస్తావట నీ నక్క బావే నాకు చెప్పింది. ఇలాంటి గుంట నక్కలు ఉన్నంతకాలం మనలాంటి వాళ్ళం సుఖంగా ఉండలేము''. అని తమ నాటకాన్ని ఆపి, రెండూ నక్కపై తిరగబడ్డాయి. నక్క **తోకముడుచుకుని** పరుగు లంకించుకుంది.

ఈ మెలికను ఆశ్చర్యంగా వింటున్న అడవి జంతువులు ''స్నేహంలో నమ్మకం ముఖ్యం'' అనే దానిని ఈ పాము, ముంగిస నిరూపించాయి అని వాటిని అభినందించాయి.

ఆనాటి నుండి అడవి జంతువులన్నీ కలిసి మెలిసి ఆనందంగా ఉండసాగాయి.

**రచయిత పరిచయం : డా॥ టి.ఎస్. రావు** గారు ప్రసిద్ధ రచయిత. ప్రస్తుత పాఠ్యభాగం వీరు రచించిన **'బాలల నీతికథలు'** సమాహారం నుండి గ్రహించబడినది. ఈ కథలు పాఠశాల పిల్లలకు, తెలుగు చదవడం నేర్చుకునేవారికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఇవి పిల్లలలో నైతిక విలువలను పెంచుతాయి.

## I. సంభాషించండి - చర్చించండి.

1. మీరు మీ మిత్రులు ఒకరికొకరు సహాయపడే విధం.
2. స్నేహం గురించి మీకు తెలిసిన కథలు.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

నైజం = సహజ స్వభావము; విడ్డూరం = ఆశ్చర్యం; అదనుచూసి = సమయం చూసి;

తంపులు = తగాదాలు; కలుపుగోలుగా = స్నేహంగా; తటస్థంగా=మధ్యస్థంగా.

### ఆ) పాఠము నుండి కొన్ని పంక్తులు ఇవ్వబడినాయి. వాటిని చదివి ఆలోచించండి. మీ ఆలోచనను మీ జట్టుతో పంచుకోండి. మరియు లేఖన పుస్తకంలో రాయండి.

1) స్నేహంలో నమ్మకం ముఖ్యం.

2) 'ఇలాంటి గుంట నక్కలు ఉన్నంతకాలం మనలాంటి వాళ్ళం సుఖంగా ఉండలేము'

### ఇ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.

1) పాము, ముంగిసల స్నేహం అడవి జంతువులకు వింతగా అనిపించుటకు కారణమేమిటి?

2) 'నమ్మకం' పాఠం ద్వారా నిజమైన స్నేహబంధాన్ని ఎవ్వరూ విడదీయలేరని ఎట్లు చెప్పగలరు?

## భాషావగాహన

### అ) కింది గీత గీసిన పదాలకు వ్యతిరేక పదాలు రాయండి.

1. పాము, ముంగిస, <u>స్నేహితులు</u> ........................
2. ఎవరికి <u>అపకారం</u> చేయరాదు. ........................
3. స్నేహితుల మధ్య తంపులు పెట్టి <u>లాభం</u> పొందుతుంది. ........................

### ఆ) 'తోకముడుచుకొని' - ఇలాంటి జాతీయాలను పాఠము నుండి గ్రహించి రాయండి.

..............................................

### ఇ) కింది పదములను విడదీసి సంధి పేరు రాయండి.

| పదం | విడదీయుట | సంధి పేరు |
|---|---|---|
| 1. జంతువులన్నీ | | |
| 2. పడుతున్నారంటే | | |
| 3. కష్టమని | | |

ఈ) జతపరచండి.





| పదం | విగ్రహవాక్యం |
|---|---|
| 1) చక్కని నైజం | అ) పామును ముంగిసయును |
| 2) పాము ముంగిసలు | ఆ) కారణం లేకుండా |
| 3) నిష్కారణంగా | ఇ) చక్కనైన నైజం |



## స్వీయ స్పందన

● మన జీవితంలో స్నేహితులు చాలా ముఖ్యం. ఆ స్నేహబంధాలను తెలిపే కింది ఆకృతులను పూరించండి.

చదువుకుంటాను

స్నేహితులతో కలిసి నేను ..................

సలహాలు

స్నేహితుల నుండి నాకు ...................... లభిస్తాయి

## ప్రసార మాధ్యమాలు

అ) వార్తా పత్రికలు, టీ.వి., అంతర్జాలంలోని కార్టూన్ కథలను చూడండి. వాటిని మీ సొంతమాటలలో రాయండి.

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

..........................................................................................

## భాషను గురించి తెలుసుకుందాం.

**ఉపాధ్యాయుడు:** మీరు ఇంతకుముందు భాషను సక్రమంగా నేర్చుకోవడానికి వ్యాకరణం ఎంత అవసరమో గ్రహించారు కదా. ఈ రోజు మనం వ్యాకరణంలోని **ఇకార సంధి**ని గూర్చి తెలుసుకుందాం.

వాగ్దేవీ! **'ఏమంటివి'** అను పదం విడదీసి అందులోని పూర్వస్వరం, పరస్వరం చెప్పు.

**వాగ్దేవి :** 'ఏమి+ అంటివి' ఇందులో పూర్వస్వరము ''ఇ'', పరస్వరము ''అ''.

**ఉపాధ్యాయుడు:** సరిగ్గా చెప్పావు. ''ఏమ్+ఇ= ఏం'' మొదటి పదములోని చివరి అచ్చులోపించి రెండవ పదములోని మొదటి అచ్చు అయిన ''అ'' అను అక్షరముతో కలిసి ''ఏమ్+అంటివి=ఏమంటివి'' అని అయినది. ఒక్కొక్కసారి ఈ రెండు అచ్చుల మధ్య సంధి జరగనప్పుడు ''ఏమి+య్+అంటివి'' అని ''య్'' అను హల్లు రెండు అచ్చుల మధ్య మిత్రునిగాచేరి ''ఏమియంటివి'' అవుతుంది. దీనినే సంధి వైకల్పికముగా జరుగుట అంటారు. కావున ''ఇకార సంధి'' సూత్రము ఈ విధంగా ఉంటుంది.

**సూత్రము :** ఏమ్యాదుల ''ఇత్తు''నకు సంధి వైకల్పికము.

''ఏమ్యాదులు'' అంటే ''ఏమి, మరి, కి, అది, అవి, ఇది, ఇవి, ఏది, ఏవి'' మొదలగునవి. ''ఇత్తు'' అనగా హ్రస్వమైన ''ఇ'' కారము. ''వైకల్పికము'' అనగా సంధి రెండు అచ్చుల మధ్య జరగవచ్చు లేదా జరుగక పోవచ్చు. ఎప్పుడైతే రెండు అచ్చుల మధ్య సంధి జరగదో అప్పుడు వాటి మధ్య ''య్'' ఆగమముగా వచ్చి చేరుతుంది. ఇప్పుడు మరికొన్ని ఉదాహరణలు చూద్దాం.

**1) మరేమీ=మరి + ఏమి = మరేమి, మరియేమి.**

**2) గెలవాలని=గెలవాలి + అని=గెలవాలని, గెలవాలియని.**

ఇప్పుడు మీ అందరికీ ''ఇకార సంధి'' అర్థం అయిందని అనుకుంటున్నాను. మీకు మరికొన్ని పదాలను ఇస్తాను వాటి సంధికార్యము వివరిస్తూ రేపు రాసుకుని రండి.

**1) అదేమీ      2) అవెక్కడ      3) ఇవన్నీ.**

## ప్రాజెక్ట్

జీవులు, పదార్థాలు అన్నీ ఒకేలాగా ఉండవు. వాటిలో కొన్ని లక్షణాలు ఒకేలా ఉంటాయి. కొన్ని లక్షణాలు భిన్నంగా ఉంటాయి.

ఆకారం, రంగు, పరిమాణం, ఉపయోగం మొదలగు లక్షణాలనుబట్టి వాటిని ఒకటిగా చేసి, వేరు చేయడాన్ని **వర్గీకరణ** (క్లాసిఫికేషన్) అంటాము.

వర్గీకరణ వలన గుర్తించడం, అధ్యయనం చేయడం, జ్ఞాపకముంచుకోవడం సులభమవుతుంది.

ఉదా:




ఇప్పుడు మీరు ప్రాణుల వర్గీకరణ చార్టు చేసి తరగతిలో ప్రదర్శించండి.

- పిల్లవాడు సైకిల్ వ్యక్తికి పర్సును ఎలా అందజేసి ఉంటాడు? ఊహించండి.



# 4 కృషి ప్రశస్తి

**నేపథ్యం :** రైతు అన్నదాత. పంటలను పండించి దేశాన్ని సస్యశ్యామలం చేస్తున్నాడు. ఆ రైతు కష్టపడి పనిచేసి ఏ విధంగా ప్రాణుల ఆకలి బాధను తీర్చి, తృప్తిని కలిగిస్తున్నాడో ఈ పాఠం ద్వారా తెలుసుకుందాం.



ఓహో, కృషీవల! ఓకష్టజీవి!
జీవాలు సంసృష్టి జెందునీ కృషిని
లోకాలు జీవించు నీ కష్టమందు
అన్నదాతవు నీవు, అన్నమేనీవు! 1

ప్రొద్దుకంటెను ముందె నిద్దురలేచి
క్షేత్ర లక్ష్మిని భక్తి సేవించు వేళ
పొంగారు నీ రక్తి పువ్వుపువ్వునను!
నిండారు నీ శక్తి పండుపండునను! 2



ఉదయ పర్వత వాటి నుదయాన పూని
సాగదోలిన నీదు నాగేటిసాలు
సంసార జీవన సారణిగాగ
ప్రవహించు రవితేజ మవనీతలాన! 3



ఎద్దుల దోలెడు నెడ నీశ్వరుండు
విత్తనమ్ములు చల్లువేళ పంకజుండు
పంట ప్రోవును చేయు పట్ల శ్రీశుండు
మూర్తిత్రయీ రూపమును గొంటివీవు! 4

ఈవు పెట్టక అన్నమే లేదు భువికి
నీవు పోయక నీరమే లేదెవరికి,
నీవింత కష్టించి నిర్మించకున్న
కంటకాటవిగాక కలదె మానుషత? 5
చైత్రోత్సవమ్ములో వసంతమ్ములాడు



తొలకరి నీకేసి తొంగి చూచినది!
గౌతమి నీదారి కదలివచ్చినది!
పుష్యమి నీ తోడ పొత్తుగల్పినది!
సర్వోదయము వంకసాగు మీవింక! 6

**కవి పరిచయం :** ప్రస్తుత పాఠ్యభాగ రచయిత **శ్రీ బోయి భీమన్న** గారు. వీరు 1911 సెప్టెంబరు 19న లో తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురులో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ ట్రాన్స్‌లేటర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. దీపసభ, రాఖీలు, త్రిపదలు, గుడిసెలు కాలిపోతున్నాయి మొదలగు కావ్యాలు, నాటికలు, గేయాలు రచించారు. హరిజన సమస్యలు, వారి ఉద్ధరణ వీరి రచనలలో ప్రధాన వస్తువు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి సహాయ కార్యదర్శిగా వీరు చాలాకాలం పనిచేశారు.

## I. సంభాషించండి - చర్చించండి.

1) 'జై కిసాన్' నినాదం.

2) వ్యవసాయము - ప్రాముఖ్యత.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదాల అర్థాన్ని, భావాన్ని తెలుసుకోండి - రాయండి.

1) కృషీవలా = ఓ రైతా!; సంసృష్టి = తృప్తి, జీవాలు = ప్రాణులు

**భావము :** ఓ కృషీవలా! ఓ కష్టజీవి! నీవు కష్టపడి పని చేయుటవలన ప్రపంచమందలి ప్రాణులు తృప్తిని పొందుచున్నవి. నీ కష్టంతోనే లోకమంతా జీవిస్తుంది. నీవే అన్నము, నీవే అన్నదాతవు.

2) క్షేత్రలక్ష్మి = భూమి; రక్తి = అనురాగం, ప్రేమ; నిండారు = పూర్తిగా, సంపూర్ణంగా; పొంగారు = సంతోషంగా, పొంగి పొరలు, ఎక్కువగు.

**భావము :** సూర్యోదయం కంటె ముందే నిద్రలేస్తావు, భూమిని భక్తితో సేవిస్తావు, ప్రతిపువ్వునందు నీ అనురాగం పొంగిపొరలుతుంది, ప్రతీ పండునందు నీ శక్తి సంపూర్ణంగా ఉంటుంది.

3) రవితేజము=సూర్యునికాంతి; అవనీతలము=భూతలము.

**భావము :** నీవు సూర్యోదయముతోనే నాగలిని తీసికొనెదవు, నీవు పనిని ప్రారంభించుట వలన ప్రజల జీవనము ముందుకు సాగుచున్నది.

4) పంకజుండు =బ్రహ్మ; శ్రీశుండు=విష్ణుమూర్తి; మూర్తిత్రయము=త్రిమూర్తులు

**భావము :** ఎద్దులను తోలు సమయములో ఈశ్వరుడవు. విత్తనములు చల్లు సమయములో బ్రహ్మవు. పంటను పోగుచేయు సమయములో విష్ణుమూర్తివి. నీవు త్రిమూర్తి స్వరూపమును వహించితివి.

5) ఈవు=నీవు; భువి=భూమి; కంటక+అటవి=ముళ్ళతో నిండిన అడవి; నీరము=నీరు

**భావము :** ఈ జగత్తునకు నీవు పెట్టనిచో అన్నమే లేదు, నీవు పోయనిచో నీరు లేదు, నీవీ విధముగా కష్టపడనిచో ప్రపంచమంతయు ముళ్ళతో కూడిన అరణ్యము కాదా! మనుష్యులను వారు ఉందురా!

6) తొలకరి = తొలివాన; పొత్తు=స్నేహము

**భావము :** తొలకరివాన, గోదావరి, పుష్యమి నీతో స్నేహము చేయవచ్చినవి. నీవింక అభ్యుదయము వైపునకు పయనించుము.

**ఆ) సరైన సమాధానం గుర్తించి దాని కెదురుగా [✓] గుర్తు పెట్టండి.**

1. ఎద్దులు తోలెడు సమయమున రైతు వహించిన రూపము?
   - ఈశ్వరుడు [ ]
   - బ్రహ్మ [ ]
   - విష్ణుమూర్తి [ ]
   - భరతుడు [ ]
2. తొలకరి వానతో పాటు రైతుతో కదలి వచ్చినది....
   - గౌతమి [ ]
   - కావేరి [ ]
   - తుంగభద్ర [ ]
   - కృష్ణ [ ]

## పంక్తులపై చర్చ

పాఠము నుండి కొన్ని పంక్తులు ఇవ్వబడినాయి. వాటిని సహవిద్యార్థులతో చర్చించి, వాటి అర్థాన్ని లేదా భావాన్ని మీ లేఖన పుస్తకంలో రాయండి.

అ) ''మూర్తిత్రయీ రూపమును గొంటివీవు''

ఆ) ''కంటకాటవిగాక కలదె మానుషత''

### ఆలోచన కొరకు

**కింది కవితను చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

చిటపట చిటపట కురిసెను వాన
చిరుచిరు జల్లుల తొలకరి వాన
చెఱువులు, బావులు నిండేను
ఆకాశంలో హరివిల్లు ఆనందాలే వెదజల్లు.

1) వానల వల్ల లాభాలు ........................................

2) కవితలో గల జంట పదాలు ................................

3) హరి విల్లుకు పర్యాయపదం ................................



## భాషావగాహన

**అ) కింది పదములను విడదీసి, సంధిపేరు రాయండి.**

1) కష్టమందు = ...................... + ...................... = ...........................................
2) నీ వింత = ...................... + ...................... = ...........................................
3) లేదెవరికి = ...................... + ...................... = ...........................................

**ఆ) కింది పదాలకు విగ్రహవాక్యములు రాయండి.**

1) రవితేజము 2) నాగేటిసాలు

## స్వీయస్పందన

1) ''నీవే కృషీవలుడివైతే'' ......

## ప్రసార మాధ్యమాలు

జాతీయ రైతుల దినోత్సవం (National Farmers Day) – టీ.వి., వార్తపత్రికలు, అంతర్జాలముల నుండి సమాచారాన్ని సేకరించి వ్యాసాన్ని రాయండి.

## సృజనాత్మకత

**జట్టుపని :** కృషీవలుడు, నాగలి మొదలగు పనిముట్ల వంటి వ్యవసాయ సంబంధిత చిత్రాలు గీసి **'జాతీయ రైతుల దినోత్సవం'** శుభాకాంక్షల కార్డులను తయారు చేసి రైతులకు అందజేయండి.

## ప్రాజెక్ట్

మీ ఉపాధ్యాయులు/పెద్దలతో దగ్గరలోని వ్యవసాయ సమాచార కేంద్రాన్ని సందర్శించండి. సేంద్రియ వ్యవసాయం (ఆర్గానిక్ ఫార్మింగ్) – లాభాలు గురించి తెలుసుకొని నివేదిక రాయండి.

- కింది వ్యవసాయానికి సంభంధించిన క్రమ సంఖ్య వేయండి.

| కలుపు తీయుటం | ధాన్యం బస్తాలకెత్తటం | పొలం దున్నటం | కోతలు కోయటం | విత్తనాలు విత్తటం |
|---|---|---|---|---|
| | | | | |

# ప్రకటనలు

**ఉపాధ్యాయురాలు** : ఈ రోజు మనము ప్రకటనల గురించి తెలుసుకుందామా!

**విద్యార్థులు** : అలాగే టీచర్! కానీ ప్రకటనలు అంటే ఏమిటి?

**ఉపాధ్యాయురాలు** : ఏదైనా విషయం, వస్తువు, సేవ గురించి అందరికీ ప్రకటించటం అనగా తెలియజేసేవి ప్రకటనలు. ఇప్పుడు డిజిటల్ టీ.వి.లో ప్రకటన చూసి దాని గురించి చెప్పండి.

**రవి** : అది 'గృహలక్ష్మి' సూపర్ మార్కెట్ అందులో లభించే వస్తువుల గురించి ప్రకటన.

**ఉపాధ్యాయురాలు** : బాగా చెప్పావు రవి. ఇలాంటి ప్రకటనలు పత్రికలలో కూడ వచ్చాయి. నేను వాటి కత్తిరింపులు మీకు ఇస్తున్నాను. వాటిని చదవండి.

## పత్రికలలో వచ్చిన ప్రకటనలు

**నేషనల్ వార్తా పత్రిక**

కేంద్ర ప్రభుత్వ ప్రకటన

దేశప్రజలందరు గమనించగలరు.

తేది: 26.11.2026 రోజు 5 సం॥లు లోపు పిల్లలందరికీ అన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రులలో పోలియో చుక్కలు వేయబడును.

అందరు తమ తమ పిల్లలకు ఈ పోలియో చుక్కలు ఇప్పించగలరు.

**సమయం: ఉ. 8 గం నుండి సా.5గం**

**ధాన్యలక్ష్మి విత్తనాల కేంద్రం (ప్రైవేటు)**

(శాంతికాలని, కాచిగూడ, హైదరాబాదు.)

మా వద్ద రైతులకు అన్ని రకాల మంచి విత్తనాలు, సేంద్రీయ ఎరువులు లభించును, సరసమైన ధరలలో, నాణ్యతగల వీటిని పొందగలరని ఆశిస్తున్నాము.

మేనేజర్,
ధాన్యలక్ష్మి విత్తనాల కేంద్రం,
కాచిగూడ–హైదరాబాదు.

**ఉపాధ్యాయురాలు** : విద్యార్థులారా! ప్రకటనల గురించి కొన్ని ముఖ్యాంశాలు చెప్పుకుందాము.

నేటి సాంకేతిక, ప్రసారసాధనాల యుగంలో ఈ ప్రకటనల రంగం చాలా అభివృద్ధి చెందింది. వ్యాపార అభివృద్ధికి ప్రకటనలు దోహద పడుతాయి. ఈ ప్రకటనలను వార్తా పత్రికలు, ప్రసారమాధ్యమాలు మొదలగువాటి ద్వారా చేస్తారు. ప్రకటనలు ముఖ్యముగా రెండు రకములు.

**(1) ప్రభుత్వ ప్రకటనలు :** వివిధ సేవలు, సమాచారములను ప్రజలకు తెలియచేసేవి.

**(2) వ్యాపార ప్రకటనలు :** వస్తువుల వివరాలను తెలియజేసి కొనుగోలును అభివృద్ధి చేసేవి.

- **కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. నేషనల్ వార్తా పత్రికలో ప్రకటన దేని గురించో వివరించండి.
2. ధాన్యలక్ష్మి విత్తనాల కేంద్రం ప్రకటన గురించి వివరించండి.

## భాషను గురించి తెలుసుకుందాం.

### యడాగమ సంధి

**ఉపాధ్యాయుడు :** ఇప్పుడు మనం **యడాగమసంధి**ని గురించి తెలుసుకుందాం.

**సూత్రం : సంధిలేని చోట స్వరంబు కంటె పరంబయిన స్వరంబునకు యడాగమంబగు.**

**విద్యార్థి :** యడాగమము అంటే ఏమిటి సార్?

**ఉపాధ్యాయుడు :** 'యట్' అనునది ఆగమముగా వచ్చుట యడాగమము.

**ఆగమము :** రెండు అచ్చుల మధ్య వేరొక అక్షరము మిత్రుని వలె వచ్చుట.

కింది పదాలను గమనించండి.

**కాక + అని - కాకాని** అని సంధి జరుగదు.

పై ఉదాహరణలో సంధి కార్యము జరుగలేదు.

రెండు అచ్చుల మధ్య సంధి జరుగనప్పుడు **'యట్'** (య) ఆగమముగా వచ్చును. **కాకా+య్+అని** – కాకాయని అనియగును. దీనినే **యడాగమమము** అందురు. అలాగే

**మీ + ఇల్లు = మీల్లు అని కాదు**

**మీ + య్ + ఇల్లు = మీ యిల్లు**

మొదటి పదము చివరి అచ్చునకు రెండవ పదము మొదటి అచ్చునకు సంధి జరుగుట లేదు. కావున **'యట్'** ఆగమముగా వచ్చి **''మీ యిల్లు''** అను రూపము ఏర్పడినది.

కింది పదాలను విడదీసి, సంధి గుర్తించండి.



**1) అమ్మయిచ్చెను 2) మా యిల్లు 3) మేనయత్త**

### ప్రకటన రాయండి

- పక్కనున్న చిత్రాన్ని గమనించండి.
- దానిని గురించి ఆకట్టుకునే విధంగా ఒక వాణిజ్య ప్రకటన రాయండి.
- చిత్రంపై ఒక కంపెనీ పేరును ఊహించి రాయండి.



**ఉపాధ్యాయ సూచన :** విద్యార్థులచే ప్రకటనలు చదివించి వాటికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పించండి.

# 5 భాషా గమ్మత్తు

**(తెలుగు ఉపాధ్యాయుడు తరగతిలోనికి ప్రవేశించారు. విద్యార్థులు నమస్కరించారు)**

**ఉపాధ్యాయుడు :** క్రింది పరిచ్ఛేదంలో గడులలో ఉన్న పదాలను గమనించండి. అవి అర్థవంతమైన పదాలే, కానీ గడులలోని అక్షరాలను తిరగేసి పరిచ్ఛేదాన్ని చదవండి.

**విద్యార్థులందరూ మౌనపఠనం చేశారు.**



తల మరియు మర అక్కచెల్లెళ్ళు. మర చక్కగ టపా పాడుతుంది. ఒకరోజు పాట లో ఉత్తరం వచ్చింది. వాళ్ళిద్దరు విషయాన్ని చదువుకొని లత లూపారు. మనము పడక వెళదాము. అక్కడ టపా ల కచేరి ఉంది. పడక కు వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. పలక తో చేసిన పడక్కుర్చీలో కూర్చున్న తాత దగ్గరకు వచ్చారు. తాతకు తాము చెప్పేది సరిగా వినబడనందున వంగి పాట చూపారు. తాతయ్యకు టపా ల కచేరి అంటే ఇష్టం. తాను కూడ పడక కు వస్తానన్నాడు.

**ఉపాధ్యాయుడు :** పరిచ్ఛేదాన్ని చదువుకున్నారు కదా! దాని ప్రత్యేకత ఏమిటో చెప్పండి.

**విద్యార్థులు :** గడులలోని పదాల అక్షరాలను తిరగేసి చదివినా అవి అర్థవంతమైన పదాలే. కానీ అలా చదివితే ఒక అర్థవంతమైన కథ వచ్చింది. చాలా గమ్మత్తుగా అనిపించింది.

**ఉపాధ్యాయుడు :** శభాష్! బాగా గమనించారు.

ఇప్పుడు ఈ క్రింది పరిచ్ఛేదములో గడులలోని పదాల అక్షరాలను వెనుక నుండి ముందుకు చదువుతూ పరిచ్ఛేదాన్ని మౌన పఠనం చేయండి.



జలజ ఇంటి కిటికిలోంచి పెరట్లోకి చూస్తూవుంది చుట్టూ రకరకాల పూల మొక్కలు, పండ్ల చెట్లు ఉన్నాయి. వాళ్ళ ఇల్లే ఒక నందనం. మొక్కల నిండా పూలు విరివిగా పూశాయి. చూడముచ్చటగా వుంది. తమ్ముడు గోపి బడికి పోలేదు. కాలి మడమ నొప్పిగా ఉందని నటన చేస్తున్నాడు. తోటలో తిరుగుతూ చింతకాయ తీసుకొని తిన్నాడు. అబ్బబ్బా పులుపు అంటూ దవడలు పట్టుకున్నాడు. నీవు కనుక బడికి పోకపోతే సాయంత్రం నిన్ను బజారుకి తీసుకెళ్ళను అంది జలజ. అయితే ఇప్పుడే బడికి వెళతానంటూ గునగున నడుచుకుంటూ వెళ్ళాడు.

ఉపాధ్యాయుడు : చదివారు కదా. ఈ పరిచ్ఛేదం యొక్క ప్రత్యేకత ఏమిటో చెప్పండి.

విద్యార్థి : గడులలో అక్షరాలను ఎటు నుండి చదివినా అవే పదాలు వస్తున్నాయి సార్. అందువల్ల పరిచ్ఛేదం యొక్క అర్థం కూడా మారడం లేదు.

ఉపాధ్యాయుడు : చాలా చక్కగా కనిపెట్టారు. ఇప్పుడు నేను ఒక వాక్యాన్ని చదువుతాను. శ్రద్ధగా వినండి.

'నాన్న నన్ననినా నేను నాన్న ననను'.

పీటర్ వాక్యాన్ని చదివి దానిలోని ప్రత్యేక లక్షణమేమిటో చెప్పుము.

పీటర్ : సర్! ఇది 'న' అక్షర గుణింతపదాలతో తయారైన వాక్యము.

ఉపా : సల్మా! దీని అర్థమేమిటో చెప్పు.

సల్మా : నాన్న నన్ను అన్నాగాని నేనుమాత్రం నాన్నను ఏమీ అనను.

ఉపా : బాగా చెప్పావమ్మా!

రాము ! ఒక సూక్తి చెప్పి, దాని అర్థాన్ని వివరించు.

రాము : 'మానవ సేవయే మాధవ సేవ'. దీని అర్థం మానవులకు సేవ చేస్తే దేవుడికి సేవచేసినట్లే.

ఉపా : గురుసింగ్! ఒక పొడుపు కథను చెప్పి, నువ్వే విప్పు.

గురుసింగ్: అలాగే సార్ !

'అమ్మా అంటే దగ్గరికి వస్తాయి. నాన్న అంటే దూరం పోతాయి'. దీనికి జవాబు పెదవులు సార్.

ఉపా : బాగా చెప్పావు. ఇపుడు

'వడ-వాడ' దీన్ని జాగ్రత్తగా గమనించి 'వరం -- ' ఈ ఖాళీని రాము పూరిస్తాడు. గుణింత మార్పిడి వలన అర్థం మారే పదాలు చెప్పండి. ఉదా: గెల - గోల, పది - పంది.

విద్యార్థులు: వరం - వారం, పొడి-పిడి, పలక-పిలక

ఉపా : చాల బాగా చెప్పారు ఇప్పుడు పీటర్! నీవు చదరంలోని పదాలను చదువు.

| | | |
|---|---|---|
| య | ము | న |
| ము | న | గ |
| న | గ | దు |

పీటర్ : యమున, మునగ, నగదు,

ఉపా : మీరందరూ బాగా చెప్పారు. చూశారుగా ఎంత సరదాగా ఉందో రేపు ఇలాంటి గమ్మత్తైన పదాలు కొన్ని రాసుకుని రండి.

## I. సంభాషించండి - చర్చించండి.

1) మీరు ఏయే భాషాక్రీడలు ఆడుతారు.

2) పరిచ్ఛేదములోని అపరిచిత పదముల గురించి చర్చించండి.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

టపా = లేఖలు పంపించే తపాల; పడక = మంచము; కచేరి = కార్యక్రమము.

### ఆ) పాఠములో 'మానవ సేవయే మాధవ సేవ' సామెత యొక్క అర్థాన్ని తెలుసుకున్నారు. కింది సామెతలను గమనించండి. వాటి అర్థాన్ని ఉదాహరణలను రాయండి.



ఉదా: దురాశ దుఃఖానికి చేటు :

అర్థం : దురాశ వలన కష్టాలు, నష్టాలు వస్తాయి.

ఉదాహరణ : బాతు-బంగారు గుడ్డు కథ.

1) మొక్కై వంగనిది మ్రానై వంగునా. 2) పిట్ట కొంచెం కూత ఘనం :

### ఇ) ఒకే అక్షరగుణింతంతో వచ్చే గమ్మత్తైన వాక్యాలను ఉపాధ్యాయుల సహాయంతో తయారు చేయండి.

ఉదా: 'కాకీక కాకికి కాక కేకికా' ఇది 'క' అక్షర గుణింతముతో తయారైన వాక్యము. ఇలాంటి కొన్ని వాక్యాలు తయారు చేయండి.

## భాషావగాహన

**అ) కింది వాక్యాలలోని నామవాచక పదాలను, వాటి వాచకాలను రాయండి.**

ఉదా: నా పేరు మమత. మమత = నామవాచకము, మహతీ వాచకము.

1) రాము! చాలా బాగా చెప్పావు. 2) పాప వాక్యాన్ని చదివింది.

**ఆ) కింది పదాలకు విగ్రహవాక్యం రాసి సమాసనామం రాయండి.**

అక్కచెల్లెళ్ళు, కాళ్ళు చేతులు, ఆటపాటలు

**ఇ) పాఠంలోని ఉకార సంధి పదాలను ఏరి విడదీసి రాయండి.**

## ప్రసార మాధ్యమాలు

1. దిన, వార, మాస పత్రికలలో వచ్చే రకరకాల భాషా క్రీడల గురించి తరగతిలో చర్చించండి. మీ నోటు పుస్తకంలో రాయండి.
2. అంతర్జాలంలో రకరకాల సామెతలు, పొడుపు కథలు చూసి వాటితో ఆల్బమ్ తయారు చేయండి.

## సృజనాత్మకత

**కింది గడులలో ఇచ్చిన అక్షరాలను అర్థవంతమైన పదాలుగా అమర్చి రాయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | త | ర్థం | అం | రా | -> అంతరార్థం |
| 2. | డ | డ | బి | గ | -> ...................... |
| 3. | మా | ణం | రా | య | -> ...................... |
| 4. | జ | ది | పిం | దూ | -> ...................... |

## అంత్యాక్షరి ఆటలు

**1. జోసెఫ్, అమల, సలీం కలిసి పేర్లతో అంత్యాక్షరీ ఆట ఆడుతున్నారు.**



జోసెఫ్ : కమల ! 'ల' జోసెఫ్ : ................................

సలీం : లత ! త సలీం : ................................

అమల : తమన్ ! 'న' అమల : ................................



ఈ ఆటను మీ సొంత ఆలోచనతో ముందుకు పొడిగించండి.

**2. ఇదే విధంగా పాటలతో అంత్యాక్షరి ఆటను ఆడండి.**

## భాషను గురించి తెలుసుకుందాం.

### నామవాచక రకాలు

ఒక చిట్టడవిలో పాము, ముంగిస నివసిస్తున్నాయి. పాముది చక్కని నైజం. ఊరికే బుసలు కొడుతూ భయపెట్టదు. ఎవరినీ కరవదు. అందరితో కలుపుగోలుగా ఉంటుంది. తన పనేదో తాను చేసుకుంటుంది. ఈ పాము యొక్క నైజాన్ని గమనించిన ముంగిస, పాము స్నేహాన్ని కోరింది. పాము, ముంగిస మాటలు నమ్మింది. దానితో స్నేహానికి అంగీకరించింది. ఆ రోజు నుండి ఆ రెండూ ఆనందంగా కలిసి తిరగసాగాయి. ఎంతో సరదాగా మాట్లాడుకునేవి. వాటి స్నేహం చూసి అడవిలోని జంతువులంతా 'పాము, ముంగిసలకు ఉండే సహజ సిద్ధమైన వైరాన్ని మరచి, ఇవి ఎలా స్నేహంగా ఉంటున్నాయి. చాలా వింతగా ఉంది. ఇలాంటి స్నేహం విడ్డూరమే కాకుండా ఆదర్శం కూడా' అని చెప్పుకునేవి.

**ఉపాధ్యాయుడు** : కింది తరగతిలో నామవాచకం గురించి తెలుసుకున్నాము. ఇప్పుడు నామవాచక భేదాల గురించి తెలుసుకుందాము. పై గద్యములోని 'పాము, ముంగిస' అనే పదాలు ఏ భాషాభాగాలో అమల చెబుతుంది.

**అమల** : 'పాము, ముంగిస' అనే పదాలు పేర్లు అనగా నామవాచకాలు.

**ఉపాధ్యాయుడు** : అవును! ఇలా పేర్లను తెలిపే నామవాచకములను **'సంజ్ఞా నామవాచకాలు'** అంటారు. **'జంతువు'** అనే పదం దేనిని తెలుపుతోంది పీటర్!

**పీటర్** : 'జంతువు' అనే పదం జాతిని తెలుపుచున్నది సర్!

**ఉపాధ్యాయుడు** : సరిగ్గా చెప్పావు! ఇలా జాతిని తెలిపే పదాలను **'జాతి నామవాచకాలు'** అంటారు.

రవి, నువ్వు చెప్పు! **'ఆదర్శం'** అనే పదం దేనికి సంబంధించినది?

**రవి** : **'ఆదర్శం'** అనే పదం భావాన్ని తెలుపుతున్నది.

**ఉపాధ్యాయుడు** : బాగా చెప్పావ్ రవి! వ్యక్తుల, వస్తువుల **గుణాలను, భావాలను** తెలిపే పదాలను **'భావనామ వాచకాలు'** అంటారు.

సల్మా! **'నివసిస్తున్నాయి, తిరగసాగాయి'** ఇవి దేనిని తెలియజేస్తున్నాయి?

**సల్మా** : ఇవి క్రియలను తెలియజేస్తున్నాయి సర్!

**ఉపాధ్యాయుడు** : చాల చక్కగా గ్రహించావు సల్మా! ఇట్టి పదాలను **'క్రియా నామవాచకాలు'** అంటారు.

# 6 మిత్రునికి లేఖ

తేది : 19-11-2027

ఎం. శ్యామ్,

ఇం.నెం. 36/301,

అడయార్,

చెన్నై.



ప్రియమైన శ్యామ్,

మేమంతా క్షేమంగా ఉన్నాము. మీరు క్షేమమని తలుస్తాను. మేము సెలవులకు ముంబయిలోని మా మేనత్త ఇంటికి వచ్చాము.

ముంబయి మన భారతదేశ ఆర్థిక రాజధాని. ఇక్కడి అధికార భాష మరాఠీ. ఛత్రపతి శివాజీ మహారాజుగారి చేత పరిపాలించబడిన మరాఠా సామ్రాజ్యం గురించి ఎంతైనా తెలుసుకోవచ్చు. అటువంటి ముంబయి మహానగర సందర్శన విశేషాలను నీతో పంచుకోవాలని ఈ ఉత్తరం రాస్తున్నాను.

ముందుగా మేము గేట్ వే ఆఫ్ ఇండియాని చూసాము. అది అరేబియా సముద్ర తీరంలోని గొప్ప చారిత్రక కట్టడం. అక్కడి నుండి మోటార్ బోట్లపై సముద్రంలోని సీగల్ పక్షులను చూస్తూ ఎలిఫెంటా గుహలు చూశాము. తర్వాత ఆలీబాగ్ జలదుర్గం, సముద్రతీరాన్ని చూశాము.

మరుసటి రోజు తారాపూర్‌వాలా మత్స్యాలయం, హ్యాంగింగ్ గార్డెన్స్, బూట్ హౌస్ చూసాము. ఆ తర్వాత రోజు నెహ్రూ సైన్స్‌సెంటర్, ప్లానిటోరియమ్ కూడా చూశాము. అక్కడ అద్భుతమైన విజ్ఞానశాస్త్ర, ఖగోళశాస్త్ర విశేషాలు తెలుసుకున్నాము. సాయంత్రం మెరైన్ డ్రైవ్‌కి వెళ్ళాము. రాత్రి లైట్ల వెలుగులో ఆ సముద్రపు ఒడ్డు





నెక్లెస్ లాగా కనపడింది. అందుకే దానిని క్వీన్స్ నెక్లెస్ అంటారట.

రెండు రోజుల విశ్రాంతి తర్వాత ముంబయి మెట్రో లైన్ 3 ద్వారా ప్రయాణించాలని కొలాబా అనే స్థలానికి వెళ్ళాము. ఈ అద్భుత అనుభవాన్ని ఒకరితో ఒకరం చెప్పుకుంటూ ఛత్రపతి శివాజీమహారాజ్ వస్తు సంగ్రహాలయానికి వెళ్ళాము. అక్కడ సింధు నాగరికత కాలంనాటి వస్తువులు కూడా మేము కళ్ళారా చూసాము. సాయంత్రం జుహూ బీచ్ కి వెళ్ళి చక్కగా ఆడుకున్నాము.

మరుసటిరోజు ఉరాన్‌లోని పర్యాటక ప్రదేశాలను చూశాము. తిరుగు ప్రయాణంలో అటల్ సేతుపై ప్రయాణిస్తూ సముద్రంలోని ఫ్లేమింగో పక్షులను చూడటం మాటల్లో చెప్పలేని అనుభూతి. చివరగా మేము చూసినది గ్లోబల్ విపాసన ధ్యానమందిరం. ఇది ప్రపంచంలోని అతిపెద్ద స్తంభాలు లేని డోమ్ ఆకారం కలిగిన పగోడా.

ఈ ముంబయి మహానగరం ఎప్పుడూ నిద్రపోదు అంటారు. అంటే రాత్రింబవళ్ళు చురుగ్గా జీవంతో నిండి ఉంటుంది అని అర్థం. అంతేకాదు రకరకాల భాషలకు, సంస్కృతులకు ఆలవాలము. మినీ ఇండియా ఈ ముంబయి నగరం. ఈ నగర సందర్శనంలో ఇరవై రోజులు ఎలా గడిచాయో తెలియలేదు.

మీ అమ్మానాన్నలకు, తులసి అక్కకు నా నమస్కారాలు తెలియచేయి. నీ జవాబు కోసం ఎదురు చూస్తాను.

ఇట్లు,
నీ ప్రియ మిత్రుడు,
ఎం. వి. కృష్ణ,
ఇం. నెం:24/12,
తిరువొత్తియూర్, చెన్నై.



**I. సంభాషించండి - చర్చించండి.**

1) మీరు రాసిన ఉత్తరాలు/లేఖలు.

2) తపాలా కార్యాలయాల సందర్శన

**II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.**

**అ) పదజాలం పెంపొందించుకొందాం.**

పురాతన వస్తువులు = ప్రాచీనకాలం నాటి వస్తువులు; ఆసక్తికరమైన = ఇష్టమైన; ఆలవాలము = నిలయము; సందర్శనం = దర్శించుకోవడం; కట్టడం=భవన నిర్మాణం.

**ఆ) జతపరచండి.**

| అ | ఆ |
|---|---|
| 1) భారతదేశ ఆర్థిక రాజధాని | అ) మత్స్యాలయం |
| 2) గేట్‌వే ఆఫ్ ఇండియా | ఆ) మరాఠీ |
| 3) తారాపుర్‌వాలా | ఇ) ముంబయి |
| 4) మహారాష్ట్ర అధికారభాష | ఈ) చారిత్రక కట్టడం |

## ఆలోచన కొరకు

**కింది అంశాల గురించి ఆలోచించి, మీనోట్‌పుస్తకాలలో రాయండి.**

1) ముంబయిలో నీవు సందర్శించిన ప్రదేశాలేవి?

2) 'క్వీన్స్ నెక్లెస్' అని అనటానికి కారణం ఏమిటి?

## భాషావగాహన

**అ) కింది పదాలను కలిపి రాసి. సంధిపేరు రాయండి.**

1) పంచుకోవాలి + అని = ..........................

2) అద్భుతము + అయిన = ..............................

3) మా + అత్త = ..............................

4) పెద్దది + అయిన = ...................................

5) మేము + అంతా = .............................

**ఆ) కింది పదాలకు వాటి సమాస నామములతో జతపరచండి.**

| పదము | సమాస నామము |
|---|---|
| 1) ఇరవై రోజులు | అ) ద్వంద్వ సమాసము |
| 2) సూర్యచంద్రులు | ఆ) షష్ఠీ తత్పురుష సమాసము |
| 3) రాత్రింబవళ్ళు | ఇ) ద్విగు సమాసము |

**ఇ) కింది వాక్యములలో గీతగీసిన పదాలు ఏ నామవాచక రకాలకు చెందినవో తెలిపి వాటికి వాచకములు కూడా రాయండి. కింది ఉదాహరణను గమనించండి.**

ఉదా: మేము అత్తయ్య ఇంటికి వెళ్ళాము.

అత్తయ్య – జాతి నామవాచకం, మహతీవాచకము

1) కృష్ణ హ్యాంగింగ్ గార్డెన్స్ వెళ్ళి పూల మొక్కలు చూశాడు.

2) మీ అమ్మనాన్నలకు నమస్కారములు తెలియజేయుము.

## స్వీయస్పందన

1) మీరు చూచిన పర్యటనా స్థలమును గూర్చి నీ మిత్రునకు/మిత్రురాలికి సొంతమాటల్లో లేఖ రాయండి.

## ప్రసార మాధ్యమాలు

- ముంబయిలోని కంటెయినర్ 'నౌకాశ్రయం' 'నెహ్రూ సైన్స్ సెంటర్' ప్లానెటోరియం విశేషాలు అంతర్జాలం ద్వారా తెలుసుకోండి. మిత్రులకు చెప్పండి.

## లేఖా రచన

లేఖారచన ఒక కళ, మన మనస్సులోని భావాలు, ఆలోచనలు ఆయా విషయాలు ఇతరులకు తెలపడానికి లేఖ ఒక ఉత్తమ సాధనం.

### అనధికార లేఖ

- కుటుంబంలోని వ్యక్తులకు, సన్నిహితులకు రాయు లేఖలు.
- తేది ముందు రాసి లేఖ ఎవరికి రాస్తున్నామో వారి చిరునామాను రాయాలి.
- వ్యక్తులను బంధుత్వాన్ని బట్టి సంబోధించాలి.
- వ్యక్తుల క్షేమ సమాచారాలు అడగాలి.
- తెలియ పరచాలనుకున్న విషయం రాయాలి.
- లేఖలో చివరన లేఖను రాసేవారి పేరు చిరునామా రాయాలి.
- పై అంశాలన్నీ **'మిత్రునికి లేఖ'**లో చూపిన విధంగా రాయలి.



## అనధికార లేఖ-స్వరూపం

తేది ........................

లేఖ ఎవరికి రాస్తున్నామో వారి పేరు

చిరునామా ................................

................................................

గౌరవనీయులైన/పూజ్యులైన/ప్రియమైన

ముఖ్య సమాచారం

..........................................................................................................................................

..........................................................................................................................................

ఇట్లు ..............................

మీ ..................................

చిరునామా ................................

................................................

## సృజనాత్మకత

- పొదుపు పథకాలను గురించి తెలుసుకొని నివేదికగా రాయండి.
- మీకు నచ్చిన ఒక ప్రదేశంలోని చూడదగిన విశేషాలను గురించి, సమాచారం చిత్రాలు సేకరించి చక్కని గోడ పత్రిక తయారు చేయండి. ప్రదర్శించండి.

## భాషను గురించి తెలుసుకుందాం.

### కర్మధారయ సమాసము.

**ఉపాధ్యాయుడు:** మీరు ఇంతకుముందు సమాసము అంటే ఏమిటో గ్రహించారు కదా. రఘు నువ్వు నిర్వచనం చెప్పగలవా?

**రఘు: సమర్థంబులైన రెండు లేక అంతకుమించి పదములు ఏకపదమవుట సమాసము.**

**ఉపాధ్యాయుడు:** చక్కగా చెప్పావు. సమర్థంబు లైన రెండు పదాలు అని ఎందుకు అన్నారంటే ఏవైనా రెండు పదాలను కలిపి మనం సమాసము చేయలేము.

ఉదాహరణకు: తల్లిదండ్రులు, కూరగాయలు, రామబాణము ఇటువంటి పదాలు కలిసి **సమాసము**గా ఏర్పడి ఒక్కొక్కప్పుడు కొత్త అర్థాన్ని కూడా ఇస్తాయి. కుర్చీ, బల్ల, మంచము, కంచము ఇటువంటి పదాలు ఏకపదంగా సమాసంగా రూపొంద లేవు. అందుకే ఏ రెండు పదాలు కలిసి ఒక సమాసంగా ఏర్పడ గలవో అవే సమర్థవంతమైన పదములు అన్న మాట.

ఇప్పుడు మనం **కర్మధారయ సమాసం** గురించి తెలుసుకుందాం.

నిర్వచనం: విశేషణ, విశేష్యములతో ఏర్పడినది కర్మధారయము.

''విశేషణము'' అని దేనిని అంటారు వరుణ్.

వరుణ్: నామవాచకములోని విశేషమైన విషయమును తెలుపునది విశేషణము.

ఉపాధ్యాయుడు: సరిగ్గా చెప్పావు. విశేష్యము అంటే నామవాచకం అన్నమాట. కర్మధారయ సమాసము విశేషణము నామవాచకములతో కలసి ఏర్పడుతుంది. ఉదాహరణకు:

''కపిల గోవు''- గోవు అన్నది విశేష్యము (నామవాచకము). గోవు ఏ రంగులో ఉన్నది. ''కపిల'' (ఎరుపు నలుపు కలిసిన వర్ణము) అన్నది విశేషణము. సమాసములో మొదటి పదాన్ని ''పూర్వపదమని'', రెండో పదాన్ని ''ఉత్తర పదమని'' అంటారు. ఈ విశేషణము మొదటి పదముగా ఉన్నది ''కనుక'' విశేషణ పూర్వపద కర్మధారయం'' అంటారు.

అదే విధంగా ''కపోతవృద్ధము'' అనునప్పుడు వృద్ధమైన కపోతము అని విగ్రహ వాక్యం చెప్పాలి.

ఉదాహరణకు: ''కపోతము'' అంటే ''పావురము''. ఇది విశేషణమా? విశేష్యమా? గిరీ.

గిరి : కపోతము నామవాచకం కనుక ఇది ''విశేష్యం'' సార్.

ఉపాధ్యాయుడు : మరి ''విశేషణము'' సమాసములో పూర్వ పదమా? ఉత్తర పదమా? వర్షిణీ

వర్షిణి : విశేషణమయిన "వృద్ధము"(ముసలి) అను పదము రెండవ పదముగా ఉంది.

కనుక ''ఉత్తర పదము" అవుతుందండి.

ఉపాధ్యాయుడు: చక్కగా చెప్పావు. ఇప్పుడు ఇది ''విశేషణ ఉత్తరపద కర్మధారయ'' అని పిలువబడుతుంది. అలాగే రెండు పదాలు సమాసంలో విశేషణాలే అయితే ''విశేషణ ఉభయపద కర్మధారయం'' అవుతుంది. ఉదాహరణకు: ఎత్తు పల్లములు, మృదుమధురము మొదలగునవి.

## ద్విగు సమాసము

ఉపాధ్యాయుడు: కర్మధారయ సమాసము నందే పూర్వపదములో సంఖ్య వచ్చినట్లయితే దానిని ''ద్విగు సమాసం'' అంటాము.

ఉదాహరణకు: ''త్రిలోకములు'' పదానికి విగ్రహ వాక్యం చెప్పగలవా రవీ?

రవి : మూడైన లోకములు లేదా మూడు సంఖ్యగల లోకములు.

అదేవిధంగా ''సప్త ఋషులు'' ఏడుగురు ఋషులు ''అష్టదిక్కులు'' ఎనిమిది సంఖ్య గల దిక్కులు లేదా ఎనిమిదైన దిక్కులు అని చెప్పవచ్చు. ఇలా మూడు, ఏడు, ఎనిమిది మొదలగు సంఖ్యా పదములు సమాసములో మొదటి పదంగా ఉంటే ''ద్విగు సమాసం'' అని అంటారు.



# 7 పోరునష్టం-పొందులాభం

నేపథ్యం : సామెతలు నిత్య జీవితంలో జరిగే అనేక సంఘటనలకు ప్రతిబింబాలు. 'పోరునష్టం-పొందులాభం', 'కలిసివుంటే కలదు సుఖం' అనే సామెతలలోని నీతిని ఉదాహరణల సహితంగా పాటిద్దాం.

కాకి ఒకటి ఆకలితో
'కావు కావు', మనుచును
మెతుకులకై ఊరిలోన,
వెతుకులాడ సాగెను
కాకి చూచె పుల్లి విస్త
రాకు నొక్క సందులో
సంతసించి కాకి దాని
చెంతవాలె సంతలో
''కాకా'' యని కేక వేసె
కాకుల రారండని
ఆరగింపసాగె కాకు
లన్ని చేరి దానిని

దుక్కవంటి కుక్క ఒకటి
అక్కడి కేతెంచెను
కాకుల వెంటాడి ఎంగి
లాకు నోట కరచెను
ఆప్పుడే వచ్చిన దింకొక
అదరగొండి కుక్క
ఎగిరిన దాని పైన దూకి
తగవులాడ సాగెను
పుల్లి విస్తరాకు చిరిగి
చెల్లా చెదరాయెను
కుమ్ము దుమ్ములాడుచుండ
కూడు మట్టి కలిసెను.

కాకులవలె ఎల్లప్పుడు కలిసి బ్రతుకట లాభము
కాట్లకుక్క లట్లు లెపుడు-కలహించుట నష్టము



**కవిపరిచయం :** ప్రస్తుత పాఠ్యభాగ రచయిత కవిరావు. వీరిపూర్తి పేరు **కవికొండల వెంకటరావు**. వీరు 20 జులై 1892న తూర్పు గోదావరి జిల్లా శ్రీరంగ పట్టణంలో జన్మించారు. వీరు సుమారు 200 పైగా లఘు కథలు, 2 నవలలు, వందల కొలది గేయాలు, పాటలు, ఆంగ్లంలో కూడా కవితలు రాశారు. **ఆంధ్ర వర్డ్స్‌వర్త్‌గా** పేరుగాంచారు. వీరు 4 జులై 1969న గుంటూరులో కీర్తిశేషులయ్యారు.

## I సంభాషించండి - చర్చించండి :

1) పరస్పర సహకారం - విశిష్టత.

2) 'పోరునష్టం - పొందు లాభం'

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి :

### అ) పదజాలం పెంపొందించుకుందాం :

చెంత=సమీపము, దగ్గర; రారండని=రమ్మనిపిలుచుట; ఆరగించుట=భుజించుట, తినుట; ఏతెంచెను=వచ్చెను; వెంటాడి=వెంటపడి; తగవులాట = కొట్లాట, జగడమాడుట; కూడు=అన్నము; కలహించుట=కొట్లాడుట.

### ఆ) కింది ఖాళీలను కుండలీకరణంలోని పదాలలో నుండి సరైన దానిని ఎన్నుకొని పూరించండి.

(కూడు, కాకుల, ఊరిలోన, ఎంగిలాకు, అన్నము.)

1) మెతుకులకై ________ వెతుకులాడసాగెను.

2) ''కాకా'' యని కేక వేసె ________ రారండని.

3) కుమ్ము దుమ్ము లాడుచుండ ________ మట్టికలిసెను.

4) కాకుల వెంటాడి ________ నోట కరచెను.



### ఇ) గేయరచన - వర్ణన - చర్చ

''కాకుల వలె ఎల్లప్పుడు - కలిసి బ్రతుక లాభము. కాట్లకుక్కలట్లెపుడు - కలహించుట నష్టము'' - పై గేయ పాదాలలో కవి 'కాకుల వలె కలిసి మెలిసి జీవిస్తే లాభమని, కుక్కలవలె కలహిస్తే నష్టమని చెప్పి, కవి గేయసౌందర్యాన్ని ఇనుమడింప జేశాడు. కవి అభిప్రాయంతో మీరు అంగీకరిస్తారా? చర్చించండి.

### ఈ) గేయమును మరొకసారి చదివి, కింది ప్రశ్నలకు సమాధానములను మీ నోటు పుస్తకంలో రాయండి.

1) కాకులకు, కుక్కలకు స్వభావంలోని తేడాలు.

2) కాకులు సంఘజీవులు.

## భాషావగాహన

**అ) కింది వాటికి పర్యాయ పదాలు రాయండి.**

(1) ఊరు (2) కుక్క (3) తగవు (4) ఆకు

**ఆ) కింది వాక్యములో గుర్తింపబడిన పదములు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.**

దుక్క వంటి కుక్క ఒకటి అక్కడికి వచ్చెను.

**ఇ) కింది పదాలను కలిపి, సంధి పేర్లను రాయండి.**

1) కాకులు + అన్ని =

2) అక్కడికి + ఏ తెంచెను =

3) ఎంగిలి + ఆకు =

4) చెల్లా చెదరు + ఆయెను =

## సృజనాత్మకత



పై చిత్రాన్ని చూసి కథను రాసి, నీతిని తెల్పండి.




## వ్యాసము - రచన

**ఇంకా నా గురించిన వివరాలు తెలుసుకోండి..**

'పఠనం, గ్రహించుట, పరిశీలన, ఆలోచన, ఊహ మరియు అనుభవాలను సొంతవాక్యములలో లేఖనం చేయుట' మొదలగునవి వ్యాసము యొక్క ముఖ్య లక్షణములు.

వ్యాసములను 3 రకాలుగా విభజింపవచ్చును.

1. ఆలోచనాత్మక వ్యాసం
2. వర్ణనాత్మక వ్యాసం
3. ఆత్మకథ వ్యాసం.

1. **ఆలోచనాత్మక వ్యాసం :** ఒక అంశముపై ఆలోచించి వివరముగా రాయుట.
2. **వర్ణనాత్మక వ్యాసం :** వ్యక్తి, స్థలం, వస్తువు, సంఘటన మొదలగు వాటి గురించి వర్ణిస్తూ రాయుట.
3. **ఆత్మకథ వ్యాసం :** ఒక వ్యక్తి, వస్తువు, జంతువు మొదలగునవి తన గురించి తాను వివరించునట్లు వ్యాసము రాయుట.

## భాషను గురించి తెలుసుకుందాం.

### అవ్యయీభావ సమాసము

**ఉపా :** భాషాభాగములు అని వేనిని అంటారు? సీతా! చెప్పు

**సీత :** నామవాచకము, సర్వనామము, క్రియ, విశేషణము, అవ్యయము.

**ఉపా :** పీటర్! '**అవ్యయము**' అంటే ఏమిటి?

**పీటర్ :** 'లింగ, వచన, విభక్తు'లచే మార్పు చెందని పదములను '**అవ్యయములు**' అంటారు.

**ఉపా :** '**యథా, ఆ, ప్రతి, అవ, అధి, పరి**' మొదలగునవి అవ్యయములు, వీటితో కూడిన సమాసములను '**అవ్యయీభావ సమాసములు**' అంటారు.

ఉదా : పుల్లి విస్తరాకు చిరిగి చెల్లా చెదరాయెను.

**కింది సమాసములకు విగ్రహవాక్యములను గమనించండి.**

| | |
|---|---|
| ప్రతిదినము | దినదినము |
| ఆబాల గోపాలము | బాలుర నుంచి గోపాలుర వరకు |
| యథాశక్తి | శక్తిని అతిక్రమింపక |
| చెల్లాచెదరు | చెదరు చెదరు |



# 8 రాఖీ పండుగ

**నేపథ్యం :** భారతదేశం అనేక సంస్కృతులకు, సంప్రదాయాలకు నిలయం. దేశంలోని వివిధ ప్రాంతాలలో అనేక రకాల పండుగలు జరుపుకుంటారు. ఐకమత్యానికి, మానవసంబంధాలకు పండుగలు పట్టుకొమ్మలు. అలాంటి ప్రేమాభిమానాలకు ప్రతీక అయిన రాఖీపండుగను గురించి తెలుసుకుందామా!

**[తరగతి గదిలోనికి ఉపాధ్యాయురాలు రాగానే విద్యార్థులందరూ నిలబడి శుభోదయం టీచర్ అని అంటారు]**

**ఉపా** : శుభోదయం, కూర్చోండి. ఏమిటి విశేషం. అందరూ చాలా సందడిగా ఉన్నారు.

**విద్యార్థులు** : రేపు రాఖీ పండుగ కదా టీచర్...

**ఉపా** : అవును. రేపు మనకు సెలవు దినం కూడా. అయితే మనం ఈ రోజు రాఖీ పండుగను గురించి తెలుసుకుందాం. తరువాత రాఖీలను తయారుచేయడం నేర్పుతాను.

**విద్యార్థులు** : (అంతా సంతోషంతో) అలాగే టీచర్.

**ఉపా** : రాఖీ పండుగను ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలోని పూర్ణిమనాడు జరుపుకుంటాం. అక్కా చెల్లెళ్ళు రాఖీ పండుగనాడు అన్నదమ్ముల కుడిచేతికి రాఖీ కడతారు. తమకు ఎల్లవేళలా రక్షకుడిగా ఉండాలని కోరుతారు. అందువలన ఈ పండుగను 'రక్షాబంధన్' అని కూడా అంటారు. కొన్ని ప్రాంతాలలో రాఖీ పూర్ణిమను 'జంధ్యాల పూర్ణిమ' అని కూడా అంటారు. మీ ఇంట్లో ఈ పండుగను ఎలా చేసుకుంటారో ఒక్కొక్కరు చెప్పండి.



లక్ష్మి : ఆరోజు నేను మా తమ్ముడికి రాఖీ కడతాను టీచర్.

సుమతి : ఈ రాఖీ పండుగ అంటే నాకు చాలా ఇష్టం. ఈ పండుగ రోజున అమ్మ చెప్పినట్లుగా అన్నయ్యను కూర్చోబెట్టి తిలకం దిద్దుతాను. రాఖీ కడతాను. మిఠాయి తినిపిస్తాను. హారతి ఇస్తాను. క్రిందటి సంవత్సరం మా అన్నయ్య నాకు 'చందమామ కథలు' అనే పుస్తకాన్ని కానుకగా ఇచ్చాడు.

ఉషా : మీ అన్నయ్య నీకు మంచి కానుక ఇచ్చాడు.

వివేక్ : నేను నా చిన్న చెల్లికి రంగు రిబ్బన్లు ఇచ్చాను.

స్వాతి : ఆరోజు మా అమ్మ మా అందరి కొరకు బొబ్బట్లు చేసింది.

పృథ్వి : మేమంతా మా మామయ్య ఇంటికి వెళ్తాము. మా అమ్మ వాళ్ళ తమ్ముళ్ళకు రాఖీ కడుతుంది. ఆ రోజంతా సరదాగా గడుపుతాము.

స్వాతి : నేను మా అన్నయ్యకు రాఖీ కట్టాను. నాకు 'సాహస బాలురు' అనే కథల పుస్తకం కానుకగా ఇచ్చాడు.

ఉషా : మీ అన్నయ్య మంచి పుస్తకం ఇచ్చాడు. ఇలా తమకు రాఖీ కట్టిన అక్కాచెల్లెంద్రకు అన్నదమ్ములు కానుకలు ఇస్తుంటారు.

శ్రీయాన్ : అన్నదమ్ములు లేనివారు ఎలా చేసుకుంటారు ఈ పండుగను టీచర్?

ఉషా : అన్నదమ్ములుగా భావించి రాఖీ కట్టినట్లైతే వారిని స్వంత అక్కాచెల్లెంద్రుగా భావించడం జరిగిన సంఘటనలు చరిత్రలో ఉన్నాయి.

పూర్వం ఒకసారి మేవాడ్ మహారాణి కర్ణావతి రాజ్యాన్ని బహదూర్ షా ముట్టడించాడు. అతని అపార సైన్యాన్ని తన సైన్యంతో ఎదుర్కోవడం అసాధ్యమని మహారాణి తలచింది. వెంటనే అప్పుడు ఢిల్లీని పాలిస్తున్న మొగల్ చక్రవర్తి హుమాయూన్‌కు రాఖీని పంపించింది. వెంటనే ఆ చక్రవర్తి తన సైన్యంతో ఆమెకు రక్షణగా నిలబడి రాజ్యాన్ని కాపాడాడని చరిత్ర చెప్తుంది. దీనిని బట్టి మొగల్ చక్రవర్తులు 'రక్షాబంధన్' నియమాలు పాటించినట్లు తెలుస్తుంది.

అంతేకాదు, భారతదేశ స్వాతంత్ర్య సమయంలో అనేకమంది స్త్రీలు, పురుషుల చేతికి రాఖీలు కట్టారు. వారితో స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడానికి ప్రతిజ్ఞలు చేయించారు. పూర్వం అన్నదమ్ముల అభివృద్ధికి, రక్షణకు భగవంతుని ప్రార్థిస్తూ పవిత్రముగా తయారుచేసిన పసుపుదారమును అక్క చెల్లెళ్ళు వారి చేతికి కడుతుండేవారు. తర్వాతి కాలంలో పసుపుదారమునకు బదులుగా రంగురంగుల మెరిసే రాఖీలు వాడుకలోనికి వచ్చాయి. ఇలా అన్నదమ్ములు అక్క చెల్లెళ్ళకు కానుకలు ఇస్తుంటారు. తీపి పిండివంటలు తింటారు. పండుగ నాడు అందరూ సంతోషంగా కలుసుకొని ఆనందిస్తారు.

విద్యార్థులు : రాఖీ పండుగ గురించి అనేక విశేషాలు తెలుసుకున్నాము టీచర్. ధన్యవాదములు.

**I. సంభాషించండి - చర్చించండి :**

1) పండుగలు - ప్రాముఖ్యత ; 2) నీకు నచ్చిన పండుగ

**II. ఆలోచించండి - చెప్పండి - రాయండి**

**అ) పదజాలం పెంపొందించుకుందాం**

సందడి = గోల, అల్లరి, హడావిడి; కానుక = బహుమానము; ముట్టడించుట = దాడి చేయుట; ప్రతిజ్ఞ = శపథం.

**ఆ) పాఠం నుండి కొన్ని పంక్తులు ఇవ్వబడినవి. వాటి అర్థమేమిటి? వాటిని సహవిద్యార్థులతో చర్చించి వాటి అర్థాన్ని లేదా భావాన్ని మీ లేఖన పుస్తకంలో రాయండి.**

1. ''భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో అనేకమంది స్త్రీలు, పురుషుల చేతికి రాఖీలు కట్టారు.''
2. ''మేవాడ్ మహారాణి హుమయూన్ చక్రవర్తికి రాఖీ పంపించింది.''

**ఇ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.**

1. రాఖీ పండుగను 'రక్షాబంధన్' అని పిలుచుటకు కారణము.
2. పండుగల వల్ల ప్రయోజనాలు.

## భాషావగాహన

**అ) కింది వాక్యాలలో గుర్తింపబడిన ప్రత్యయాలు ఏ విభక్తులకు చెందినవో రాయండి.**

| | |
|---|---|
| 1) అమ్మ వాళ్ళ తమ్ముళ్ళకు రాఖీ కడుతుంది. | |
| 2) రాఖీ పండుగను గురించి తెలుసుకుందాం. | |
| 3) అతని అపారసైన్యాన్ని తన సైన్యంతో ఎదుర్కోవడం అసాధ్యం. | |
| 4) అమ్మ అందరి కొరకు బొబ్బట్లు చేసింది. | |

**ఆ) కింది వాక్యాలు సామాన్య/సంశ్లిష్ట/సంయుక్త వాక్యాలలో ఏరకమునకు చెందినవో రాయండి.**

1) రక్షాబంధన్‌ను రాఖీపూర్ణిమ, జంధ్యాల పూర్ణిమ అనిపిలుస్తారు.
2) అన్నయ్య నాకు మంచి కానుక ఇచ్చాడు.
3) అన్నయ్యకు హారతి ఇచ్చి రాఖీ కడతాను.

**ఇ) కింది పదాలకు విగ్రహ వాక్యంరాసి సమాసనామం రాయండి.**

(1) శ్రావణమాసం (2) అన్నదమ్ములు (3) మంచి కానుక (4) ప్రతి సంవత్సరం

## స్వీయస్పందన

- రాఖీ పండుగను మీరు జరుపుకునే విధం.

## భాషను గురించి తెలుసుకుందాం.

### తత్పురుష సమాసం

శ్రీరాముడు తండ్రి ఆనతి మీరని వినయశీలి, ప్రజలను కన్నబిడ్డల వలె పాలించెను. రామరాజ్యములో ప్రజలు సుఖశాంతులతో, భోగ భాగ్యాలతో జీవించేవారు. నాడు చోరభయం వుండేది కాదు. రాజ్యపాలనలో రామునికి సోదరులు చేదోడు వాదోడుగా నుండిరి.

**ఉపా :** రవీ! **''రామరాజ్యము''** అను సమాసపదానికి విగ్రహవాక్యం చెప్పి దానిని బట్టి ఆ సమాసం పేరు చెప్పు.

**రవి :** **'రాముని యొక్క రాజ్యము.'** ఇక్కడ **'యొక్క'** అను **షష్ఠీ విభక్తి ప్రత్యయం** వచ్చింది. అందువలన ఇది షష్ఠీ తత్పురుష సమాసము అవుతుంది మాష్టారు.

**ఉపా :** అవును. విగ్రహవాక్యం చెప్పినపుడు మనం ఏ విభక్తి ప్రత్యయాన్ని ఉపయోగిస్తామో అది ఆ తత్పురుష సమాసము అవుతుంది. విమలా! నువ్వు, **''చోరభయము''** అను పదానికి విగ్రహవాక్యం ఏదో చెప్పగలవా?

**విమల :** ''చోర భయము'' అనగా **చోరుని వలన భయము** అని అర్థము. **''వలన''** అను విభక్తి ప్రత్యయాన్ని ఇక్కడ ఉపయోగించాము. కనుక ఇది **పంచమీ తత్పురుష సమాసం** అవుతుంది మాష్టారు.

**ఉపా :** సరిగా చెప్పావు. ఇప్పుడు మీరు గ్రహించి ఉంటారు కదా. ఈ తత్పురుష సమాసం ఉత్తరపద ప్రాధాన్యత కలది. ప్రథమా తత్పురుష నుంచి సప్తమీ తత్పురుష వరకు విభక్తి ప్రత్యయాలను ఇప్పుడు మీరు కింది పట్టిక ద్వారా తెలుసుకోండి.

పూర్వకాయము – కాయము యొక్క పూర్వభాగము – ప్రథమా తత్పురుష సమాసము
నెలతాల్పు – నెలను ధరించిన వాడు – ద్వితీయా తత్పురుష సమాసము.
బుద్ధిహీనుడు – బుద్ధిచే హీనుడు – తృతీయా తత్పురుష సమాసము.
గ్రంథాలయము – గ్రంథముల కొఱకు ఆలయము – చతుర్థీ తత్పురుష సమాసము.
దొంగభయము – దొంగవలన భయము – పంచమీ తత్పురుష సమాసము.
రాజకుమారుడు – రాజు యొక్క కుమారుడు – షష్ఠీ తత్పురుష సమాసము.
గృహ కృత్యములు – గృహమందలి కృత్యములు – సప్తమీ తత్పురుష సమాసము.
అసత్యము – సత్యము కానిది – నఞ్ తత్పురుష సమాసము.
(నఞ్ తత్పురుష సమాసమున పదమునకు ముందు 'న' కానీ, 'అ' కానీ ఉండును).

**కింది సమాసాలను జతపరచండి :**

| | | |
|---|---|---|
| 1) | కథల పుస్తకం | అ) నఞ్ తత్పురుష సమాసము |
| 2) | చోరభయం | ఆ) తృతీయా తత్పురుష సమాసము |
| 3) | కాలినడక | ఇ) షష్ఠీ తత్పురుష సమాసము |
| 4) | అనవసరం | ఈ) పంచమీ తత్పురుష సమాసము. |

# 9 మన చేతుల్లోనే మన ఆరోగ్యం

నేపథ్యం :

- తెలంగాణ మాండలిక భాష ఎంత మనోరంజకంగా ఉంటుందో, అంతే ఇష్టంగా, ఆసక్తిగా వుంటుంది. ఇటీవల అనేక తెలుగు టీ.వి. చానళ్ళలో ఈ మాండలిక భాషయందలి కార్యక్రమాలను ప్రజలు ఎంతో ఇష్టంతో ఆసక్తిగా చూస్తుంటారు.
- స్వచ్ఛత ప్రజా ఆరోగ్య జీవనంలో ఎంతో ప్రాముఖ్యత కలిగినది. నేడు దేశమంతా స్వచ్ఛత ఉద్యమమే నడుస్తోంది. ఈ రెండు అంశాల సమ్మిళితమే ఈ పాఠ్యభాగము.

మల్లవ్వా! మల్లవ్వా! అని పిలుస్తూ రాజయ్య గుడిసెలోనికి వచ్చాడు.

“ఆఁ గిక్కడనే ఉన్న” వాకిట్లోనే పొయ్యిమీది అన్నం కుండ దించుతూ మల్లవ్వ జవాబుచ్చింది.

“అన్నమయినాదే. ఆకలయితుంది'' నోట్లో నీళ్ళు పుకిలించి ఉమ్మేస్తూ అడిగాడు.

‘‘ఆఁ అయింది. తానం జెయ్యవా” మల్లవ్వ పొయ్యిమీద కూరవేసి అంది.

“ఆఁ తానం జేస్త! ఇప్పటికే ఆల్శెమయిపోయె. దొడ్ల పెండ, మన్ను, మశానం తీసి గోజలకు గడ్డేశ వరకే ఆమ్మెటాళ్ళ అయిపోయె. జల్ది బుక్కెడంత కూడు పెడ్తె కుదిచ్చుకొని బాయి కాడికి పోవాలె” తొందర పెట్టేడు రాజయ్య.

“ఆఁ గా పెండా మన్ను మశానం తీసినవనే అంటున్న చేతులు సాపుగా కడుక్కోని, గట్లే తానం గూడా జేస్తే అన్నం బెడ్త” మల్లవ్వ కూర మర్లేసి మూతబెట్టింది.

‘‘గిదేందే గియ్యాల కొత్తగ జెప్పవడ్తివి. రోజు గిట్లనే తిని పోయెటోన్నేగదా” ఆశ్చర్యపోయాడు రాజయ్య.

“రోజుటి సంగతి వేరు! ఇయ్యాలటినుండి వేరు! ఇయ్యాలిటి నుండి చేతులు శుభ్రంగా కడుక్కోని గోళ్ళు తీసుకొని దినాం తానం జేస్తెనె తిండి, లేకపోతే కడుపు కాలి పోవాల్సిందే'' కటువుగా అంది మల్లవ్వ.

‘‘గట్టెట్టనే” రాజయ్య నోరు తెరిచాడు.

“ఏమో నీ కొడుకును గదే మల్లేశుని అడుగు”

“వాడు జెప్పిండు గివన్నీ. ఇంతకు వాడేడి?”

“ఔ మల్ల వానికి ఇవన్ని బడిల జెప్పిండ్రట! మన చేతులల్లనే మన ఆరోగ్యం ఉంటదట! చేతుల గోళ్ళు అన్నీ తీసుకొని, మట్టి, పెండ లేకుండ ఉంచుకొంటే సగం రోగాలు దగ్గరికే రావట! ఇగ తానం జేత్తె పెయ్యంత శుభ్రమయి తిన్నది గిర్ని లెక్క అరిగిపోతదట! గట్టనే పెయ్యి ఆరోగ్యంగా ఉంటదట”

“గట్లనా! ఇంతకు వాడేడి?”

“అగో అదే, గా చెట్టుక్రింద కూచుని సదువుకొంటుండు”

"మల్లేశంగాడు సదువుకొంటుండా! అదీ ఆదివారంనాడు, గింత బుద్ధిమంతుడయిండేమే'' అంటూ కొడుక్కేసి నడిచాడు. అవునయ్యా! "గది కాదే నాయినా! పాఠశాల పారిశుద్ధ్య పథకం కింద వ్యక్తిగత పరిశుభ్రత'' గురించి చెప్పింద్రు.



వాడిప్పుడు మునుపటి మల్లేశం కాదు. బడిలో గాళ్ళెవలో వచ్చి ఏమేమో జెప్పింద్రట ఇగ గప్పటినుంచి వాడు బడినుంచి రాంగానే పూర్తిగా మారిపోయి అమ్మా నేను బాగా సదువుకొని డాక్టరయితనే అని ఒకటే పట్టుపట్టిండు.

ఓహో! గట్లనా! గందుకే డాక్టర్ మాటలు జెప్పిండా? చేతులు గడుగుడు, తానం జేసుడు''

"కాదయ్యా డాక్టర్ అవసరం లేని మాటలు జెప్పిండు'' అంతలో అక్కడికొచ్చిన మల్లేశం అన్నాడు.

"సరే బిడ్డా. మీయమ్మ జెబితే నాకు అర్థం కాలేదు గాని ఈ చేతులు కడుగుడు ఏందిరా?'' అన్నాడు.

''మనిషి ప్రతిసారి భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత తప్పకుండా శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. ఇందువల్ల 80% వాంతులు, విరేచనాలు రాకుండా నివారించవచ్చు. శుభ్రత పాటిస్తూ బహిరంగ మల మూత్ర విసర్జన మానుకుని, పరిసరాలన్ని చక్కగా ఉంచుకుంటే మంచిది'' అని గదే నేను పాటిస్తూ మిమ్మల్ని కూడా పాటించమంటున్న'' విశదీకరించాడు మల్లేశం.

"మంచిది బిడ్డా! నువు చెప్పినది మంచిమాటే కదా! పాటించి చూద్దాం. మునిగిపోయేదేముంది'' రాజయ్య నమ్మకంగా అన్నాడు.

"కొడుకు చెబితే గానీ రోగం తిర్గలేదు అయ్యగానికి'' మల్లవ్వ ముసిముసిగా నవ్వుకొంది.

**రచయిత పరిచయం :** ప్రస్తుత పాఠ్యభాగ రచయిత **చొప్పదండి సుధాకర్**గారు. మెదక్ జిల్లాకు చెందిన ప్రముఖ తెలుగు రచయిత మరియు కవి. వీరు 10-08-1963న జన్మించారు. 'జీవితం చేసిన సంతకం' వంటి నవలలు, పలు కవితలు రాసి సాహిత్యంలో తనదైన ముద్రవేశారు. ఆయన రచనలలో భావోద్వేగాలు మరియు సామాజిక అంశాలు ప్రతిబింబిస్తాయి. ప్రస్తుత పాఠ్యభాగం **'బాల చెలిమి'** (మెదక్ జిల్లా) నుండి గ్రహింపబడినది.

## I. సంభాషించండి - చర్చించండి.

1. క్రీడాకారులు ఆరోగ్యం గురించి పాటించే నియమాలు.
2. పాఠశాల పారిశుద్ధ పథకం కింద వ్యక్తిగత పరిశుభ్రత గురించి డాక్టర్లు చెప్పిన అంశాలు.
3. వివిధ రకాల కథలను చదివి రచయితల శైలిని గురించి చర్చించండి.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

తానం = స్నానం; మన్ను = మట్టి; పెయ్యి = శరీరం; కూడు = అన్నం; మర్లేసి = తిరగేసి ;

### ఆ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.

1. రాజయ్య అపరిశుభ్రంగా ఉన్నాడని తెలిపే అంశాలు రాయండి .
2. 'మల్లేశం బుద్ధిమంతుడు అయ్యాడు' దీనికి కొన్ని ఉదాహరణలు వివరించండి.

## భాషావగాహన

### అ) కిందిపదాలు ఏ వాచకానికి చెందినవో రాయండి.

| | |
|---|---|
| 1. చెట్టు | |
| 2. రాజయ్య | |
| 3. మల్లవ్వ | |

### ఆ) కింది వాక్యాలు ఏ రకానికి చెందినవో రాయండి.



1) ''చెట్టు కింద కూచుని చదువుకుంటుండు''

2) ''వాడు జెప్పిండు ఇవ్వన్ని. ఇంతకు వాడేడి?''

3) "గిదేందే! గియ్యాల కొత్తగా జెప్పవడ్తివి.''

### ఇ) కింది పదాలు విడదీసి, సంధి పేరు రాయండి.

(1) అరిగిపోతుదంట (2) వాడేడి (3) మీయమ్మ

### ఈ) కింది పదాలకు విగ్రహ వాక్యము రాసి, సమాసము పేరు రాయండి.

(1) డాక్టర్ మాటలు (2) అన్నంకుండ (3) మంచిమాట

## స్వీయస్పందన

1. మీ పాఠశాల పరిశుభ్రత గురించి మీరు ఏయే కార్యక్రమాల్లో పాల్గొన్నారో చెప్పండి.
2. ఆరోగ్యానికి సంబంధించిన అంశాల గురించి తరగతిలో చర్చించి, కింది ఆకృతిని పూరించండి.




## ప్రసార మాధ్యమాలు

- మీ తరగతి డిజిటల్ టీ.వి.లో, మీ ఉపాధ్యాయుల సహకారంతో స్వచ్ఛత నియమాలు గురించిన అంశాలు చూడండి – చర్చించండి – రాయండి.

## సృజనాత్మకత

- ఇంటర్‌నెట్‌లో తెలంగాణ మాండలిక పదాల గురించి తెలుసుకొని, రాయండి.

## ప్రాజెక్ట్ పని

### "ఆరోగ్యమే మహాభాగ్యం" – (ఉపన్యాసం)

కింది అంశాల ఆధారంగా ఉపన్యాసాన్ని తయారు చేయండి.

- ఆరోగ్యమే మహాభాగ్యము అనగా మనకు ఆరోగ్యమును మించిన సంపద ఇంకొకటి లేదు అని అర్థము.
- మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ముఖ్యంగా మూడు అంశాలు పాటించాలి.

(1) సరైన ఆహారపు అలవాట్లు. (2) ఉదయం నడక, వ్యాయామం, యోగ. (3) అవసరమైనచో సరైన వైద్య చికిత్స.





- మనం ఆరోగ్యంగా ఉంటేనే హాయిగా పని చేయగలుగుతాము, హాయిగా జీవించ గలుగుతాము.

# సులభమైన వంట - తీపి తీపి వంట

(పెద్దల సాయంతో చేద్దాం. పంచుకొని తిందాం)



### కావలసినవి

| | | |
|---|---|---|
| సన్నని గోధుమ సేమ్యాలు | - | 1 కప్పు |
| పాలు | - | 1/2 లీటరు |
| పంచదార | - | ఒక కప్పు |
| యాలకల పొడి | - | అర టీ స్పూను |
| జీడి పప్పు ముక్కలు/సారపప్పు | - | కొన్ని |
| నెయ్యి | - | రెండు టీ స్పూన్లు |

### చేసే విధానం

ముందుగా పొయ్యి మీద బాణలి లేదా మందమైన గిన్నె పెట్టి నెయ్యి వేసి నెయ్యి వేడెక్కాక అందులో జీడిపప్పు ముక్కలు/సారపప్పు వేసి దోరగా వేయించి తీసుకోవాలి. తరువాత అదే నేతిలో సేమ్యాలు వేసి దోరగా వేయించి తీసుకోవాలి. ఒక గిన్నెలో పాలుపోసి బాగా చిక్కగా అయ్యేవరకు మరిగించాలి. తర్వాత కిందకి దించి అందులో పంచదార, సేమ్యాలు వేసి బాగా కలిపి మూత పెట్టేయాలి. 20 నిమిషాలలో సేమ్యాలు వేడి పాలలో చక్కగా ఉడుకుతాయి. అప్పుడు జీడిపప్పు ముక్కలు/సారపప్పు వేసి కలబెట్టి వడ్డించుకోవాలి.

అంతే సులభమైన తీయతీయని సేమ్యా పాయసం తయారు.

సూచన : లావు సేమ్యాలు అయితే కొంచెంసేపు పొయ్యి మీదనే పాలల్లో ఉడకనివ్వాలి.

# 10 సైనికుడు

**నేపథ్యం :** మన దేశ రక్షణకు సైన్యము ఎంత ముఖ్యమైనదో మనందరికి తెలుసు. మన దేశాన్ని, దేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడే వీరజవానులకు మనమంతా ఎల్లప్పుడూ ఋణపడి ఉంటాము. వరదలు, భూకంపాలు వంటి ఎన్నో క్లిష్ట పరిస్థితుల్లో ప్రజలను ఆదుకుంటూ, తమప్రాణాలు సైతం త్యాగంచేసే అమరవీరులకు 'జై జవాన్'' అని జేజేలు పలుకుతూ సెల్యూట్ చేసి 'సైనికుడు' గేయాన్ని పాడుకుందాం.

దేశ రక్షణే పరమధ్యేయమై
సమర దీక్షతో సాగేస్తా!
నేనే వీర జవానునోయ్!
నేనే విక్రమశాలి నోయ్!

దేశంకోసం నా సర్వస్వం
ధీరతతో త్యాగం చేస్తా!
ప్రపంచమున నా దేశానికి ఒక
ప్రముఖ స్థానం కల్పిస్తా! ॥దేశ॥

సమర రంగమున రుద్రమూర్తినై
శత్రువులను పరిమారుస్తా!
సవ్యసాచినై శౌర్యమూర్తినై
స్వాతంత్ర్యము సమకూరుస్తా । ॥దేశ॥

చరిత్ర పుటలను స్వర్ణాక్షరముల
జాతి చరిత్రను వెలయిస్తా!
అఖిల జగమ్ముల కాదర్శముగా
అమర జీవినై శోభిస్తా!
అదే అదే నా ఆశయం!
అఖిల జగానికి శుభోదయం!



## I. సంభాషించండి - చర్చించండి.

1. ''దేశరక్షణ-ప్రతి ఒక్కరి కర్తవ్యం.''
2. 'ప్రపంచమున నాదేశానికి ఒక ప్రముఖ స్థానం కల్పిస్తా'
3. వీరసైనికుల నిధికొరకు పాఠశాల విద్యార్థులు చందాలు వసూలు చేయుట - చర్చించండి.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

ధీరతతో = ధైర్యంతో; సమరరంగం = యుద్ధ భూమి; పరిమారుస్తా = అంతం చేస్తా;
అమరజీవి = మరణించిన తర్వాత కూడా ప్రజల హృదయాలలో నిలిచిన వారు.

### ఆ) గేయ పాదాలను పూరించండి.

1. ప్రపంచమున ..........................
.................................. కల్పిస్తా !

2. చరిత్ర ....................................
.................................... వెలయిస్తా!

## పంక్తులపై చర్చ

1) 'సమర రంగమున రుద్రమూర్తినై శత్రువులను పరిమారుస్తా'.
2) అఖిల జగమ్ముల కాదర్శముగా అమరజీవినై శోభిస్తా.

## భాషావగాహన

### అ) కింది వాక్యాలలో సకర్మక/అకర్మక క్రియలలో ఏ రకానికి చెందినవో గుర్తించి రాయండి.

1. రాజయ్య ఆశ్చర్యపోయాడు. ____________
2. మల్లమ్మ అన్నం వండుతుంది. ____________
3. అమరజీవినై శోభిస్తా. ____________
4. సైనికుడు సమరదీక్షతో సాగుతాడు. ____________

### ఆ) కింది వాక్యాలలో గీతగీసిన ప్రత్యయం ఏ విభక్తికి చెందినదో రాయండి.

1. ధీరతతో త్యాగం చేస్తా! ____________
2. శత్రువులను పరిమారుస్తా ! ____________
3. అఖిల జగానికి శుభోదయం! ____________

ఇ) కిందివాటికి విగ్రహవాక్యములు రాసి, సమాసముల పేర్లు రాయండి.

| పదము | విగ్రహవాక్యము | సమాసము పేరు |
|---|---|---|
| 1. దేశ రక్షణ | | |
| 2. అఖిల జగమ్ములు | | |
| 3. ప్రముఖస్థానం | | |

## స్వీయస్పందన

- **కింది అంశాల ఆధారంగా సైనికుని ఆత్మకథ రాయండి.**

  నేను – సైనికుడు – సైన్యంలో చేరాను – దేశభక్తి – దేశసేవ, ఎన్నో యుద్ధాలు – కొన్నింటిలో విజయం, కొన్నింటిలో పరాజయం – ఆత్మవిశ్వాసం, ధైర్యం కోల్పోలేదు – దేశసేవకే – నా జీవితం – అంకితం – జైజవాన్ – మేరా భారత్ మహాన్.

## ప్రసార మాధ్యమాలు

1. ఎర్రకోటపై జరిగే స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను టీ.వి.లో చూడండి. వాటిలో మన సైనిక దళాల విన్యాసాలు, రక్షణ ఆయుధాలు చూసి రాయండి.
2. త్రిదళాల దుస్తుల పద్ధతి (డ్రెస్ కోడ్), వారి సెల్యూట్ పద్ధతులను అంతర్జాలం సహాయంతో తెలుసుకోండి.

## సృజనాత్మకత

- భారత వీరసైనికుల చిత్రాలు, వివరాలు, వారికి లభించిన గౌరవాల గురించి ఒక్కొక్క జట్టు ఒక గోడపత్రిక (పోస్టర్) తయారు చేయండి.
- వివిధ ధళాల సైనిక వందనాలలో ఉన్న భేదాలను తెలియజేస్తూ గోడపత్రిక తయారు చేయండి.

**కృత్యము :** చిన్న కాగితపు ముక్కలపై వైద్యుడు, ఇంజనీయర్, వకీల్, కవి, రైతు, నాయకుడు మొ॥ పేర్లు రాసి గుండ్రంగా చుట్టి ఒక డబ్బాలో వేయాలి. ఒక్కొక్క విద్యార్థితో ఒక్కో కాగితము ముక్క తీయించి అందులో వచ్చిన పేరు ప్రకారం సొంతంగా మనోరంజకంగా 4 వాక్యాల ఉపన్యాసం ఇప్పించాలి.

**విద్యార్థి సూచన :** మన దేశ రక్షణకు పాటుపడే త్రివిధ దళాల చిత్రాలను వారిని గురించిన వివరాలను సేకరించండి. రాయండి.

# అక్షరాల తోవ




నేపథ్యం : బొమ్మను గమనించారు కదా! అక్షర ప్రాధాన్యతని తెలుసుకోవడానికి జీవాతోపాటు మనం కూడా ప్రయాణం చేద్దాం.

అక్షర జ్ఞాన జ్యోతి వెలుగు వ్యక్తిలో మాత్రమేగాక సమాజంలోని అంధకారాన్ని పారద్రోలుతుంది.

ప్రస్తుత పాఠంలో అక్షరజ్ఞానం జీవాకు ఎలా ఉపయోగపడిందో పాఠం చదివి తెలుసుకుందామా!

అరేబియా సముద్రంలోని ఒక దీవి అది. అంగడికి వెళ్ళి ఇంటి సరుకులు తీసుకురమ్మని పదిహేనేళ్ళ జీవాతో అతడి అమ్మ చెప్పింది.

అవి తాము ఉండే దీవిలో దొరికేవి కావు. కాబట్టి చిన్న పడవ తీసుకుని దగ్గరిలోని మరో దీవికి వెళ్ళి తీసుకురావాలి.

“ఇప్పటికే సూర్యుడు అస్తమిస్తున్నాడు. చీకటి పడుతోంది, నేను రేపు వెళ్లి తీసుకువస్తాను” అని జీవా బదులిచ్చాడు.

“మీ నాన్న రేపు చేపల వేటకు వెళ్తున్నాడు. ఉదయాన్నే వంట సిద్ధం చేయాల్సి ఉంది. నేను కూడా తోడు వస్తాను, ఇద్దరం వెళ్ళి సరుకులు తీసుకువద్దాము” అని వాడి అమ్మ చెప్పింది.

సరేనని చెప్పి పడవని బయటికి తీశాడు జీవా. దగ్గరిలోని దీవి కన్నా కొంచెం దూరంలో ఉన్న దీవిలో మంచి సరుకులు దొరుకుతాయని ఇద్దరూ బయలుదేరారు.

త్వరలో దీపావళి పండుగ రానున్నది. అందువల్ల వారు వెళ్ళిన అంగడి వద్ద విపరీతమైన జనం ఉన్నారు. దాంతో వారికి సరుకులు తీసుకుని ఇంటికి బయలుదేరటానికి చాలా ఆలస్యం అయ్యింది. అయితే తెలిసిన దారే కాబట్టి ధైర్యంగా పడవలో బయలుదేరారు.

బాగా పొద్దుపోవడంతో అప్పటికే ఎక్కువ చీకటి పడింది. జాగ్రత్తగా పడవ నడుపుతున్నాడు జీవా. హఠాత్తుగా ఆకాశం నల్లటి మబ్బులేసింది. గాలి వేగం పెరిగి అలల తాకిడి ఎక్కువయ్యింది. పడవ అటూఇటూ ఊగుతూ దారి తప్పింది.

ఇద్దరూ భయంతో అరవసాగారు. ఆ అరుపులు ప్రక్కనున్న దీవి వాసులకెవ్వరికీ వినిపించలేదు.

జీవాను వెదుక్కుంటూ వాడి నాన్న తన మిత్రులతోటి పడవ తీసుకుని బయలుదేరాడు. అయితే చీకటిలో వారికి జీవా పడవ కనిపించలేదు.

దారితప్పిన జీవాకి దిక్కు తోచలేదు. “ఇల్లు ఎలా చేరగలం? మనం దారి తప్పిన విషయం నాన్నకి ఎలా తెలియజేయగలం?” అని ఆలోచనల్లో పడ్డాడు.

ఇంతలో ఆకాశంలో దూరంగా ఓ మెరుపు మెరిసింది. దాన్ని చూసిన జీవా మదిలో మెరుపులా ఆలోచన మెదలాడింది.

వెంటనే తాము కొన్న సరుకుల సంచిలో నుంచి కొన్ని ఆకుదొప్పలు బయటికి తీయించాడు. వాటిలో ప్రమిదలు పెట్టి కొంచెం నూనె పోసి, ఒత్తులు వెలిగించి సముద్రంలో వదలమన్నాడు.

అలలపైన తేలియాడుతున్న దీపాలను చూసి వారి జాడను కనుక్కోగలిగినాడు జీవా నాన్న. వెంటనే తన స్నేహితులను పురమాయించి వేగంగా జీవా ఉన్న పడవ వద్దకు చేరాడు. అందరూ చేరి ఇద్దరినీ భద్రంగా ఇంటికి చేర్చారు.

ఎంతో ఆసక్తిగా ఉన్న దీవి జనం జీవాను, అతడి అమ్మని చూసి ఎంతో ఆనందించారు. అభినందనలు అందజేయడానికి వచ్చిన దీవిపెద్ద, జీవాని ''గట్టిగా మీరు వేసిన కేకలు మాకు వినిపించలేదని, దీపాలు వెలిగించి మీరు ఉండే ప్రదేశం మాకు తెలియపరిచావు. అసలు నీకు దీపాలు వెలిగించాలనే ఆలోచన ఎలా వచ్చింది?'' అని అడిగాడు.

జీవా వినయంగా దారి తప్పి సముద్రంలో దిక్కు తెలియని స్థితిలో ఉన్నప్పుడు ఓ మెరుపు మెరిసింది. అప్పుడు వెలుతురు మొదటిగా కనిపించి తర్వాత శబ్దం వినిపించింది. వెంటనే... నాకు మా సైన్సు మేడమ్ చెప్పింది గుర్తుకొచ్చింది. శబ్దవేగం కన్నా కాంతివేగం చాలా రెట్లు ఎక్కువగా ఉంటుందని... దాంతో వెంటనే మా అమ్మ చేత దీపాలు వెలిగించి సముద్రంలో వదిలాము'' అని బదులిచ్చాడు.

అక్కడ గుమికూడిన వారందరూ చప్పట్లు చరిచారు. దీవిపెద్ద అభిమానంగా జీవాని దగ్గరికి తీసుకుని 'శెభాష్' అంటూ భుజం తట్టాడు. దీవిపెద్ద అక్కడున్న వారినందరినీ ఉద్దేశించి ''మన దీవిలోని పిల్లోళ్ళు చేపలు పట్టడానికి ఇచ్చే ప్రాముఖ్యత బడికి వెళ్ళడానికి ఇవ్వడం లేదు. ఆస్తులున్న వాడికన్నా అక్షరాలు నేర్చినోడే మిన్న అని గుర్తించండి'' అని చెప్పాడు.

వెంటనే దీవి వాసులంతా ''మా పిల్లోళ్ళకి వేరే ఇతర పనులేవీ చెప్పకుండా, తప్పకుండా బడికి పంపుతాము'' అని దీవిపెద్దకు హామీ ఇచ్చారు.



**రచయిత పరిచయం : ఆర్.సి. కృష్ణస్వామిరాజు**గారు తిరుపతికి చెందిన కథారచయిత. వీరి పూర్తి పేరు రాచకొండ చెంగల్రాజు కృష్ణస్వామి. రాజుగారు 1962 జనవరి 19న ఈశ్వరాపురం గ్రామం పుత్తూరు తాలూకా చిత్తురు జిల్లాలో జన్మించారు. ఇప్పటి వరకు వీరి కథలు 600 దాకా వివిధ పత్రికలో ప్రచురింపబడ్డాయి. ప్రస్తుత పాఠ్యభాగం వీరి **'నన్నారం కథలు'** నుండి గ్రహించబడినది.

## I సంభాషించండి - చర్చించండి :

అ) 'శబ్దవేగం కన్నా కాంతివేగం చాలా రెట్లు ఎక్కువ'

ఆ) 'బాలబాలికలకు విద్య అవసరం'.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి :

### అ) పదజాలం పెంపొందించుకుందాం :

అంగడి దుకాణం; హఠాత్తుగా=అకస్మాత్తుగా, అస్తమించుట=క్రుంకుట, కునుకుట; ఆకుదొప్పలు=చెట్ల ఆకులతో చేసిన చిన్న పాత్రలు; విపరీతమైన=అనుకూలం కాని, తీవ్రమైన; తారుమారైన, హామీ=మాట ఇచ్చుట; దీవి = చుట్టు నీరు మధ్యలో భూమి.

### ఆ) కింది పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.

(1) విపరీతంగా (2) హఠాత్తుగా (3) పురమాయించుట

### ఇ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.

1) జీవా మదిలో ఎలాంటి ఆలోచన మెదలాడింది?

2) జీవా నాన్న ఏ విధంగా తన భార్యను, కుమారుని రక్షించాడు?

3) జీవా సముద్రములో దీపాలు వదలక పోయినట్లైతే?

## పంక్తులపై చర్చ

### అ) పాఠం నుండి కొన్ని పంక్తులు ఎన్నుకొని ఇవ్వబడినవి. వాటిని చదివి, ఆలోచించండి. మీ ఆలోచనలను మీ జట్టువారితో పంచుకోండి మరియు మీ లేఖన పుస్తకంలో రాయండి.

1) 'మన దీవిలోని పిల్లోళ్ళు చేపలు పట్టడానికి ఇచ్చే ప్రాముఖ్యత బడికి వెళ్ళడానికి ఇవ్వడం లేదు'.

2) అసలు నీకు దీపాలు వెలిగించాలనే ఆలోచన ఎలా వచ్చింది?

3) 'మా పిల్లోళ్ళకి వేరే ఇతరపనులేవీ చెప్పకుండా తప్పకుండా బడికి పంపుతాము.

4) 'మా అమ్మచేత దీపాలు వెలిగించి సముద్రంలో వదిలాము.'

### ఆ) గద్యరచన-వర్ణన-చర్చ

జీవాకు వాళ్ళసైన్స్ మేడమ్ చెప్పిన మాటలు గుర్తుకువచ్చి 'శబ్దవేగం కన్నా కాంతివేగం చాలారెట్లు ఎక్కువగా ఉంటుందని దీపాలు వెలిగించి సముద్రంలో వదిలారు.' ఇటువంటి ఆలోచనలు రచయితలకు రావడం కథకు పుష్టిని చేకూర్చింది అనటంలో మీ అభిప్రాయాన్ని వ్యక్తపరచండి.

## భాషావగాహన

**అ) కింది వాక్యాలలో గుర్తింపబడిన పదాలకు వ్యతిరేకపదాలు రాయండి.**

1) ఇప్పటికే సూర్యుడు <u>అస్తమిస్తున్నాడు</u>.

2) <u>చీకటిలో</u> వారికి జీవా పడవ కనిపించలేదు.

3) జనం జీవాను, అతడి అమ్మను చూసి ఎంతో <u>ఆనందించారు</u>.

**ఆ) గీతగీసిన పదములు ఏభాషాభాగములకు చెందినవో గుర్తించి రాయండి.**

1) <u>అక్కడ</u> గుమికూడిన వారందరూ చప్పట్లు చరిచారు.

i) విశేషణము ii) నామవాచకము iii) అవ్యయము.

2) <u>అవి</u> తాము ఉండే దీవిలో దొరికేవి కావు.

i) సర్వనామము ii) నామవాచకము iii) క్రియ

3) నాన్న రేపు చేపల వేటకు <u>వెళ్తున్నాడు</u>.

i) విశేషణము ii) అవ్యయము iii) క్రియ

**ఇ) కింది వాక్యములో గుర్తించబడిన పదాలు ఏ వాక్యాంగములకు చెందినవో రాయండి.**

1) <u>జీవా</u> <u>దీపాలను</u> <u>వెలిగించాడు.</u>

2) <u>జీవా</u> <u>పడవను</u> <u>నడుపుతున్నాడు</u>

**ఈ) గీతగీసిన పదాలు సమాపక/అసమాపక క్రియలలో ఏ రకమునకు చెందినవో గుర్తించి రాయండి.**

1) నేను రేపు వెళ్ళి <u>తీసుకువస్తాను</u>.

2) దీవిపెద్ద అభిమానంగా జీవాని దగ్గరకు <u>తీసుకుని</u> భుజం తట్టాడు.

**ఉ) కింది పదములను విడదీసి, సంధిపేర్లను రాయండి.**

(1) నడుపుతున్నాడు (2) వారినందరిని (3) వారందరు (4) వెలిగించాలనే

**ఊ) కింది పదాలకు ఉపాధ్యాయుని సహాయంతో విగ్రహ వాక్యం, సమాసనామము రాయండి.**

| పదం | విగ్రహవాక్యము | సమాసనామము |
|---|---|---|
| 1) పదిహేనేళ్ళు | | |
| 2) చిన్న పడవ | | |
| 3) అరేబియా సముద్రము | | |
| 4) శబ్దవేగం | | |

## స్వీయస్పందన

- ప్రయాణాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు.

## సృజనాత్మకత

- ''ఆస్తులున్న వాడికన్నా అక్షరాలు నేర్చినోడే మిన్న'' – ఎందుకో చెప్పండి.
- అక్షరజ్ఞానం కలిగినచో కలుగు లాభములు, అక్షరజ్ఞానం లేనిచో కలుగు ఇబ్బందులను గూర్చి ఆకృతులను పూరించండి.

గౌరవము

అక్షర జ్ఞానం కలిగినచో కలుగు లాభములు

అక్షర జ్ఞానం లేనిచో కలుగు ఇబ్బందులు

పత్రాలు చదవలేక మోసపోవుట.

### అనులేఖనం

**కింది పరిచ్ఛేదాన్ని చూచి తప్పులు లేకుండా అందంగా విరామ చిహ్నాలననుసరిస్తూ రాయండి.**

అలలపైన తేలియాడుతున్న దీపాలను చూచి వారి జాడను కనుక్కోగలిగాడు జీవా నాన్న. వెంటనే తన స్నేహితులను పురమాయించి వేగంగా జీవా వున్న పడవ వద్దకు చేరాడు. అందరూ చేరి ఇద్దరినీ భద్రంగా ఇంటికి చేర్చారు.

ఎంతో ఆసక్తిగా ఉన్న దీవి జనం జీవాను, అతడి అమ్మని చూసి ఎంతో ఆనందించారు.

అభినందనలు అందజేయడానికి వచ్చిన దీవిపెద్ద, జీవాని ''గట్టిగా మీరు వేసిన కేకలు మాకు వినిపించ లేదని, దీపాలు వెలిగించి మీరు ఉండే ప్రదేశం మాకు తెలియ పరిచావు. అసలు నీకు దీపాలు వెలిగించాలనే ఆలోచన ఎలా వచ్చింది?'' అని అడిగాడు.

# ఉపన్యాసం



(ఉపాధ్యాయురాలు డిజిటల్ తరగతిలో ఒక నాయకుడు, జాతీయాలు, సామెతలతో స్ఫూర్తిదాయకంగా ప్రసంగించిన ఉపన్యాసాన్ని చూపించారు.)

**ఉపాధ్యాయురాలు** : మీరంతా ఉపన్యాసం విన్నారు కదా! మీకు **'నేనే ప్రధాన మంత్రినైతే'** అను శీర్షిక ఇస్తున్నాను. చక్కని ఉపన్యాసమివ్వాలి. ముందుగా ఎవరు ఉపన్యసిస్తారు?

**సల్మా** :మేడమ్‌గారు! నేను చెప్తాను.

**ఉపాధ్యాయురాలు** : అలాగే! చెప్పమ్మా!

**సల్మా** : నేనే ప్రధాన మంత్రినైతే నా దేశాన్ని సుభిక్షంచేస్తా. శత్రువుల పాలిట సింహస్వప్నమై దేశాన్ని కాపాడుతా. నేటి బాలబాలికలందరిని రేపటి భావిపౌరులుగా తీర్చిదిద్దుతా! విద్యను మించిన ధనము లేదు కదా! కావున అందరికి చక్కటి విద్య నేర్పిస్తా. ప్రజలకు శ్రేష్ఠమైన వైద్యం అందిస్తా. ఎందుకంటే ఆరోగ్యమే మహాభాగ్యం.

సాంకేతిక పరిజ్ఞానంలో ఇంకనూ ముందుకు సాగాలి. 'తిండి కలిగితే కండ కలదోయ్, కండ కలవాడే మనిషోయ్' అని మహాకవి గురజాడ అప్పారావు గారు అన్నట్లు దేశప్రజలకు మంచి నాణ్యత గల ఆహారధాన్యాలు అందించాలంటే వ్యవసాయరంగంలో కూడా ముందజలోవుండాలి. దేశానికి అన్నం పెట్టేది వ్యవసాయమే. కావు వ్యవసాయరంగానికి కూడా ప్రాధాన్యత ఇస్తానని చెప్పుచున్నాను.

# 12 ఆదర్శ గ్రామము

నేపథ్యం : గ్రామాలే దేశానికి వెన్నెముకలు. దేశంలోని గ్రామాలన్నీ పచ్చని పైరులతో, పాడి పంటలతో కళకళలాడాలి. ఆదర్శ గ్రామాలుగా వర్ధిల్లాలి. అప్పుడే బాపూజీ కలలుగన్న ప్రగతి సాధ్యమవుతుంది. తమ వంతు కృషితో తమ గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దిన కవలల గురించి తెలుసుకునేందుకు పాఠంలోకి ప్రవేశిద్దాం.

ఓ కుగ్రామంలో రామయ్య, జానకమ్మ అను దంపతులు నివసిస్తుండేవారు. వారసత్వంగా వచ్చిన రెండెకరాల పొలమే వారి జీవనోపాధి. రాత్రింబవళ్ళు కష్టపడ్డా వచ్చిన ఆదాయం వారి పొట్టకు బట్టకు మాత్రమే సరిపోయేది. జన్మించిన తమ కవలలైన సీత, గీతలకు కాస్తో కూస్తో పొదుపు చేయాలని అదనంగా మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని రాత్రనక పగలనక పనిచేసేవారు.

చదువు కోసం ఆ పిల్లలను తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినారు. ఆ కవలలు అత్యంత శ్రద్ధతో చదివి అందరికన్నా మిన్నగా ఎదిగి ఆ పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తెచ్చారు. ఒక రోజు ఉపాధ్యాయ బృందం రామయ్యతో "చూడండి రామయ్యగారు! మీ పిల్లలు చాల తెలివైనవారు. మంచి భవిష్యత్తు వారి కందించాలంటే పై చదువులు చెప్పించాలి. అందుకై వారిని పట్నం పంపించి ఉన్నత చదువులు చెప్పించండి" అనగా "మాస్టార్లూ! నాకు కూడా పైచదువులు చెప్పించాలనే ఉంది. కాని మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

ఇప్పటికే ఒక ఎకరం అయిపోయింది. ఇక పట్నం తోలించి పై చదువులు చెప్పించాలంటే ఉన్న ఒక ఎకరం అమ్మాల్సిందే" అనగా మాస్టారు చూడు రామయ్యా! పిల్లలు చాల తెలివైనవారు పై చదువులు





చదివి వారు నెగ్గుకొస్తారని మా నమ్మకం. వాళ్ళకి ప్రభుత్వ స్కాలర్ షిప్‌లు అందుతాయి. పై ఖర్చులు చూసుకుంటే చాలు. కాబట్టి పట్నం పంపించండి. వారు నిలదొక్కుకొని మీ బ్రతుకు బండిని సరైన దారిలో పడేలా చేస్తారని మా ప్రగాఢ విశ్వాసం" అని చెప్పారు. "సరే మాస్టారూ" అని రామయ్య దంపతులు ఒప్పుకున్నారు.

పిల్లలను పై చదువులకై పట్నం పంపించారు. కవలలు కష్టపడి చదివి సీత డాక్టర్ పట్టాను, గీత లాయర్ పట్టాను సాధించారు. డాక్టరైన చిన్న అమ్మాయి తన పుట్టిన గ్రామంలోనే నర్సింగ్ హోం ప్రారంభించింది. పెద్దమ్మాయి చదివిన పట్నంలోనే లాయర్ ప్రాక్టీస్ పెట్టి పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. ప్రభుత్వం ప్రకటించిన గ్రామజ్యోతి కార్యక్రమ వివరాలు తెలుసుకొని కవలలిద్దరూ తమ స్వగ్రామాన్ని దత్తత



తీసుకున్నారు. గ్రామ ప్రజలు సంతోషించి, వారికి చేయూత ఇచ్చేటందుకు ముందుకొచ్చారు.

పై చదువుల్లో తమ స్నేహితురాండ్లైన ఇంజనీర్లు రమ, ఉమలను సంప్రదించి, గ్రామంలో పాఠశాల భవనం, ఆస్పత్రి భవనం, ఓ దేవాలయంను నిర్మించారు. చక్కని రోడ్లను వేయించారు. గ్రామ చెరువులో పూడిక తీయగా నీరు పుష్కలంగా ఊరింది. ఇంటింటికి నల్లా కనెక్షను పెట్టించి, నీటి ఎద్దడిని నివారించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో సంప్రదించి వీధిలైట్లను ఆధునీకరించారు. పచ్చని చెట్లను నాటించి హరితహారం కార్యక్రమాన్ని పూర్తిచేశారు.

అలా ఆధునీకరించిన ఆ చక్కని గ్రామాన్ని ప్రభుత్వం గుర్తించి, ఆదర్శగ్రామంగా ప్రకటించింది. ఆ గ్రామ ప్రజలందరు గూడ ఆ కవలల సేవలను గుర్తించి వారిని సన్మానించారు. ఆ సన్మానాన్ని తల్లిదండ్రులు తనివితీర వీక్షించి ఆనందించారు. ఆ అమ్మాయిలిద్దరూ తమ తల్లిదండ్రులతోనూ, ఆ ఆదర్శగ్రామ ప్రజలతోనూ కలిసి ఆ కార్యక్రమ ఆనందాన్ని పంచుకొని తరించారు.

**రచయిత పరిచయం : గుఱ్ఱాల లక్ష్మారెడ్డి**గారు చిన్నమ్మ, వెంకట్రాంరెడ్డి అను పుణ్యదంపతులకు కల్వకుర్తి గ్రామం, నాగర్‌కర్నూల్ జిల్లా తెలంగాణలో జన్మించారు. విశ్రాంత ఉపాధ్యాయులు. వీరి ఇతర రచనలు వెన్నెల జల్లులు; వెన్నెల కలువలు; వెన్నెల కెరటాలు మొదలగువి. వీరు ఉత్తమ ఉపాధ్యాయ, GHH ఉత్తమ అధ్యాపక అవార్డు, తెలంగాణ కవితాంజలి అను అవార్డులను పొందారు. వీరిది ఉపాధ్యాయ వృత్తి. ప్రవృత్తి కవితలు, కథలు, గేయాలు, పాటలు రాయడం. ప్రస్తుత పాఠ్యభాగం **బాల చెలిమి** (మహబూబ్ నగర్ జిల్లా) నుండి గ్రహింపబడినది.

## I. సంభాషించండి - చర్చించండి.

1. గ్రామాల ప్రాముఖ్యత.
2. నీవే గ్రామపెద్దవైతే ఏం చేస్తావ్?

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

కుగ్రామం=చిన్నపల్లె, పల్లెటూరు; పట్నం తోలించి = పట్నం పంపించి; మిన్నగా = గొప్పగా; జీవనోపాధి = జీవించుటకు ఆధారము; నెగ్గుకొస్తారని = అభివృద్ధిలోకి వస్తారని.

### ఆ) సరైన అర్థాలను కుండలీకరణం నుండి ఎన్నుకొని ఖాళీలు పూరించండి.

(సహకారం, ఆకాశం, నీరు, గొప్పగా, దృఢమైన)

1. మిన్నగా = ________________
2. ప్రగాఢమైన = ________________
3. చేయూత = ________________

### ఇ) ఆకృతులు పూరించండి.

- ఈ పాఠములోని ప్రధాన పాత్రలు. 1. రామయ్య, జానకమ్మ దంపతులు 2. సీత మరియు గీత వారి గుణాలను గురించి కింది ఆకృతులు పూరించుము.

1. రామయ్య, జానకమ్మ దంపతులు → [ ] [ ]

2 సీత మరియు గీత → [ ] [ ]

## భాషావగాహన

### అ) కింది పదాలకు పర్యాయపదాలు రాయండి.

1) పేరు ...................... ......................
2) చదువు ...................... ......................
3) జ్యోతి ...................... ......................
4) దేవాలయం ...................... ......................

**ఆ) కింది వాక్యంలో గుర్తించిన పదాలకు భాషాభాగాలు మరియు వాచకాలు రాయండి.**

ఉదా॥ రము, ఉమల సహాయంతో చక్కని రహదారులను వేయించారు.

రము – నామవాచకం – మహతీవాచకం చక్కని – విశేషణం వేయించారు – క్రియ

1) రామయ్య, జానకమ్మ వారి పిల్లలను ఉన్నత చదువులు చదివించారు.

2) కవలలు మిన్నగా ఎదిగి ఉపాధ్యాయులకు మంచి పేరు తెచ్చారు.

**ఇ) కింది గుర్తించబడిన పదాలు ఏ నామవాచక రకానికి చెందినవో రాయండి.**

1) బ్రతుకు బండిని సరైన దారిలో పడేలా చేస్తారని మా ప్రగాఢ విశ్వాసం.

2) నేను మా తమ్ముడికి రాఖీ కడతాను.

3) రాజయ్య గుడిసెలోనికి వచ్చాడు.

**ఈ)** ఈ పాఠంలోని రెండవ పేరా ('చదువుకోసం..... నుండి అంతంతమాత్రమే' వరకు) చదివి విభక్తి ప్రత్యయాలను గుర్తించి, ఏ విభక్తులో రాయండి.

**ఉ) కింది పదాలను విడదీసి సంధిపేర్లను రాయండి.**

(1) అందించాలంటే (2) ఎప్పటికప్పుడు (3) ప్రజలందరు.

**ఊ) కింది పదాలకు విగ్రహ వాక్యాలు రాసి, సమాసముల పేర్లు రాయండి.**

(1) రెండెకరాలు (2) తల్లిదండ్రులు (3) ఉన్నతచదువులు (4) పాఠశాలభవనం

## స్వీయస్పందన

1) ఆదర్శ గ్రామమునకు ఉండవలసిన సౌకర్యముల గురించి మీ మిత్రులతో చర్చించి రాయండి.

2) గ్రామాన్ని దత్తత తీసుకోవడం అంటే ఏమిటి? మీకు తెలిసిన ఒక ఆదర్శగ్రామం గురించి రాయండి.

3) గ్రామాలను వదిలి ప్రజలు నగరాలకు వెళ్ళటానికి కారణాలు.

## ప్రసార మాధ్యమాలు

- ఇంటర్నెట్‌ను ఉపయోగించి మహారాష్ట్రలోని "హివరే బజార్" గ్రామము, దాని సర్పంచ్ పోపట్‌రావు పవార్ గురించి వివరాలు సేకరించి రాయండి.

## సృజనాత్మకత

- గ్రామాభివృద్ధికి మీరు ఎటువంటి చర్యలు చేపడతారు?

**విద్యార్థి సూచన :** మీ పాఠశాలలో గ్రంథాలయమును సందర్శించి, కథలు, కవితలు మొదలైనవి చదివి, వాటి గురించి సమీక్షించండి.

# 13 బెదురు

నేపథ్యం : మనలో దాగిన ప్రతిభను మనం తక్కువ అంచనా వేసుకోకూడదు. కష్టపడి ధైర్యంగా ముందుకు సాగితే విజయం మనదే. ఈ విధంగా గిరి కూడా తనలో దాగివున్న ప్రతిభను ఎలా ప్రదర్శించాడో ఈ పాఠంలో తెలుసుకొందామా....

గిరి మారుమూల పల్లె నుంచి నగరానికి వచ్చిన పిల్లోడు. వాళ్ల బాబాయి గారి ఇంట్లో ఉంటూ అతడు సిటీ హైస్కూల్లో ఆరవ తరగతి చదువుతున్నాడు.

అతడు తెలివైనవాడు కానీ బెదురెక్కువ. తరగతిలో వెనక బెంచీలో కూర్చునేవాడు. మాస్టారు పాఠం పూర్తయ్యాక పిల్లలకు ప్రశ్నలు వేస్తే వాటికి జవాబులు తెలిసినా నోరు మెదిపేవాడు కాదు.

మనసులో ఎక్కడో ఆ జవాబులు తప్పని గిరికి అనుమానం. నగరం పిల్లలు చురుకుదనం, వాళ్ళ మాట తీరు, నడక తీరు చూసి వాళ్ళందరూ గొప్ప తెలివైన వాళ్ళని అతను అభిప్రాయపడేవాడు.

అందుకే అతను వాళ్ళతో కలిసి తిరిగేవాడు కాదు. చివరకు గిరి అందరి దృష్టిలో ఒక పల్లెటూరు పిల్లోడు అయ్యాడు. రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు తరగతి ఉపాధ్యాయుడు పాఠం చెబుతుండగా ఒక సర్క్యులర్ వచ్చింది. ఆయన అందుకొని చదివి ఇలా వినిపించాడు.

ఆరవ తరగతి, ఏడవ తరగతి చదువుతున్న బాలబాలికలకు నగర బాలానందం సంఘం వారు పాటలపోటీ ఏర్పాటు చేస్తున్నారు. పోటీలో పాల్గొనదలచిన విద్యార్థులు రేపు సాయంత్రంలోగా ప్రధానోపాధ్యాయులకు పేరు ఇవ్వవలసినదిగా కోరడమైనది.

విద్యార్థులు సర్క్యులర్ విన్నారు. పోటీ గురించి కాసేపు గుసగుసలాడుకున్నారు. "సైలెన్స్, సైలెన్స్'' అని హెచ్చరిక చేసి టీచర్ మళ్ళీ పాఠం చెప్పడం ఆరంభించారు. పాఠం వినడంలో గిరి లీనమైపోయాడు.

సాయంత్రం పాఠశాల వదిలారు. గిరి ఇంటికి చేరుకున్నాడు. అప్పుడే బాబాయి కూడా వచ్చాడు. ''గిరీ! ఈరోజు మీకు పాటల పోటీ గురించి సర్క్యులర్ వచ్చిందట కదా! మీ తెలుగు మాస్టర్ నాకు కనిపించి చెప్పారు. ఆయన నా మిత్రుడు కదా. నీవు ఆ సర్క్యులర్ విన్నావా ?"అని అడిగాడు.

"ఆ.. విన్నాను.'' హాలులో ఉన్న షెల్ఫ్‌లో పుస్తకాలు సర్దుతూ గిరి అన్నాడు.

వాళ్ళ బాబాయ్ సంభాషణ పొడిగించాడు.

''నీకు పాటలు బాగా వచ్చు కదా. పోటీకి వెళ్ళు! అన్నాడు. ''అబ్బే, పోటీకి నేను వెళ్లడమా? పల్లె పదాలు తప్పించి నాకేం తెలుసు?" గిరి సమాధానం ఇచ్చాడు.

"పల్లె పదాలు కూడా మంచివే. బాగా పాడొచ్చు. నువ్వు పోటీకి వెళ్ళావంటే బహుమతి తప్పదు'' అన్నాడు బాబాయ్. గిరి వాళ్ల పిన్ని



అప్పుడే హాలులోకి వచ్చింది. గిరి చెంగున ఆమె దగ్గరకు చేరి, "చూడు పిన్ని! బాబాయ్ ఎలా నాతో వేళాకోళమాడుతున్నాడు? పల్లెటూరి పిల్లోడిని ఇంత పెద్ద పట్టణంలో పోటీకి నిలబడగలనా?" అని అన్నాడు.

పిన్ని గిరిని అక్కున చేర్చుకుంది. ''బాబాయి వేళాకోళమాడటం లేదు గిరీ! నగరంలోని పిల్లల



వేష భాషలు చూసి భయపడకు. వాళ్ళలో కూడా మెచ్చుకోదగిన వారు ఉంటారు. నేను కాదనను. ఎవరి ప్రతిభ వారిది. నువ్వు పోటీకి వెళ్తే బహుమతి నీకు తప్పక వస్తుందని నా నమ్మకం. అనవసరంగా భయపడి చక్కని అవకాశం చేజార్చుకుంటావేమో అని నా బాధ'' అని గిరిని ఆమె ప్రోత్సహించింది. మర్నాడు పాఠశాలకు వెళ్తూనే అతను హెడ్మాస్టరు రూములోకి ఉత్సాహంగా ప్రవేశించాడు పాటల పోటీకి పేరిచ్చి క్లాసు రూమ్ లోకి వచ్చాడు. తోటి విద్యార్థుల గుసగుసలు అతడు వినిపించుకోలేదు.

పాటలపోటీ నిర్వహించే రోజు వచ్చింది. పోటీలో అతడు పాల్గొన్నాడు. పాటలు వినడానికి వచ్చిన వాళ్ళందరూ గిరి పాట విని అబ్బురపడ్డారు.

మొదటి బహుమతి గిరికే దక్కింది. కరతాళ ధ్వనులు మిన్నుముట్టగా, అతను కలెక్టర్ చేతి నుండి బహుమతిని అందుకున్నాడు. ఆరోజు నుండి అతని మనసులో మార్పు వచ్చింది.

**రచయిత పరిచయం :** ప్రస్తుత పాఠ్యభాగ రచయిత **బెలగాం భీమేశ్వరరావు**గారు. బెలగాం రాజేశ్వరి, బెలగాం గంగారామ్ గార్లకు పార్వతీపురం, మన్యం జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో జన్మించారు. వీరు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరు అనేక పుస్తకాలు రచించారు. వాటిలో పేర్కొనదగినవి చెట్లొస్తున్నాయ్ జాగ్రత్త (బాలల నవల), పాపం బంగారయ్య, చెట్లను పెంచుదాం, కొంగల తెలివి మొదలైనవి. 'అక్షరాస్యత కార్య క్రమాల్లో పాల్గొనడం, బాల సాహిత్య శిక్షణ కార్యక్రమాలు వీరి వ్యాపకాలు.

## I. సంభాషించండి – చర్చించండి

1) మీకు ఇష్టమైన గాయకుడు/గాయకురాలు.

2) మీ పాఠశాలలో జరిగే మేథో వికాసన కార్యక్రమాలు.

## II. ఆలోచించండి – చెప్పండి – రాయండి :

### అ) పదజాలం పెంపొందించుకుందాం :

బెదురు = భయం; ఆరంభించుట = మొదలుపెట్టుట; సమాధానం = జవాబు; ప్రతిభ=తెలివి; చేజార్చుకొనుట = పోగొట్టుకొనుట; కరతాళధ్వనులు = చప్పట్లు.

### ఆ) కింది ఖాళీలను సరైన పదాలతో పూరించి రాయండి.

1) గిరి సిటీ హైస్కూల్లో ...................... తరగతి చదువుతున్నాడు. (ఐదవ/ఆరవ)

2) బాలానందం సంఘం వారు ................. ఏర్పాటు చేస్తున్నారు. (పాటల పోటీ/క్రీడలపోటీ)

3) గిరి వాళ్ల పిన్ని అప్పుడే ................. లోకి వచ్చింది. (మైదానం/హాలు)

4) గిరి ................. చేతి నుండి బహుమతిని అందుకున్నాడు. (కలెక్టర్/తహశీల్దార్)

### ఇ) పంక్తులపై చర్చ :

పాఠం నుండి కొన్ని పంక్తులు ఇవ్వబడినవి. వాటి అర్థమేమిటి? వాటిని మీ సహవిద్యార్థులతో చర్చించి, అర్థాన్ని మీ లేఖన పుస్తకాలలో రాయండి.

1) నగరంలో వాళ్ళందరూ గొప్ప తెలివైనవాళ్ళని గిరి అభిప్రాయపడేవాడు.

2) "పల్లెటూరి పిల్లోడిని. ఇంత పెద్దపట్టణంలో నిలబడగలనా?"

### ఈ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.



(1) గిరికి, వాళ్ళ బాబాయికి మధ్య జరిగిన సంభాషణ.

(2) గిరికి మొదటి బహుమతి వచ్చిన విధము.

## భాషావగాహన

**(అ) కింది ఖాళీలను సరియైన భాషాభాగాలతో పూరించండి.**

1) ...................... పాటలు బాగా వచ్చుకదా?

2) గిరి వాళ్ళపిన్ని అప్పుడే హాలులోకి ....................

3) ఇంత ...................... పట్టణంలో పోటీకి నిలబడగలనా?

**(ఆ) కింది వాక్యములోని పదాలు ఏ వాక్యాంగములకు చెందినవో రాయండి.**

బాబాయ్ సంభాషణను పొడిగించాడు.

**(ఇ) కింది పదాలకు వ్యతిరేకార్థకములను రాయండి.**

| | |
|---|---|
| (1) అనవసరము x ______________ | (2) మిత్రుడు x ______________ |
| (3) మంచి x ______________ | (4) భయము x ______________ |

**(ఈ) కింది జాతీయాలకు అర్థాలు తెలిపి, సొంతవాక్యాలలో ఉపయోగించి రాయండి.**

1) అందని ద్రాక్షలు పుల్లన : ______________

2) కోటివిద్యలు కూటికొరకే : ______________

**(ఉ) కింది పదములు ఏ వాచకములకు చెందినవో రాయండి.**

| | | |
|---|---|---|
| (1) గిరి = ______________ | (2) అతడు = ______________ | (3) బాలిక = ______________ |
| (4) ఆమె = ______________ | (5) నగరము = ______________ | (6) ఇల్లు = ______________ |

**(ఊ) కింది వాక్యములు సామాన్య / సంశ్లిష్ట / సంయుక్త వాక్యములలో ఏ రకమునకు చెందినవో గుర్తించి రాయండి.**

1) అతడు తెలివైనవాడు కానీ భయస్తుడు. ______________

2) సాయంత్రం పాఠశాల వదిలారు. ______________

3) హాలులో ఉన్న షెల్ఫ్‌లో పుస్తకాలు సర్దుతూ గిరి అన్నాడు. ______________

**(ఋ) కింది పదాలను కలిపి సంధి పేర్లను రాయండి.**

1) వచ్చింది + అట = ______________

2) చేస్తు + ఉన్నారు = ______________

3) పూర్తి + అయ్యాక = ______________

**(ౠ) కింది విగ్రహవాక్యములు ఏ సమాసములకు చెందినవో రాయండి.**

1) బాలురును, బాలికలును ______________

(అ) ద్వంద్వ సమాసము (ఆ) ద్విగు సమాసము (ఇ) బహువ్రీహి సమాసము.

2) కరతాళముల యొక్క ధ్వనులు ______________

(అ) అవ్యయీభావ సమాసము (ఆ) షష్ఠీ తత్పురుష సమాసము (ఇ) ద్విగు సమాసము.

## స్వీయస్పందన

పాటల పోటీ నిర్వహించే రోజు వచ్చింది. పోటీలో గిరి పాల్గొన్నాడు. పాటలు వినడానికి వచ్చిన వాళ్ళందరూ గిరి పాట విని అబ్బురపడ్డారు. మొదటి బహుమతి గిరికే దక్కింది. కరతాళధ్వనులు మిన్నుముట్టగా, అతను కలెక్టర్ చేతినుండి బహుమతిని అందుకున్నాడు. ఆరోజు నుండి అతని మనసులో మార్పు వచ్చింది.

(1) కరతాళ ధ్వనులు మిన్నంటు – సందర్భాలను రెండింటిని గురించి తెల్పండి, కారణాలను తోటి విద్యార్థులతో పంచుకోండి.

(2) పోటీ పరీక్షలలో పాల్గొనటం ఎంత వరకు అవసరం.

## ముఖాముఖి

ఒక వ్యక్తిని ప్రత్యక్షంగా ప్రశ్నలు అడిగి వారి అభిప్రాయాలు లేదా సమాచారం తెలుసు కొనుట.

(పాఠశాల 10వ తరగతిలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన 'రాహుల్' అనే విద్యార్థితో ముఖాముఖి)

**ముఖాముఖి చేసే విద్యార్థి :** రాహుల్ గారూ! మీరు రాష్ట్రంలోనే పదవతరగతి పరీక్షలలో ప్రథమ స్థానం సాధించిన విజయం మన పాఠశాలకు గర్వకారణం. మీకు శుభాకాంక్షలు.

**రాహుల్ (విద్యార్థి) :** ధన్యవాదములు !

**ముఖాముఖి విద్యార్థి :** మీకు ఏయే విషయాలు (సబ్జెక్టులు) అంటే ఇష్టం.

**రాహుల్ :** తెలుగు, గణితం.

**ముఖాముఖి విద్యార్థి :** మీ దినచర్య గురించి చెబుతారా!

**రాహుల్ :** ఉదయం 5 గంటలకు లేస్తాను. నాన్న గారితో కలిసి నడకకు వెళతాను. కాలకృత్యాలు తీర్చుకుంటాను. అమ్మకు పనిలో సహాయపడతాను. గ్లాసెడు పాలు త్రాగి, టిఫిన్ డబ్బా, బ్యాగు సర్దుకొని పాఠశాలకు వస్తాను. సాయంత్రం స్నేహితులతో ఆడుకుంటాను. హోంవర్క్ పూర్తి చేసుకుంటాను. కొంతసమయం టీ.వీ. చూస్తాను. మిగతా సమయమంతా ప్రొద్దున, సాయంత్రం చదువుకే వినియోగిస్తాను. కుటుంబ సభ్యులతో భోజనం చేస్తాను. తర్వాత నిద్రకుపక్రమిస్తాను.

**ముఖాముఖి విద్యార్థి :** మీకు ఏయే ఆటలు అంటే ఇష్టం.

**రాహుల్ :** రన్నింగ్, ఫుట్ బాల్ (Football).



**ముఖాముఖి విద్యార్థి :** మీ అభిరుచులు ఏమిటి?

**రాహుల్ :** పాటలు వినడం, కొత్త విషయాలు తెలుసు కోవడం.

**ముఖాముఖి విద్యార్థి :** మీరు మాకు ఇచ్చే సలహాలు

**రాహుల్ :** క్రమశిక్షణతో ఉండండి. శ్రద్ధగా కష్టపడి చదవండి. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సూచనలను పాటించండి. నిరంతరం వారి సూచనలను అనుసరించడమే నా విజయ రహస్యం.

**ముఖాముఖి విద్యార్థి :** మీరు మాకు అమూల్యమైన సలహాలు ఇచ్చినందుకు ధన్యవాదాలు.

**రాహుల్ :** ధన్యవాదాలు.

**ఉపాధ్యాయ సూచన :** సాహిత్య రకాలను విద్యార్థులకు వివరించాలి, (కథ, కథానిక, నాటకం, నాటిక మొ॥ వాటిని వివరించాలి) విద్యార్థులచే పరిచిత వ్యక్తుల ఇంటర్వ్యూలను ప్రణాళిక బద్ధంగా నిర్వహించేలా చూడండి.

# 14 శతక పద్యాలు

**నేపథ్యం:** 'శతకము' అనగా నూరు లేదా అంతకంటె ఎక్కువగా పద్యములు గలది శతకము. శతకములో ప్రతి పద్యము చివర మకుటము ఉంటుంది. తెలుగులో వేమన శతకము, కుమారీ శతకము, సుమతీ శతకము, భాస్కర శతకము మొదలైనవి ఎన్నో ప్రసిద్ధ శతకాలు ఉన్నాయి. నేటి ఆధునిక కవులు కూడా శతకాలను రచించుచున్నారు.

తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా ముంబయిలోని వివిధ తెలుగు పాఠశాలల మధ్య ''పద్యతోరణం''-అనే పద్యాల పోటీలు ఎలా నిర్వహిస్తారో తెలుసుకుందామా!

తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా ముంబయిలోని వివిధ తెలుగు పాఠశాలల మధ్య ''పద్యతోరణం''-అనే పద్యాల పోటీలు నిర్వహిస్తున్నారు. విద్యార్థినీ విద్యార్థులు పద్యాలు చక్కగా చదువుకొని పోటీకి తయారయ్యారు. పోటీ రోజున పోటీ నిర్వాహకులైన ఉపాధ్యాయురాలు పోటీ గురించి వివరించారు.

**ఉపాధ్యాయురాలు:** ఇప్పుడు పద్యతోరణం మొదలు పెడదాం. ఒక్కొక్కరుగా వచ్చి మీకు నచ్చిన పద్యం చెప్పి, దాని భావాన్ని చెప్పాలి. మొదట గుణవంత్ వచ్చి పద్యం వినిపిస్తాడు.

**గుణవంత్:**

ఉరుగుణవంతు డొడ్లు దన కొండ పకారము సేయునప్పుడున్
బరహితమే యొనర్చునొక పట్టుననైనను గీడు జేయఁగా
నెఱుఁగఁడు నిక్కమేకద యదెట్లన గవ్వముఁబట్టి యెంతయున్
దరువఁగఁ జొచ్చినం బెరుఁగు తాలిమి నీయదె వెన్న భాస్కరా!

**భావము :** గొప్ప గుణవంతుడు తనకు ఇతరులు అపకారము (కీడు) చేసినప్పటికి, వారికి తాను ఉపకారమే చేయును. అదెట్లన పెరుగును కవ్వముతో ఎంత చిలికిననూ వెన్ననే ఇచ్చును కదా!

**ఉపాధ్యాయురాలు:** చాలా చక్కని ఉచ్చారణతో చదివావు భావాన్ని చెప్పావు. ఇప్పుడు నవ్య పద్యం పాడి వినిపిస్తుంది.

నవ్య :

"చదువది యెంత కల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతులెవ్వరు మెచ్చరెచ్చటన్
బదనుగ మంచికూర నలపాకము చేసిననైన నందునిం
పొదవెడు నుప్పులేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా !"

**భావము :** ఎంత చదివినను, సారమును తెలిసికొను శక్తిలేనిచో ఆ చదువు నిరుపయోగమగును. దానినెవ్వరు మెచ్చుకొనరు. కూరను ఎంత బాగుగా వండినను దానిలో ఉప్పు లేకున్నచో రుచి యుండునా?

**ఉపాధ్యాయురాలు:** చాలా మంచి ఉచ్చారణ, హావ భావాలతో పాడావు నవ్య. తరువాత వంతు సరితది

సరిత:

"అనఘునికైన c జేకుఱు ననర్హుని గూడి చరించినంతలో
మన మెరియంగ నప్పుడవమానము కీడు ధరిత్రియందునే
యనువున నైన c దప్పదు యదార్థము తానది యెట్టులన్నచో
నినుమును గూర్చి యగ్ని నలయింపదె సమ్మెట పెట్టు భాస్కరా!

**భావము :** ఇనుముతో చేరుట వలన నిప్పునకు కూడా సుత్తిదెబ్బల బాధ కలుగునట్లు, చెడ్డవానితో స్నేహము చేసిన మంచి వారికైన మనస్సు మండునట్లు అవమానమును, కీడును తప్పక కలుగును.

**ఉపాధ్యాయురాలు:** చాలా బాగా పద్యాన్ని చదివి, అర్థాన్ని వివరించావు సరితా.

ఈనాడు నిర్వహించిన పద్యతోరణం అనే పద్యాల పోటీలో వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులందరూ పద్యాలను చాలా చక్కగా పాడి, అర్థం చెప్పారు. ఇప్పుడు ముఖ్య అతిథి పాల్గొనిన వారందరికి బహుమతులను అందజేస్తారు.

**కవి పరిచయం : మారద వెంకయ్య** 16వ శతాబ్దానికి చెందిన కవి. వీరు కళింగ ప్రాంతానికి చెందినవారు. వీరు తెలుగు సాహిత్యానికి అందించిన గొప్ప కానుక 'భాస్కర శతకము'. 'భాస్కరా!' అనే మకుటంతో ఈ శతకాన్ని రచించారు. వీరి పద్యాలు సరళమైన భాషలో, అందమైన పోలికలతో కూడి ఉంటాయి. ప్రస్తుత పద్య భాగం వీరి **భాస్కర శతకము** నుండి గ్రహింపబడినది.

## I. సంభాషించండి - చర్చించండి :

1) శతక లక్షణాలు

2) "అర్థం లేని చదువు వ్యర్థం"

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

1) ఒడ్లు=ఒరులు, ఇతరులు; ఒండు=ఒక; అపకారము = కీడు; చేయునపుడు = చేయు సమయమందు; ఉరు=గొప్పనైన; గుణవంతుడు=గుణములు కలవాడు; పరహితమే=ఇతురులకు మేలునే; ఒనర్చున్=చేయును; కీడు=చెడు; నిక్కమేకదా = నిజమే కదా! పట్టి = చేతగొని; ఎంతయున్ = మిక్కిలి; తరువగ జొచ్చినన్ = చిలుకుచున్నను; తాలిమి = ఓర్పుతో.

2) చదువు + అది = చదువది = ఆ చదువు; యెంతగల్గిన = ఎంత చదువుకున్నా; రసజ్ఞత = సారాన్ని గ్రహించేశక్తి; ఇంచుక= కొంచెం; చాలకున్న = లేకపోతే; నిరర్థకంబు = వ్యర్థం; ప్రయోజనం లేనిది, గుణసంయుతులు = గుణవంతులు, పండితులు; మెచ్చరు = మెచ్చుకోరు, ప్రశంసించరు; పదనుగ = పద్ధతిగా / రుచిగా, నలపాకము = నలమహారాజు వంట (చాలా రుచికరమైన వంట); ఇంపొదవెడు = రుచిని కలిగించే; రుచిపుట్టగ = రుచి కలుగగా.

3) అనఘునికైన = నిష్కల్మషమైన మనసుకలిగిన మంచి వ్యక్తికికూడా; చేకుఱు = ప్రాప్తించును, కలుగును; అనర్హునిగూడి = యోగ్యత లేనివానితో కలిసి; చరించినంతలో = తిరిగినట్లయితే; మనమెరియంగ = మనసునొచ్చుకొనేలా; ధరిత్రియందు = ఈ భూమి మీద; ఏయనువుననైన = ఏరకంగా చూసినా; తప్పవు=జరుగక మానవు; యదార్థము = నిజం; ఇనుమును గూర్చి = ఇనుమును కలుపుకొని; అగ్నినలయింపదె = నిప్పు (సమ్మెటపెట్టు) ఇనుములో కాల్చి కొట్టదా?

### ఆ) కింద కొన్ని పద్యపాదాలు ఇవ్వబడినవి. వాటిని చదివి, అర్థం చేసుకొని, మీ ఆలోచనలు జట్టువారితో చర్చించండి. వాటి అర్థాన్ని లేఖన పుస్తకంలో రాయండి.

1) కవ్వము బట్టి యెంతయున్ దరువగ జొచ్చినం బెరుగు తాలిమి నీయదె వెన్న భాస్కరా!

2) చదువది యెంత కల్గిన రసజ్ఞత యించుక చాలకున్ననా.

### ఇ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.

పద్యములను మరొకసారి చదివి, కింది అంశాల గురించి ఆలోచించి, తెలుసుకొని మీ లేఖన పుస్తకంలో రాయండి.

1) విద్య కీర్తి, సౌఖ్యములను కలిగించుననుటలో మీ అభిప్రాయము.

2) దుష్టులతో స్నేహము చేసినచో కలుగు నష్టములు.

## భాషావగాహన

**అ) కింది పదాలకు వ్యతిరేక పదాలను కుండలీకరణంలోని పదాల నుంచి గ్రహించి రాయండి :**

(అర్హుడు, మేలు, ఉపకారం, గుణహీనులు, దేశము)

| | | | |
|---|---|---|---|
| (i) | అపకారం | × | |
| (ii) | అనర్హుడు | × | |
| (iii) | గుణసంయుతులు | × | |
| (iv) | కీడు | × | |

**ఆ) కింది పదములు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.**

<u>ఉప్పు</u> లేక <u>రుచి</u> పుట్టగ <u>నేర్చునటయ్య</u> భాస్కరా !

**ఇ) కింది పదాలకు వచనములు మార్చి రాయండి.**

(1) కూర (2) కవ్వము (3) చదువులు.

**ఈ) కింది పదాలు ఏరకమునకు చెందిన నామవాచకములో గుర్తించి రాయండి :**

(1) గుణము (2) కవ్వము (3) ఉప్పు (4) చదువు (5) మంచికూర (6) కీడు.

**ఉ) కింద పదాలను విడదీసి సంధి పేర్లను రాయండి.**

(1) చదువది = ______________ (2) మెచ్చరెచ్చుటన్ = ______________

(3) చరించినంతలో = ______________ (4) అదెట్లన = ______________

**ఊ) కింది పదాలకు విగ్రహవాక్యములు రాసి, అవి ఏ సమాసములకు చెందినవో రాయండి.**

| | | విగ్రహవాక్యము | సమాసనామము |
|---|---|---|---|
| (1) అనర్హుడు | = | | |
| (2) నలపాకము | = | | |
| (3) గుణసంయుతులు | = | | |

## స్వీయస్పందన

- శతకపద్యాలు సమాజాన్ని ప్రతిబింబిస్తాయి.
- శతకపద్యాలు మానవ జీవితాలకు మార్గదర్శకాలు.

## ప్రసార మాధ్యమాలు

- ఆధునిక కవుల శతకపద్యాలను వార్తాపత్రికలు, అంతర్జాలం, టీ.వి. ల నుండి సేకరించి రాయండి.
- క్షేత్రయ్య పదాలను, భక్త తుకారం గేయాలను ప్రసారమాధ్యమం ద్వారా సేకరించి రాయండి. లయబద్ధంగా పాడండి.

## సృజనాత్మకత

1. శతక పద్యాలు నీతిని బోధిస్తాయి.... రెండు ఉదాహరణలతో సమర్థించండి.
2. హితము అంటే ఏమిటి? కొన్ని హిత వచనాలు సేకరించి రాయండి.

**ప్రాజెక్టు పని :**

**అంతర్జాలం సహాయంతో వేమన, సుమతీ శతక పద్యాల రాయండి.**





# జానపద సాహిత్య ఆస్వాదన

## అన్నమయ్య సంకీర్తన

క్రింది సంకీర్తనను రాగ యుక్తంగా పాడుదాం.



* కొండలలో నెలకొన్న కోనేటి రాయడువాడు
కొండలంత వరములు గుప్పెడు వాడు

* కుమ్మర దాసుడైన కురువరతినంబి
ఇమ్మన్న వరములెల్ల ఇచ్చిన వాడు
దొమ్ములు చేసినయట్టి తొండమాన్ చక్కురవర్తి --
రమ్మన్న చోటికి వచ్చి నమ్మినవాడు ॥ కొండలలో ॥

* కంచిలోన నుండ తిరుకచ్చినంబి మీద
కరుణించి తనయెడకురప్పించినవాడు.
ఎంచనెక్కుడైన వెంకటేశుడు మనలను -- 2
మంచివాడై కరుణ పాలించిన వాడు ॥ కొండలలో ॥

గేయ సాహిత్యం అనేది జానపదులు కూడా పాడుకోవటానికి వీలుగా ప్రాస మరియు లయతో కూడిన సాహిత్య ప్రక్రియ. ఇందులో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు ప్రధానాంశాలుగా ఉంటాయి. అన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వర స్వామి పై 32 వేలకు పైగా సంకీర్తనలను వ్రాశారు. వీరు తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి వాగ్గేయకారులు. పద కవితా పితామహుడుగా పేరు పొందిన వారు. వీరు కడప జిల్లా, రాజంపేట మండలం లోని తాళ్ళపాక గ్రామంలో 1408 లో జన్మించారు. వీరి కీర్తనలు నేటికీ ప్రజల నాల్కలపై నిలిచి ఉన్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

చందమామ రావే జాబిల్లి రావే
కొండెక్కి రావే కోటి పూలు తేవే

అని పిల్లలకు అన్నం తినిపిస్తూ తెలుగు తల్లులు పాడే ఈ పాట అన్నమయ్య రాసిందే. అలాగే పిల్లలు నిద్రించడానికి తల్లులు పాడే

జో అచ్యుతానంద జోజో ముకుందా
లాలి పరమానంద రామ గోవిందా ......

అన్న పాట అన్నమయ్య రచనే. ఇలాగే రామభద్రునిపై రచించిన మరొక మధురమైన కీర్తనను ఇప్పుడు పాడండి.

- నీకు నచ్చిన సాహిత్యకారుల పుస్తకాలను మీ గ్రంథాలయంలోను లేదా మార్కెట్లో పుస్తకాల దుకాణంలోగాని సేకరించి సంకలనము చేయండి.

1. 'కొండలలో నెలకొన్న' ఈ సంకీర్తనను రాగ, తాళయుక్తంగా పాడి, దీని భావం గురించి ఉపాధ్యాయులతో తరగతిలో చర్చించండి.

**విద్యార్థి సూచన :** నచ్చిన సాహిత్యాకారుల పుస్తకాలను మీ గ్రంథాలయం నుండి సేకరించి సంకీర్తనలను తరగతిలో పాడి వినిపించండి.

తెలుగు వాణి
శుక్రవారం 16-2-2024

# అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన ఆర్చర్ శీతల్‌దేవి

జమ్మూ-కశ్మీర్: సంకల్పంతో ఏదైనా సాధించవచ్చని నిరూపించిన దివ్యాంగురాలు శీతల్‌దేవి ఆర్చర్. పుట్టుకతో రెండు చేతులు లేక పోయినప్పటికీ కాళ్లతో విలువిద్యను ప్రదర్శించిన తొలి యువతిగా శీతల్‌దేవి ప్రపంచ రికార్డు సృష్టించి అంతర్జాతీయ స్థాయిలో అనూహ్య విజయాలు సాధించారు. గ్రామీణ నేపథ్యం నుంచి అంతర్జాతీయ వేదికపైకి ఎదిగి భారతదేశానికి గర్వకారణంగా నిలిచిన దివ్యాంగురాలైన ఈ ఆర్చర్ కథ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం.

## బాల్యం

శీతల్‌దేవి 2007 జనవరి 10న జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని కిష్త్వార్ (Kishtwar) జిల్లాలోని లోయిధర్ (Loidhar) గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించారు. ఫోకోమెలియా(phocomelia) అనే పుట్టుకతో వచ్చేఅరుదైనవ్యాధితో ఈమె జన్మించారు. ఆకారణంగా ఆమె చేతులు పెరగలేదు. తల్లి శక్తిదేవి గొర్రెల కాపరి కాగా తండ్రి మాన్‌సింగ్ రైతు. శీతల్‌దేవి చెల్లెలి పేరు శివానిదేవి. పుట్టుకతో చేతులు లేని శీతల్‌దేవి బాల్యం నుండి కాళ్లను చేతుల్లా ఉపయోగించేవారు.

## విలువిద్యలో శిక్షణ

శీతల్ వైద్యం కోసం బెంగళూరు వెళ్ళినప్పుడు ప్రీతి అనే మహిళ పరిచయమై కాళ్ళతో విలువిద్యను ప్రదర్శించే క్రీడను నేర్చుకోమని సూచించారు. శీతల్‌దేవి ఆలస్యం చేయకుండా జమ్మూ కశ్మీర్‌లోని కట్రా పట్టణ సమీపంలో ఉన్న మాతా వైష్ణోదేవి ష్రైన్ బోర్డ్ ఆర్చరీ అకాడమీ కోచ్ కుల్‌దీప్ వేద్వాన్ వద్ద ఆర్చరీ శిక్షణకు చేరారు. అక్కడ పనిచేస్తున్న మహిళా కోచ్ అభిలాష శీతల్‌దేవికి వెన్నంటి ఉన్నారు. ఇంకా పలువురు గురువులు ఆమెను ఎంతగానో ప్రోత్సహించారు. అనేకమంది దివ్యాంగ క్రీడాకారులను చూచి శీతల్‌దేవి ప్రేరణ పొందారు. నాటి నుండి రెండు కాళ్ళతో విల్లును ఎక్కుపెట్టి, మెడ, భుజం సాయంతో బాణాన్ని సంధించడం శీతల్‌దేవి నేర్చుకుని పారాగేమ్స్ (దివ్యాంగుల క్రీడలు)లో పాల్గొనడం ప్రారంభించారు. అక్కడ నుండి వెనుతిరిగి చూడలేదు.





## అంతర్జాతీయ గుర్తింపు

15 సంవత్సరాల వయస్సులో 2021 నుండి కాళ్ళతో విలువిద్యను ప్రదర్శించడంలో శిక్షణ ప్రారంభించిన శీతల్‌దేవి 18సంవత్సరాల వయస్సులోనే అంతర్జాతీయస్థాయిలో అనేక పతకాలు సాధించి భారతదేశానికి

గర్వకారణంగా నిలిచారు. 11 నెలల్లోనే 2022లో అనేక పతకాలు సాధించారు. హర్యానాలో 2022 మార్చిలో జరిగిన పారా ఆర్చరీ నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని తొలి జాతీయస్థాయి విజయాన్ని సొంతం చేసుకున్నారు.

చైనాలోని హాంగ్‌జౌ (Hangzhou) నగరంలో 2023లో జరిగిన 4వ ఆసియా పారా గేమ్స్ జరిగాయి. ఈ పోటీల్లో మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్‌లో ఒక స్వర్ణ పతకం, మహిళల వ్యక్తిగత కాంపౌండ్‌లో మరో స్వర్ణ పతకం, మహిళల డబుల్స్ కాంపౌండ్‌లో ఒక రజత పతకాన్ని కలుపుకుని మొత్తం 3 పతకాలు సాధించారు.



16 ఏళ్ళ వయస్సులోనే అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకుని పారాలింపిక్స్ మెడలిస్ట్‌గా రికార్డు సృష్టించి కీర్తి గడించారు. 2023 కు గాను శీతల్‌దేవి అతి పిన్న వయస్సులో అర్జున్ అవార్డును భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అందుకున్నారు. 2024లో శీతల్‌దేవి భారతదేశంలోనే అతి పిన్న పారాలింపిక్స్ మెడలిస్ట్‌గా గుర్తింపు పొందారు.

### నేటి తరానికి ఆదర్శం

తన ప్రయాణంలో శీతల్‌దేవి ఎన్నో కష్టాలు పడి, మూడేళ్ళపాటు ఇంటికి దూరంగా ఉండి అనేక పతకాలు సాధించిన తరువాతే



విజయ గర్వంతో ఇంటికి వెళ్ళారు. ఎటువంటి అడ్డంకి వచ్చినా, అంకిత భావంతో కూడిన సంకల్పంతో ఎదగవచ్చని చాటి చెప్పిన శీతల్‌దేవి కథ తమ కలలను సాకారం చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరికీ ప్రేరణ కలిగిస్తుంది. నిరంతర కృషి, పట్టుదల, కలిగివుంటే ఏదైనా సాధించగలరని శీతల్‌దేవి నిరూపించి నేటి తరానికిఆదర్శంగా నిలిచారు.

**రచయిత పరిచయం :** తెలుగు భాషకు వెలుగు తెస్తున్న వారిలో ఒకరు బాలసాహితీ రత్న **షేక్ అబ్దుల్ హకీంజాని.** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలిలో షేక్ పరీద్ సాహెబ్, మహబూబ్‌బీ దంపతులకు 01.01.1963లో జన్మించిన వీరు వృత్తి రీత్యా తెలుగు ఉపాధ్యాయులు. ప్రవృత్తిరీత్యా బాలసాహితీవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. బాలసాహిత్యంలో 30 పుస్తకాలు, 200లకు పైగా కథలు రచించారు.

## I. సంభాషించండి – చర్చించండి

1. మీ ఇంట్లో ఏ వార్తా పత్రిక చదువుతారు?
2. ఈ రోజు వార్తా పత్రికలోని ముఖ్యంశాలు ఏవి?
3. దివ్యాంగుల కొరకు ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలు.
4. ఉత్తమ క్రీడాకారులకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

సంకల్పం = ఒక పని చేయాలనే ఆలోచన; తొలి = మొదటి ; అనూహ్య = ఊహించలేని;
అభిలాష = కోరిక; సాకారం = నెరవేరుట.

### ఆ) జతపరచండి.

పాఠం నుండి కొన్ని ఆటల పేర్లు ఇవ్వబడినాయి. వాటి గురించి మీ జట్టుతో చర్చించండి. వాటిని, వాటికి సరిపోయే జవాబులతో జతపరచండి. వీటి కోసం ఇంటర్‌నెట్ సహాయం తీసుకోవచ్చు.

| ఆటల పేర్లు | వాటి వివరాలు |
|---|---|
| 1. ఆర్చరీ గేమ్స్ | 1. దివ్యాంగుల విలు విద్యలు |
| 2. పారాగేమ్స్ | 2. అంతర్జాతీయ ఆటల పోటీలు |
| 3. పారాలింపిక్స్ గేమ్స్ | 3. దివ్యాంగుల ఆటలు |
| 4. పారా ఆర్చరీ గేమ్స్ | 4. దివ్యాంగుల అంతర్జాతీయ ఆటలు |
| 5. ఒలంపిక్ గేమ్స్ | 5. విలువిద్య ఆటలు |

### ఇ) ఆకృతులు పూరించండి.

1. శీతల్‌దేవి కింది సంవత్సరములలో సాధించిన గొప్ప ఘనతలు.

| 2022 సం॥ | 2023 సం॥ | 2024 సం॥ |
|---|---|---|
| హర్యానాలో జరిగిన పారా ఆర్చరీ నేషనల్ చాంపియన్ జాతీయ స్థాయి తొలి విజయం సాధించారు. | | |

## భాషావగాహన

- కింది పదాలకు అర్థాలు తెలిపి, మీ సొంతవాక్యాలలో ఉపయోగించి రాయండి.

| పదం | అర్థం | సొంతవాక్యం |
|---|---|---|
| 1. బాల్యం | | |
| 2. శిక్షణ | | |
| 3. స్ఫూర్తిదాయకం | | |

- గీతగీసిన పదములకు భాషాభాగాలు రాయండి.

1. అక్కడ నుండి వెను తిరిగి చూడలేదు.
2. ఆకారణంగా ఆమె చేతులు పెరగలేదు.
3. అతి పిన్న వయస్సులో అర్జున ఆవార్డు అందుకున్నారు.

- కింది వాటిలో సామాన్య / సంశ్లిష్ట / సంయుక్త వాక్యాలు గుర్తించండి.

1. శీతల్‌దేవి స్వర్ణ, రజత పతకాలు పొందారు.
2. ఆమె బెంగుళూరు వెళ్ళారు.
3. రెండు కాళ్ళతో విల్లు ఎక్కు పెట్టి భుజం సాయంతో బాణాన్ని సంధించేవారు.

- కింద పదములను కలిపి అవి ఏ సంధులో రాయండి.

| విడదీసిన పదాలు | పదం | సంధి పేరు |
|---|---|---|
| 1. ఏది + అయిన | | |
| 2. వెన్ను + అంటి | | |

- కింది వాటికి విగ్రహవాక్యములు రాసి, సమాసముల పేర్లు రాయండి.

1. మూడేళ్ళు ........................ ........................
2. కాళ్ళు చేతులు ........................ ........................
3. ప్రతి ఒక్కరు ........................ ........................
4. నిరంతర కృషి ........................ ........................

## స్వీయస్పందన

1. ''శీతల్‌దేవి ఆదర్శమూర్తి'' .............

2. సంఘసేవలో నేటి తరానికి మీరు ఏ విధంగా స్ఫూర్తినిస్తారు?

## ప్రసార మాధ్యమాలు

- వివిధ దిన, వార, మాస పత్రికలలో ప్రచురితమయ్యే, టీ.వి.లో ప్రసారమయ్యే పారాలింపిక్స్ (Paralympics), చూడండి, తరగతిలో చర్చించండి, రాయండి.

**జట్టుపని : చిత్రాలలోని వ్యక్తుల గురించిన తెలుసుకోండి. వారి జీవిత విశేషాలను చిన్న చిన్న వ్యాసాలుగా రాయండి.**



శ్రీమతి సధా చంద్రన్



శ్రీ రవీంద్ర జైన్

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

**విద్యార్థి సూచన :** వార్తాపత్రికల్లో, మ్యాగజైన్‌లలో వచ్చిన క్రీడాపోటీలకు సంబంధించిన వార్తల కత్తిరింపులు మీ నోటు పుస్తకములో అతికించండి, వాటిని మీ తరగతిలో చదివి వినిపించండి.

- **మనం క్రీడల దినోత్సవం గురించి స్రవంతి రాసిన నివేదికను చదువుదాం.**

**శారదా విద్యాలయం పాఠశాలలో జరిగిన కార్యక్రమం నివేదిక**

**శీర్షిక :** పాఠశాలలో క్రీడా దినోత్సవం.

**తేది :** 19-11-2026

**స్థలం :** శారదా విద్యాలయం మైదానం

మా పాఠశాలలో ది. 19-11-2026న క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మా ఉపాధ్యాయులు ప్రారంభించారు. విద్యార్థులు 100 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, మూడుకాళ్ళ పరుగు పందెం, జావెలిన్ విసరడం మున్నగు ఆటల పోటీలలో పాల్గొన్నారు.

కొందరి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హాజరైనారు. వారంతా పిల్లలను ఎంతో ప్రోత్సహించారు. విజేతలకు బహుమతులు, పతకాలు బహూకరించబడ్డాయి. అందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం వలన విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి మరియు క్రమశిక్షణ పెరిగింది.

నివేదిక వ్రాసిన వారు : స్రవంతి, 6వ తరగతి.



- **అంశాల ఆధారంగా నివేదికలు రాయండి.**
- **తరగతిలో చదవండి.**



# 16 శకునఫలం

నేపథ్యం : పనిని ప్రారంభించబోవునప్పుడు ఎదురైన సంఘటన బట్టి చేయబోవు పనియొక్క ఫలితముంటుందని కొందరు నమ్ముతారు. వీటినే శకునాలు అంటారు. కానీ ఇటువంటివి మూఢనమ్మకాలు. ఇలాంటి నమ్మకాల వలన పనులకు ఆటంకము తప్ప ఎటువంటి ఉపయోగము ఉండదు. ఈ విషయాన్ని తెలియజేసేదే ప్రస్తుత పాఠ్యభాగం. చదువుదాం, తెలుసుకుందాం. మూఢనమ్మకాలను తొలగిద్దాం.




శకునాల నమ్మకము శరభరాజుకి మెండు
శకున మారయకుండ జుట్టైన దువ్వండు
పిల్లి పరుగిడుచున్న, కుక్క మూలుగు విన్న
తెలియరాని భయమ్ము చెలగిగుండెలదాకు. 1

ఆతడొకనాడు గ్రామాంతరము పోదలచి
తిథివార నక్షత్ర యమ గండములు కొలిచి
తన కెదురు రమ్మనుచు తరుణీ మణిని పిలిచి
ఇల్లువెడలె ముక్కోటి ఇలవేలుపుల గొలిచి. 2



ఆయూరి పొలిమేర కవల చింతల ప్రక్క
ఎడమవైపున నుండి కుడివైపుకొక నక్క
అతడు నడిచేదారి కడ్డు పరుగెత్తింది.
ముళ్లడొంకల దూరి మాయమై పోయింది. 3

అది యెట్టి శకునమో అతడెరుగక పోయె
జరుగునా? పనియన్న సంశయము
మొదలాయె అడుగు సాగక వాని కాలోచనలు
పుట్టె దీని ఫలమరయంగ తిరుగు దారిని బట్టె. 4

తమ యూరి కరణమ్ము దారిలో కనిపింప
శకున ఫలమడిగేడు సంగతులు వివరించి
‘‘ఎడమవైపున నక్క ఎగిరితే మంచిదా?
లేక కుడివైపుగా దూకితే మంచిదా?’’ 5

శరభయ్య వెర్రికా కరణమించుక నవ్వి
వివరించె నీ రీతి విజ్ఞాన నిధి తవ్వి
‘‘ఎటునుండి ఎటువైపు కెగిరి దూకిన మేలు
పిక్క పట్టుక నక్క పీక కుండిన చాలు!’’ 6



**కవి పరిచయం :** **డా॥ మహీధర నళినీమోహన్** గారు 1938 లో తూర్పు గోదావరి జిల్లా, ముంగండలో జన్మించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి భౌతికశాస్త్రంలో మాస్టరు డిగ్రి, మాస్కో విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేటు డిగ్రీ తీసుకున్నారు. ఢిల్లీలోని నేషనల్ ఫిజికల్ లేబరేటరీలో అంతరిక్ష పరిశోధనలు చేయడమే కాక రాకెట్ల ప్రయోగాలలో కూడా పాల్గొన్నారు. పిల్లల కోసం ఎన్నో పుస్తకాలు, కవితలు, వ్యాసాలు వ్రాశారు. తన వైజ్ఞానిక రచనల ద్వారా ప్రజలకు సైన్సు మీద అభిమానం కలిగిస్తున్నందుకు 1986 లో ఇందిరాగాంధీ విజ్ఞాన బహుమతిని ప్రప్రథమంగా అందుకున్నారు. ప్రస్తుత పాఠ్యభాగం **‘బడాయి మేక’** సంకలనం నుండి గ్రహింపబడినది.

## I. సంభాషించండి - చర్చించండి :

శకునాలను నమ్మడం వలన కలిగే నష్టాలు.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పద్యాల అర్థాన్ని, భావాన్ని తెలుసుకోండి, రాయండి.

1) మెండు = ఎక్కువ, అధికము; అరయకుండ = చూడకుండ;
మూలుగు = అలసట లేదా రోగము వలన బాధతో చేయుధ్వని; చెలగి=విజృంభించి.

**భావము :** శరభరాజునకు శకునములపై చాలా నమ్మకం, శకునం చూడకుండ అతడు తలకూడా దువ్వడు. ప్రయాణమగునపుడు పిల్లి పరుగెత్తినా, కుక్క మూలుగు విన్నా అతనికి మనసులో విపరీతమైన భయము కలుగుతుంది.

2) గ్రామాంతరము = వేరే గ్రామం; గండం = ఆపద, కష్టము; తరుణి మణి = భార్య; కొలిచి = ప్రార్థించి,
ఇలవేలుపు = కులదైవం, గృహదేవత.

**భావము :** అతడు ఒకనాడు వేరేగ్రామం వెళ్ళాలని అనుకొన్నాడు. తిథి, వార, నక్షత్రాలను, యమగండంను చూచినాడు. బయలుదేరబోవుచు భార్యను ఎదురుగా రమ్మని పిలిచినాడు. ముక్కోటి దేవతలను ప్రార్థించి ఇంటి నుండి బయలుదేరినాడు.

3) పొలిమేర = రెండుగ్రామాల మధ్య సీమరేఖ; మాయమై = కనిపించకుండా.

**భావము :** ఆ ఊరి పొలిమేర దాటగానే చింతచెట్ల ప్రక్క నుండి ఒక నక్క వచ్చి ఎడమవైపు నుండి కుడివైపునకు పరుగెత్తుకు వెళ్ళెను. తరువాత అది ముళ్ళడొంకలలో దూరి కనిపించకుండా పోయెను.

4) ఎరుగక = తెలియక; సంశయము = సందేహం; అనుమానము; అరయంగ = తెలిసికొనుటకై;
మొదలాయె = ప్రారంభమయ్యెను.

**భావము :** శరభరాజునకు అది ఎటువంటి శకునమో తెలియ లేదు. అతనికి తాను వెళుతున్న పని జరుగుతుందా అను అనుమానం ప్రారంభమయ్యెను. అతనికి ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. అతని మనస్సులో అనేక ఆలోచనలు ప్రారంభమయ్యాయి. ఆ శకునఫలం తెలిసికొనుటకై తిరుగుదారి పట్టి గ్రామంలోనికి వచ్చాడు.

5) కరణం = భూమిశిస్తు లెక్కలు రాసే ఉద్యోగి.

**భావము :** శరభరాజుకు దారిలో ఊరి కరణం కనిపించెను. సంగతులన్నియు అతనికి వివరించెను. తరువాత నక్క ఎడమవైపు నుండి కుడివైపునకు ఎగిరితే మంచిదా? కుడివైపు నుండి ఎడమవైపునకు దూకితే మంచిదా? అని శకునఫలం అడిగెను.

6) ఇంచుక = కొద్దిగా; విజ్ఞాన నిధి = శాస్త్ర పరిజ్ఞానము.

**భావము :** శరభయ్య మూఢనమ్మకానికి ఆ కరణం నవ్వి తన శాస్త్ర పరిజ్ఞానంతో ఈ విధంగా వివరించెను. నక్క ఎటునుండి ఎటు దూకినను మంచిదే. నీ పిక్కపట్టుకొని పీకకుండిన చాలు అని పలికెను.

**ఆ) కింది ఖాళీలను కుండలీకరణంలోని పదాలలో సరైన దానిని ఎన్నుకొని పూరించండి.**

(విజ్ఞాననిధి, శకునము, తరుణిమణిని, ముళ్లడొంకల)

1) ______________ అరయకుండ జుట్టైన దువ్వండు.

2) తనకెదురు రమ్మనుచు ______________ పిలిచి.

3) ______________ దూరి మాయమై పోయింది.

4) వివరించె నీరీతి ______________ తవ్వి.

**ఇ) కింది వాక్యాలను ఎవరు ఎవరితో పలికిరో రాయండి.**



1) "ఎడమ వైపున నక్క ఎగిరితే మంచిదా?
లేక కుడివైపుగా దూకితే మంచిదా?

2) "ఎటు నుండి ఎటువైపుకెగిరి దూకిన మేలు
పిక్కపట్టుక నక్క పీక కుండిన చాలు!"



## ఆలోచన కొరకు

**అ) పాఠమును మరొకసారి చదివి, కింది అంశాల గురించి ఆలోచించి, మీ నోట్‌పుస్తకాలలో రాయండి.**

1) శకునాలపై మీ అభిప్రాయము.

2) మీరు గమనించిన మరికొన్ని శకునాలు.

**ఆ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.**

1) కరణంను శరభ రాజు ఏమని అడిగెను?

2) శరభయ్య వెర్రిని కరణం ఏ విధంగా పోగొట్టెను?

## భాషావగాహన

**అ) కింది వాక్యములో గుర్తింపబడిన పదములు ఏ భాషాభాగములకు చెందినవో రాయండి.**

అతడొకనాడు గ్రామాంతరము పోదలచెను.

**ఆ) కింది పదములు ఏ వాచకములకు చెందినవో రాయండి.**

(1) శరభరాజు (2) తరుణిమణి (3) పిల్లి (4) అతడు (5) నక్క

**ఇ) పాఠంలో వచ్చిన ప్రాసపదాలను రాయండి.**

### ఈ) కింది పద్య పంక్తులు ఏ వాక్య రకమునకు చెందినవో రాయండి.

1) ఎడమవైపున నక్క ఎగిరితే మంచిదా?

2) తెలియరాని భయము చెలగి గుండెలతాకు.

3) పిక్క పట్టుక నక్క పీక కుండిన చాలు!

4) శకునము చూడకుండ శరభరాజు వెళ్ళడు.

### ఉ) కింది పదములను విడదీసి, సంధి పేర్లను రాయండి.

1) అతడొకనాడు = ____________ + ____________ = ______________________

2) తనకెదురు = ____________ + ____________ = ______________________

3) ఫలమరయంగ = ____________ + ____________ = ______________________

4) వానికాలోచనలు = ____________ + ____________ = ______________________

5) ఫలమడిగేడు = ____________ + ____________ = ______________________

### ఊ) కింది పదములకు విగ్రహవాక్యములను రాసి, ఏ సమాసములకు చెందినవో రాయండి.

(1) నక్షత్రయమగండములు (2) విజ్ఞాననిధి (3) ముక్కోటి ఇలవేలుపులు

## స్వీయస్పందన

1) ఎవరైనా శకునాలను విశ్వసించటం మంటే మీరెలా స్పందిస్తారు.

2) ఆచారాలను పాటించడం ఎంత వరకు మంచిది.

3) పాఠాన్ని చదివి సొంతంగా గేయం రాసి, రాగయుక్తంగా పాడండి.

## సృజనాత్మకత

### కథ రాయండి

చిత్రాన్ని గమనించండి.

ఏమి కథో తెలిసిందా!

భలే కనుక్కున్నారే!

ఇప్పుడు దానిని సంభాషణ రూపంలో కొనసాగించండి మరి.



17

# సిద్ధించిన లక్ష్యం

నేపథ్యం : ప్రతి మనిషి అన్ని పనులలో తన ప్రతిభను చూపించలేకపోవచ్చు. చక్కగా ఉపన్యసించేవారు పాడలేకపోవచ్చు. కవిత రాసేవారు, నాట్యం చేయలేక పోవచ్చు. ఇలాంటి సందర్భములోనే ఒకరిలోని ప్రతిభను మరొకరు గుర్తించాలి. ప్రశంసించాలి. వీలైతే వారి సహకారంతో నేర్చుకోవాలి. ఈ విధంగా సహకరించుకొన్న ఇద్దరు స్నేహితులు తమ లక్ష్యాన్ని ఏ విధంగా సాధించారో చూద్దామా!

శ్రీను, రాజేష్ ఆరవతరగతి చదువుతున్నారు. ఇరుగుపొరుగు వారు కావడంతో ఇద్దరూ కలిసే బడికి వెడతారు.

రాజేష్ ఆటలు బాగా ఆడతాడు. శ్రీను బాగా చదువుతాడు.

బాలల దినోత్సవం సందర్భంగా, బడిలో జరిగిన ఆటల పోటీలో రాజేష్ ప్రథమ బహుమతి సాధించాడు.

"అభినందనలు, రాజేష్'' అన్నాడు శ్రీను.

"థాంక్స్, శ్రీను నాకు కూడా బాగా చదివి నీలాగే చదువులో రాణించాలని ఉంది. కానీ ఆటలాడటంతోనే, సమయమైపోతోంది'' అన్నాడు రాజేష్.

శ్రీను ఇంటికి వెళ్లి, "అమ్మా! ఆటలాడితే చదవడం కుదరదా?" అని అడిగాడు. అప్పుడు అమ్మ, ''అదేమీ కాదు. ఏకాగ్రత, అభిరుచి ఉంటే, అటు చదువులోనూ, ఇటు ఆటల్లోనూ సమానంగా రాణించవచ్చు. కానీ శ్రద్ధ పెట్టాలి. సమయపాలన-పాటించాలి'' అని చెప్పింది.

"అయితే, నేను కూడా రాజేష్‌తో సమానంగా ఆటల్లో రాణించగలనా?" ఆసక్తిగా అమ్మనడిగాడు.

"సాధన చేస్తే సాధ్యం కానిది లేదు'' అమ్మ అంది.

అమ్మ మాటలు శ్రీనుకు నచ్చాయి.

మరుసటి రోజున, బడికి వెళుతున్నప్పుడు, అమ్మ మాటలు రాజేష్‌తో చెప్పాడు. ''శ్రీనూ, నువ్వు బాగా ఆటలాడేందుకు నేను సాయం చేస్తానన్నాడు''. రాజేష్.

"రాజేష్, నువ్వు బాగా చదివేలా నేను సహాయం చేస్తానన్నాడు'', శ్రీను.

ఇద్దరూ చేయి, చేయి కలిపారు.

బడిలో విరామ సమయంలో చదువు-తున్నప్పుడు, రాజేష్‌కు వచ్చిన సందేహాలను తీర్చి, బాగా అర్థమయ్యేలా, శ్రీను వివరిస్తున్నాడు.

డ్రిల్ పీరియడ్‌లో రాజేష్ ఎలా ఆడుతున్నాడో, శ్రీను గమనించ సాగాడు.

ఆట స్థలం మధ్యలో ఒక పెద్ద చెక్క బోర్డు ఉంది. దానిపై నల్లని వలయాలు ఒకదానిపై ఒకటి ఉన్నాయి. రాజేష్, అల్లంత దూరంలో నిల్చొని బాణం విసురుతుంటే, ఆ బాణం నేరుగా వెళ్లి, కేంద్ర స్థానంలో తగులుతోంది. అది చూసి, శ్రీనుతో సహా, స్నేహితులందరూ, రాజేష్‌ను అభినందించారు.

శ్రీను కూడా ఉత్సాహంతో బాణం వేశాడు. కానీ బాణం, కనీసం చెక్క బోర్డును కూడా తాకలేదు.

అప్పుడు రాజేష్, "శ్రీనూ! మొదట్లో






నేను విసిరిన బాణం కూడా గురి తప్పేది. గురి తప్పకుండా బాణం ఎలా వేయాలో నేను నేర్పుతానంటూ, ప్రోత్సాహపరిచాడు. చదివేటప్పుడు శ్రీను ఆటలాడేటప్పుడు రాజేష్, ఒకరికొకరు ప్రోత్సాహం అందించుకోవడం వీరిద్దరి దినచర్యగా మారింది. శ్రీను గురి చూసి బాణం విసరడంలో పట్టు సాధించాడు. అది గమనించిన డ్రిల్ సార్ రవి ఇద్దరితో, "మీరు కళ్ళకు గంతలు కట్టుకుని బాణం గురిచూసి కొట్టడంలో సాధన చేయండి. అది సాధ్యం కావాలంటే, మనసుకు, దృష్టికి, చేతికి అనుసంధానం జరగాలి. అందుకు ఏకాగ్రత కూడా బాగా అవసర''మన్నారు. శ్రీను, రాజేష్ లిద్దరూ రవి సార్ చెప్పినట్లే, ఆ రోజు నుండీ కళ్ళకు గంతలు కట్టుకుని, బాణం విసరడంలో సాధన చేయసాగారు.

కొన్ని రోజుల తర్వాత, రాష్ట్ర స్థాయిలో జరిగిన గ్రిగ్స్ పోటీలో శ్రీను, రాజేష్ లిద్దరూ బహుమతి గెలుచుకున్నారు. అంతే కాకుండా, పరీక్షలలో కూడా ఇద్దరూ ప్రథమ స్థానంలో నిలిచారు.

ఆటల్లోనూ, చదువులోనూ ప్రతిభ చూపిన శ్రీను, రాజేష్‌లను ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయులు మెచ్చుకున్నారు.




"పిల్లలూ! మీరంతా వీళ్ళిద్దరినీ ఆదర్శంగా తీసుకోవాలి. శ్రద్ధ పెట్టాలి. అప్పుడే అనుకున్న 'లక్ష్యం సిద్ధిస్తుంది' అని అన్నారు.

ఉపాధ్యాయులతో సహా, తోటి పిల్లలంతా, శ్రీను, రాజేష్‌లను అభినందిస్తూ చప్పట్లు కొట్టారు.

**రచయిత పరిచయం : కొక్కెరగడ్డ వెంకట లక్ష్మణరావు** (కె.వి. లక్ష్మణరావు) గారు కామశాస్త్రి, అన్నపూర్ణ దంపతులకు మానేపల్లి గ్రామం, డా॥ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు జన్మించారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. వీరి కథా రచనలు అనేకం పత్రికలలో ప్రచురితం అయ్యాయి. 'అంతా ఒక్కటే, టక్కరి మొసలి, సింహానికి జలుబు చేసింది, 'సమయం కన్నా-సాయం మిన్న' మొదలగు బాలల కథా పుస్తకాలు కూడా వెలువడ్డాయి. ప్రస్తుత పాఠ్య భాగం వీరి **'అంతా ఒకటే'** పుస్తకంనుండి గ్రహించబడినది.

## I. సంభాషించండి - చర్చించండి.

1) ప్రతి ఒక్కరు తమ జీవితానికి లక్ష్యం ఏర్పరచు కోవడం అవసరం.

2) లక్ష్య సాధనకై పాటించదగిన నియమాలు.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

ఇరుగుపొరుగు = చుట్టుప్రక్కలవాళ్ళు; రాణించుట = ప్రతిభను చూపుట; ఏకాగ్రత = ఒకే విషయంపై దృష్టిని కేంద్రీకరించడం; సమయపాలన = సమయం ప్రకారం పని చేయుట.

### ఆ) ఆకృతిని పూరించండి.




### ఇ) గద్య రచన - వర్ణన - చర్చ

''ఏకాగ్రత, అభిరుచి ఉంటే అటు చదువులోనూ ఇటు ఆటల్లోనూ సమానంగా రాణించవచ్చు. కానీ శ్రద్ధ పెట్టాలి. సమయపాలన పాటించాలి''... ఈ విధంగా రచయిత అనడంలో మీ అభిప్రాయాన్ని వ్యక్తపరచండి.

## భాషావగాహన

### అ) కింది జాతీయాలను వివరించండి.

1) 'దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకో.'

2) 'అడుసుతొక్కనేల, కాలు కడగనేల.'

### ఆ) గీత గీసిన పదములు ఏ భాషాభాగాలకు చెందినవో రాయండి.

1) శ్రీను <u>బాగా</u> చదువుతాడు.

2) <u>రాజేష్</u>, శ్రీను ఆటలు బాగా ఆడుతారు.

3) ఉపాధ్యాయులు, పిల్లలు రాజేష్, శ్రీనులను అభినందిస్తూ <u>చప్పట్లు కొట్టారు.</u>

**ఇ) కింది వాటిలో సకర్మక క్రియ, అకర్మక క్రియ వాక్యాలను గుర్తించండి.**

1) శ్రీను వివరిస్తున్నాడు.

2) శ్రీను కూడా ఉత్సాహంతో బాణం వేసాడు.

**ఈ) కింది వాక్యాలలోని విభక్తి ప్రత్యయాలను గుర్తించి, వాటి కింద గీతలు గీసి, ఏ విభక్తులో రాయండి.**

1) రాజేష్‌తో సమానంగా ఆటల్లో రాణించగలనా?

2) రాజేష్‌కు వచ్చిన సందేహాలను శ్రీను వివరిస్తున్నాడు.

3) ఇద్దరూ కలిసి బడికి వెళతారు.

**ఉ) కింది పదాలను విడదీసి సంధి పేర్లను రాయండి.**

1) ఆటలాడేందుకు = ...................... + ...................... -> ......................

2) ఒకరికొకరు = ...................... + ...................... -> ......................

**ఊ) కింది వాటికి విగ్రహ వాక్యాలు రాసి సమాసముల పేర్లు రాయండి.**

| పదం | విగ్రహ వాక్యము | సమాసనామము |
|---|---|---|
| 1. ఇరుగుపొరుగు | | |
| 2. నల్లని వలయాలు | | |
| 3. ఆట స్థలం | | |
| 4. బాలల దినోత్సవం | | |



## స్వీయస్పందన

1) మీ కుటుంబ సభ్యులలో ఎవరెవరు మీతో స్నేహంగా ఉంటారు? ఏ విధంగానో చెప్పండి.

2) మన జీవితంలో స్నేహితుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

3) నీ తరగతిలో ఆయా విషయాలలో వెనుకబడిన తోటి విద్యార్థులకు ఎలా సహాయపడగలవు?

## సృజనాత్మకత

**సంభాషణను పొడిగించి రాయండి.**

(ఆదివారం సంతకు తల్లి, కూతురు వెళ్లారు. అక్కడ వారి మధ్య జరిగిన సంభాషణ)

కూతురు : అమ్మ! ఈ బజార్ ప్రతిరోజు ఉంటుందా?

తల్లి : లేదమ్మా! ఆదివారం మాత్రమే ఉంటుంది.

కూతురు : అబ్బో! చాలా కూరగాయలున్నాయి. అమ్మా! బజార్‌లో ఇంకేమేమి లభిస్తాయి?

**ఉపాధ్యాయ సూచన :** తరగతిని జట్లుగా చేసి జాతర, గ్రామసభ మొదలగు వాటి గురించి పై విధంగా సంభాషణ రాయించి, చదివించండి.

# 18 గుర్రంగుడ్డు కథ

**నేపథ్యం :** మనము, చిన్న పిల్లలు అమాయకంగా మాట్లాడే మాటలు, అడిగే ప్రశ్నలు వింటుంటాము. మనము ఆ చిన్నారి పిల్లల అమాయకత్వాన్ని ప్రేమతో స్వీకరిస్తాము, ఆదరిస్తాము. కాని పెద్దవారుకూడా చిన్న పిల్లలవలె అమాయకులైతే చాలా ప్రమాదం. వారు మోసానికి గురౌతారు. అలాంటి వారే మన పరమానందయ్య శిష్యులు. మరి వారికి ఈ కథలో ఏం జరిగిందో చూద్దాం.

పరమానందయ్య శిష్యులు అమాయకులు కావచ్చుకాని, వాళ్ళకి గురువుగారి మీద అభిమానానికి మాత్రం లోటు లేదు. ఒకసారి వాళ్ళలో ఒకడికి బ్రహ్మాండమైన ఆలోచన వచ్చింది.

"మన గురువుగారికి ఎక్కడెక్కడి నుంచో పిలుపులు వస్తుంటాయి. వారు తరచుగా ఊళ్ళు వెళ్ళవలసి వస్తుంది. గురువుగారు పెద్దవారైపోయారు. కాలినడకన వెళ్ళలేరు. ఎడ్లబండంటే ఒకవైపు కుదుపు, మరోవైపు నెమ్మది. అంచేత వారికొక గుర్రముంటే బాగుంటుంది.''

మిగిలిన వాళ్ళు కూడా ఆ ప్రతిపాదనను తక్షణం ఆమోదించారు.

అందరూ కలసి గురువుగారి దగ్గరకెళ్ళి తమ అభీష్టం తెలియజేశారు. అంగీకరించమని ఒత్తిడి చేశారు.

శిష్యుల అభిమానాన్ని కాదనలేకపోయారు ఆయన. ''మీ సలహా బాగానే ఉంది. ఎత్తు, లావు, వెడల్పు, రంగు, తోక అన్నీ బాగున్న మంచి గుర్రాన్ని కొనుక్కురండయితే'' అన్నారు.

శిష్యగణం బయలుదేరారు. వాళ్ళు అలా నడిచివెళ్తుంటే ఒకచోట గుర్రాలు మేస్తూ కనిపించాయి. వాళ్ళు వాటిలో మంచి దానిని చూసి ధర కనుక్కుందామని గట్టు దిగారు. ఆ గుర్రాల పక్కనే... నేల మీద పాదులకి బూడిద





గుమ్మడికాయలు కాసి ఉన్నాయి. ఆ కాయలను ఆ గుఱ్ఱాలు పెట్టిన గుడ్లనుకున్నారు. గుఱ్ఱం గుడ్డు పెడుతుందో, పిల్లని యీనుతుందో కూడా వాళ్ళకి తెలియని విషయమే. ఆ గుఱ్ఱం గుడ్డుని చూసేసరికి వాళ్ళకి అఖండమైన ఆలోచనలు వచ్చేశాయి. ''గుఱ్ఱమయితే హీనపక్షం మూడొందలుంటుంది. గుడ్డయితే చవగ్గా దొరుకుతుంది.'' ''గుడ్డుని పొదిగితే కానీ పిల్లరాదు కదా?" సందేహం వచ్చిందొకడికి.

"దానికేముంది? రోజుకొకళ్ళం గుడ్డు మీద కూర్చుని పొదుగుదాం. ''ఔను, అలా అయితే బాగుంటుంది. అదే నయం'' అనుకున్నారు.

పొలంలో ఉన్న రైతు దగ్గరకు వెళ్లారు. ''ఈ గుఱ్ఱం గుడ్డు ఖరీదెంత?" అని అడిగారు దర్పంగా.

రైతు వాళ్ళ వాలకం చూసి వట్టి అమాయకులని కనిపెట్టేశాడు. వీళ్ళ సంగతేమిటో చూద్దామని ''ఇరవై రూపాయలు'' అన్నాడు వేళాకోళంగా.

"ఓస్ ఇంతేనా'' అంటూ యిరవయ్యి యిచ్చేసి బాగా పెద్దదిగా కనిపిస్తున్న గుఱ్ఱం గుడ్డు (బూడిద గుమ్మడికాయ) తీసుకుని బయలుదేరారు.

కొంత దూరం నడిచాకదాన్ని నెత్తిన పెట్టుకున్నవాడి కాలుకి రాయి తగిలి... వాడు తూలి... నెత్తిమీద బూడిద గుమ్మడికాయ దభేలున కిందపడింది. ఆ శబ్దానికి – పక్కన పొదలో వున్న చెవుల పిల్లి బెదిరి – తోవకడ్డంగా పరుగెత్తింది. వాళ్ళు ఆశ్చర్యం పట్టలేకపోయారు. 'ఎంత విచిత్రం! గుడ్డు యిలా పగలడమేమిటి, పిల్ల అలా బయటకొచ్చెయ్యడమేమిటి, అది అప్పుడే ఛెంగు ఛెంగున పరుగెత్తడమేమిటి! మన గుఱ్ఱంపిల్లని పోనివ్వకూడదు పట్టుకోవాలి? అనుకుంటూ వాళ్ళుదానిని వెంబడించసాగారు.

చెవుల పిల్లిని పట్టుకోవడం చెవిరాయుల తరమా? దానిని తరిమి తరిమి వాళ్ళు అలసిపోయారు కాని అది మాత్రం దొరకలేదు. చెమటలు కక్కుతూ....... ఒగరుస్తూ...... బాట ప్రక్క బండ మీద అందరూ కూలబడిపోయారు.

ఆ బాట వెంట ఒకడు గుఱ్ఱాన్ని నడిపించుకుని వస్తున్నాడు. అతను వీళ్ళ అవస్థని చూసి, సంగతేమిటని అడిగాడు. వాళ్ళు ఏమీ దాచకుండా అంతా చెప్పారు. వట్టి బభ్రాజిమానాలనుకుంటూ, గుఱ్ఱమెక్కడైనా గుడ్డు పెడుతుందా? మీరు మోసుకొచ్చింది కూష్మాండమే (బూడిద గుమ్మడికాయ) కాని గుఱ్ఱం గుడ్డు ఎంత మాత్రమూ కాదు. గుఱ్ఱం కూనని దించుతుంది" అన్నాడు.

''మరి పరిగెత్తిందిగా?" అడిగాడొకడు. ''అది చెవుల పిల్లి'' చెప్పాడతను. ''గుఱ్ఱమంటేయిదే" అని తన గుఱ్ఱాన్ని చూపించాడు. "నీ గుఱ్ఱాన్నిచ్చెయవూ? గుఱ్ఱం లేక మా గురువుగారెంతో బాధపడుతున్నారు" అని వాళ్ళతన్ని బతిమిలాడారు.

''సరే మీ మంచితనం చూసి దీనిని మీకు కానుకగా యిచ్చేస్తున్నాను, పట్టుకుపొండి'' అని అంతవరకూ తను నడుపుకొస్తున్న గుఱ్ఱాన్ని వాళ్ళకిచ్చేశాడు.

''చీకటి పడింది. త్వరగా పొండి'' అని సలహా యిచ్చి అతను తన దారిన తాను పోయాడు. శిష్యుల ఆనందానికి అవధులు లేవు. ''గుడ్డుపోతే పోయింది, గుఱ్ఱమే వచ్చింది" అంటూ ఆనందంతో నాట్యం చేశారా గుఱ్ఱం చుట్టూ చేరి. దానిని నడిపించబోయారు.

అది సకిలించింది. మెడ విసిరింది. వెనక కాళ్ళతో తన్నింది. అయినా అన్నీ భరించి ... నానా పాట్లూ పడి దానినెలాగో యింటికి చేర్చారు. అప్పటికే చాలా రాత్రయిపోయింది.

మర్నాడు ఉదయం గురువుగారా గుఱ్ఱాన్ని చూశారు. "కొంప మునిగిందిరా'' అని ఒక కేక వేశారు. ''నాయనా! దీని కొక కన్ను గుడ్డి. ముసలిడొక్కు. స్వారీకే మాత్రమూ పనికిరాదు, దాణా తిండానికి తప్ప. ఆ పెద్ద మనిషి మహా తెలివయినవాడు. దాణా ఖర్చు తప్పుతుందని దీన్ని మనకి దానం చేసేశాడు." వాపోయారు గురువుగారు.



## I. సంభాషించండి - చర్చించండి.

1. "గురువుగారి కోసం గుర్రం ఉంటే బాగుంటుంది'' ఈ ప్రతిపాదన రావడానికి కారణం ఏమిటి?
2. పూర్వం విద్యార్థులు గురువుల ఆశ్రమాలకు వెళ్ళి విద్యనభ్యసించేవారు.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

తక్షణం = వెంటనే; యీనుట = జన్మనిచ్చుట; పాదులు = చెట్ల తీగలు; వాలకం = ప్రవర్తన విధానం; హీనపక్షం = తక్కువలో తక్కువ; బభ్రాజిమానాలు=అమాయకులు; దాణా=గుర్రంతినే ఆహారం.

### ఆ) కింది వాటికి సరైన సమాధానాలు కనుగొని వాటికెదురుగా [✓] గుర్తు పెట్టండి.

1. రైతు చెప్పిన గుర్రం గుడ్డు ధర

☐ ఇరవై రూపాయలు ☐ అరవై రూపాయలు ☐ యాభై రూపాయలు ☐ నలభై రూపాయలు

2. శిష్యులు గుర్రం గుడ్డు కోసం వెళ్లి మొదటగా వీరిని కలిశారు.

☐ గురువును ☐ బాటసారిని ☐ రైతును ☐ పరమానందయ్యను

### ఇ) కింద కొన్ని పదములు పాఠం నుండి ఇవ్వబడినవి. వాటికి సరైన అర్థాలను రాయండి. దీని కోసం మీ ఉపాధ్యాయుల సహాయం తీసుకోండి.

1) చెవులపిల్లి 2) కూష్మాండం 3) పరికించుట

### ఈ) కింది ప్రశ్నలకు సమాధానములు రాయండి.

1. బూడిద గుమ్మడికాయను గుర్రం గుడ్డు అనుకొన్న శిష్యుల ఆలోచనలను వివరించండి.
2. ఈ పాఠంలో పరమానందయ్య శిష్యుల అమాయకత్వాన్ని తెలిపే కొన్ని సంఘటనలను రాయండి.

## భాషావగాహన

అ) పాఠంలో ''నెత్తిమీది గుమ్మడికాయ 'దభేలున' కింద పడింది'' అని ఇవ్వబడింది. ఇలాంటి ధ్వన్యనుకరణ పదాలతో ఆకృతిని పూరించండి.



**ఆ) కింది వాక్యాలలో గుర్తించిన పదాలకు పర్యాయ పదాలను ఉపయోగిస్తూ వాక్యం రాయండి.**

(కుందేలు, అశ్వాలు, సవారి, కూష్మాండము)

1) పొలంలో గుర్రాలు మేస్తూ కనిపించాయి.

2) చెవులపిల్లిని పట్టుకోవటం చెవిరాయుల తరమా!

3) నేలమీద పాదులకి గుమ్మడి కాయలు కాసి వున్నాయి.

**ఇ) కింది గీతగీసిన పదాలకు భాషాభాగం, వాచకం (లింగం) గుర్తించి రాయండి.**

1) ఆ గుర్రం గుడ్డుని చూసేసరికి పరమానందయ్య శిష్యులకు అఖండమైన ఆలోచనలు వచ్చేశాయి.

2) రైతు అది చెవులపిల్లి అని చెప్పాడు.

**ఈ) కింది పదాలను విడదీసి, సంధి పేరు రాయండి:**

(1) వచ్చిందొకటి (2) అఖండమయిన (3) సంగతేమిటి (4) గుర్రమెక్కడ (5) వారికొక

**ఉ) కింది పదాలకు విగ్రహవాక్యం, సమాసనామం రాయండి.**

(1) మూడొందలు (2) దాణాఖర్చు (3) గుర్రంపిల్లని

## సృజనాత్మకత

**పరమానందయ్య శిష్యుల కథను సంభాషణ రూపంలో రాయండి.**





**జట్టుపని :**

మీరు సంభాషణ రూపంలో రాసిన కథను మీ పాఠశాల వార్షికోత్సవంలో ప్రదర్శించండి.



# 19 ధన్యజీవి

నేపథ్యం : భారతరత్న డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశ ప్రజల ఉద్ధరణకు తన జీవితాన్ని ధారపోసిన దేశోద్ధారకుడు. ఆయన చేసిన కృషిని ప్రతిబింబించేదే ఈ ధన్యజీవి గేయం. వారి సేవలకు నివాళులు అర్పిద్దాం.

జాతి మెచ్చిన జ్యోతి నీవు
ఖ్యాతి తెచ్చిన జ్ఞాని నీవు
కాంతి కిరణపు శాంతి నీవు
ఆశపూరిత రేఖ నీవు
భేద భావం రూపుమాపి
నిరక్షరాస్యుల మేలుకొలిపి
చదువు కొమ్మని స్ఫూర్తినిచ్చి
బడుగు వర్గపు బాధ బాపి
అభాగ్యజనులకు నీడ జూపి
మానవాళికి స్వేచ్ఛనొసగి
మానవత్వం రూపుదిద్ది
ధన్యజీవివైనావు అంబేద్కరా!
ధరణికై వెలసిన ప్రభాత భాస్కరా!



**కవి పరిచయం : కల్లూరి ప్రభాకరాచారి** కల్లూరి సక్కుబాయి, కల్లూరి మోహనచారి అను పుణ్య దంపతులకు 10-07-1957న కంఠాయపాలెం గ్రామం, మహబూబ్‌నగర్ జిల్లా (తెలంగాణ)లో జన్మించారు. వీరు చిరుదీపం, ప్రభాకర శతకం మొదలగు పుస్తకాలు రచించారు. వీరి రచన సరళంగా, సుందరంగా, ప్రబోధాత్మకంగా ఉంటుంది. మహనీయుల ఆశయాలను, సేవలను సరళమైన శైలిలో వెలుగులోనికి తెచ్చి పాఠకుల హృదయాలలో చెరగని స్థాయిని కల్పించడం వీరి రచనల ప్రత్యేకత. ప్రస్తుత పాఠ్యభాగం వీరి **'చిరుదీపం'** నుండి గ్రహింపబడింది.

## I. సంభాషించండి - చర్చించండి.

1. దేశసేవా తత్పరులు ప్రాతఃస్మరణీయులు.
2. మానవాళికి స్వేచ్ఛనొసగిన డా॥ అంబేద్కర్.

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం.

ఖ్యాతి = గొప్పపేరు; ధరణి = భూమి; ప్రభాతం = ఉదయం; భాస్కరుడు = సూర్యుడు;
మానవత్వం = తోటి వ్యక్తుల, ప్రాణుల పట్ల దయ, ప్రేమ, సానుభూతి కలిగి ఉండటం.

### ఆ) కింది గేయ పాదాలను పూరించండి.

1. జాతి మెచ్చిన .................. !
2. ఆశపూరిత రేఖ నీవు .................. !

### ఇ) గేయము ఆధారంగా కింది పంక్తులను పూరించండి.

మానవాళికి స్వేచ్ఛనొసగి
.............................................
.............................................
........................ ప్రభాత భాస్కరా!

### ఈ) ఆకృతిని పూరించండి.

**భారతరత్న డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్‌గారిని ప్రశంసిస్తూ గేయంలో కవి ఉల్లేఖించిన పదాలు.**



## భాషావగాహన

**అ) గేయం నుండి ప్రాస పదాలను గుర్తించి రాయండి.**

ఉదా: జ్యోతి – ఖ్యాతి.

........................., ........................., ........................., .........................

**ఆ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

(1) స్ఫూర్తినిచ్చి (2) స్వేచ్ఛనొసగి (3) ధన్యజీవివైనావు

**ఇ) కింది వాటికి సమాసముల పేర్లు రాయండి.**

(1) కాంతి కిరణం (2) అభాగ్యజనులు

## స్వీయస్పందన

- కీ.శే. డా|| బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత అంటారు కదా! ఎందుకు? రాజ్యాంగం అంటే ఏమిటి?

## ప్రసార మాధ్యమాలు

- కీ.శే. డా|| బాబాసాహెబ్ అంబేద్కర్‌గారి గురించి ఇంటర్నెట్ (అంతర్జాలం) ద్వారా సమాచారం సేకరించి 15 వాక్యాలు రాయండి.
- కీ.శే. డా|| బాబాసాహెబ్ అంబేద్కర్‌గారు ప్రజలనుద్దేశించి చేసిన ప్రసంగాలు, వారి ఇంటర్వ్యూలను అంతర్జాలంలో చూడండి.

## సృజనాత్మకత

- కీ.శే. ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి వివరాలు తెలుసుకొని, వారి ప్రసిద్ధ నినాదాలను ఉద్ఘాటిస్తూ, తరగతిగదిలో ఉపన్యాసం ఇవ్వండి.



# డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ మ్యూజియం - పుణె

**కింద ఇచ్చిన వాక్యాల ఆధారంగా డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ మ్యూజియం గురించి అర్థవంతమైన పరిచ్ఛేదం రాయండి.**

- డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ మ్యూజియం–పుణెలో 14 ఏప్రిల్ 1957 లో ఆయన జయంతి రోజు ప్రారంభించారు.
- ఈ మ్యూజియంను సింబయోసిస్ మేనేజ్‌మెంట్ వారు స్థాపించారు. వారే దీనిని నిర్వహిస్తున్నారు.
- దీనిలో డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ జీవనంలోని అనేక సంఘటనలకు సంబంధించిన అంశాలు భద్రపరిచారు.
- అత్యంత ప్రశాంత వాతావరణంలో సుందరంగా, క్రమశిక్షణతో తీర్చిదిద్దిన ఈ మ్యూజియం మన హృదయాలను కట్టిపడేస్తుంది.
- ఆయన దుస్తులు, బూట్లు, కళ్ళజోడు, చేతికర్ర, టోపీ, పడక మంచం, కుర్చీలు, వంటగది సామాగ్రి, మనల్ని ఆకట్టుకుంటాయి. ఆయన వాయించిన వాయిలెన్‌ని కూడా ఇక్కడ మనం చూడవచ్చును.
- డా॥ బాబాసాహెబ్ ఉద్యమ జీవితాన్ని తెలియజేసే ఫోటోలు, కుటుంబ సభ్యుల ఫోటోలు, జాతీయ, అంతర్జాతీయ నాయకులతో దిగిన ఫోటోలు అత్యంత సుందరంగా అమర్చారు.
- భారతదేశ అత్యున్నత పౌరపురస్కారం 'భారతరత్న' పతకం కూడా ఈ మ్యూజియంలో చూడవచ్చును.
- ఈ మ్యూజియం సందర్శనలో ప్రతి ఒక్కరికి ఒళ్ళు పులకరిస్తుంది. చారిత్రక ప్రేరణ, సామాజిక పరివర్తనపై అద్భుత అనుభూతి కలుగుతుంది.



# 20 రహదారి భద్రతా వారోత్సవాలు

**నేపథ్యం :** మనము టీ.వి.లో ప్రతిరోజు ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదం జరిగిన వార్తలు చూస్తుంటాము. ఆ దుర్ఘటన దృశ్యాలు చూసి మనము ఎంతో బాధ పడుతాము. వీటి వల్ల చాల మంది తమ జీవితంలో తీరని నష్టానికి గురౌతారు. మరి ఈ ప్రమాదాలు తగ్గించాలంటే, రోడ్డుపై వాహనాలు నడిపేవారు, రోడ్డుపై నడిచేవారు ఎలాంటి నియమాలు పాటించాలి, ఎలాంటి శిక్షణ పొందాలి, ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి, వీటి గురించి వివరించేదే ఈ వ్యాసము.

మన దేశ అభివద్ధిలో రహదారి రవాణా వ్యవస్థ ప్రముఖపాత్ర వహిస్తుంది. ప్రయాణికుల సంఖ్య, వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నట్లే రోడ్డు ప్రమాదాలు కూడా అధికమవుతున్నాయి. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన కల్పించి ప్రమాదాలను అరికట్టడానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం ‘‘జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు’’ దేశవ్యాప్తంగా నిర్వహిస్తుంది. రహదారి రవాణా శాఖ, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి ఈ కార్యక్రమకాలను విజయవంతంగా నిర్వహిస్తాయి. రహదారి నియమాలపై అవగాహన పెంచడం. ప్రమాదాలను తగ్గించడం, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను పెంపొందిచడం. ముఖ్యంగా యువతలో జాగ్రత్తగా వాహనం నడపాలనే చైతన్యం



కలిగించడం తద్వారా తమ ప్రాణాలను, ఇతరుల ప్రాణాలను కాపాడుకోవచ్చునే సందేశాన్ని ప్రజలకు అందించడం ఈ వారోత్సవాల ముఖ్యోద్దేశం.

ఈ వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు మరియు కళాశాలల్లో వ్యాసరచన చిత్రలేఖనం, నినాదాలను తయారు చేయటం మొదలగు పోటీలు మరియు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యార్థులు కూడలి నాటికలు, ర్యాలీలు నిర్వహించి ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను తెలియజేస్తారు.

రహదారి రవాణా శాఖ సిబ్బంది రహదారుల వద్ద ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ద్విచక్ర వాహనం నడుపువారు హెల్మెట్ ధరించడం. కారుల్లో సీట్ బెల్ట్ పెట్టుకోవడం, ట్రాఫిక్ సంకేతాలను పాటించటం అనివార్యమని, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించడం, మద్యం సేవించి వాహనం నడపడం నేరమని ప్రజలకు వివరిస్తారు.

అతివేగం, నిర్లక్ష్యంగా బండ్లు నడపటం, ట్రాఫిక్ సంకేతాలను పట్టించుకోకపోవడం, మొబైల్ ఫోన్ ఉపయోగం, మద్యం సేవించి వాహనం నడపడం ప్రస్తుత రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలు.

రహదారిపై నడిచే పాదచారుల కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డు దాటటం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించటం తప్పక పాటించాలి. రహదారి నియమాలను పాటించటం అలవాటుగా చేసుకోవాలి.

రహదారి నియమాలను పాటించటం ప్రతి వ్యక్తి, ప్రతి పౌరుని యొక్క సామాజిక బాధ్యత.

**ప్రాణం ఎంతో విలువైనది.**

**మన ప్రాణాలు కాపాడుకుందాం.**

**ఇతరుల ప్రాణాలను కాపాడుదాం.**

## I. సంభాషించండి - చర్చించండి.




1. 'రహదారి భద్రత ఉత్సవాలు'
2. రవాణా ఏయే మార్గాల ద్వారా జరుగుతుంది.
3. మీరు సైకిలు నడుపుతున్నపుడు ఏయే జాగ్రత్తలు తీసుకుంటారు?

## II. ఆలోచించండి- చెప్పండి - రాయండి.



### అ) పదజాలం పెంపొందించుకుందాం.

కార్యాలు = పనులు; ఉత్సవాలు = పండుగలు; శిబిరం = విడిది, డేరా;
నియంత్రణ=అదుపులో వుంచు; నిర్వహణ = నడిపించుట, జరిపించుట;
సడక్ = రోడ్డు, రహదారి; సురక్ష = భద్రత



### ఆ) కింది వాక్యాలను పాఠంలో వచ్చిన ప్రకారం క్రమపద్ధతిలో అమర్చండి.

1. వేగం కాదు జాగ్రత్తే ముఖ్యం. ☐
2. రోడ్డు నియమాలు పాటించండి. ☐
3. రహదారి భద్రత వెన్నెముక వంటిది. ☐
4. దేశంలో రహదారి భద్రత ఉత్సవాలు ఏడు రోజుల పాటు జరుపుకొంటారు. ☐



### ఇ) అర్థవంతమైన వాక్యాలు రాయండి.

ఉదా. నియమాలు పాటించుము రోడ్డు

రోడ్డు నియమాలు పాటించుము.

1. రహదారి వారం జరుపుకొను భద్రత
2. ప్రజలలో కల్పించాలి ట్రాఫిక్ నిబంధనలు అవగాహన
3. కాదు జాగ్రత్త ముఖ్యం వేగం



### ఈ) పాఠంలో అన్యభాషాపదాలను రాసి వాటి అర్థం రాయండి.

ఉదా : సడక్ =దారి, .................., .................., ..................



### ఉ) ఆలోచన కొరకు

1) ''అతి వేగం ప్రమాదకరం'' ... దీనిని వివరించండి.

2) 'రహదారి భద్రత అవగాహన' దినోత్సవానికి సంబంధించిన ప్రకటనలు తయారు చేయండి.

## భాషావగాహన

**అ) కింది వాక్యములలో గీతగీసిన పదాలు ఏరకమునకు చెందినవో, ఏకాలము సూచించుచున్నవో రాయండి.**

1. మిమ్మల్ని మీరు <u>రక్షించుకోవాలి</u>.
2. నినాదాల ద్వారా ఈ విషయాలను విద్యార్థులకు <u>తెలియజేశారు</u>.
3. భద్రతా ఉత్సవాల ద్వారా ట్రాఫిక్ నిబంధనలను గురించి ప్రజలకు అవగాహన <u>కల్పిస్తున్నారు</u>.

**ఆ) కింది పదాలను విడదీసి సంధి పేరు రాయండి.**

(1) ముఖ్యమైన (2) మంచిదైన (3) మెరుగైన

**ఇ) కింది పదాలకు విగ్రహవాక్యము, సమాసనామం రాయండి.**

(1) ఏడు రోజులు (2) సిబ్బంది నియామకం (3) ప్రతి సంవత్సరం

## స్వీయస్పందన

1. ఒక పాఠశాల యొక్క స్కౌట్ గైడ్ విద్యార్థులు 'రహదారి భద్రత నియమాల' గురించి వ్యాసరచనా కార్యక్రమము ఏర్పాటు చేశారు కింది అంశాల ఆధారంగా వ్యాసము రాయండి.

అ) ట్రాఫిక్ నియమాలు
ఆ) సిగ్నల్ లైట్లు
ఇ) రహదారికి కుడి, ఎడమ, జీబ్రా క్రాసింగ్
ఈ) రహదారి భద్రత అవగాహన ర్యాలీ.

## జట్టు పని

- **కింది సూచనా ఫలకాలను చదవండి. వాటి గురించి చర్చించండి.**




## సృజనాత్మకత

- రహదారి భద్రతను గురించి నినాదాలను, సూచనా ఫలకాలను తయారు చేయండి. వాటిని ఉపయోగిస్తూ మీ ఉపాధ్యాయుల సహాయంతో వీధినాటికను (street play) ప్రదర్శించండి. ప్రదర్శన ఫోటోను కింద అతికించండి.

# 21 మర్యాదరామన్న తీర్పు

**నేపథ్యం :** మనం జరిగిన కథలను, సంభాషణలను మున్నగు వాటిని రంగస్థలం మీద నాటికలు, నాటకాల రూపంలో ప్రదర్శిస్తుంటాము. ఇవి చాలామటుకు మంచి నీతిని తెలిపే విధంగా ఉంటాయి. ప్రస్తుతం మర్యాద రామన్న ఏ విధంగా ధర్మయ్యకు మంచి తీర్పు చెప్పి, ఆనందం కలిగించాడో ఈ నాటిక ద్వారా తెలుసుకుందామా!

## సన్నివేశం 1

**(భుజంగం ఇల్లు. అతను మరో ఇద్దరు పెద్ద మనుషులు కూర్చొని ఉన్నారు.)**

**ధర్మయ్య :** **(లోపలికి వచ్చి)** అయ్యా నమస్కారం. ఎందుకో పిలిపించారట.

**భుజంగం:** అవును. ధర్మయ్యా, నీతో సరదాగా ఒక ఆట ఆడుదామనిపించింది.

**ధర్మయ్య:** నాతో ఆటలేమిటండి?

**భుజంగం:** **(చిన్నగా నవ్వి)** అదేమీ కాదు కానీ, నేను మీ ఇంటికి వస్తాను. మీ ఇంట్లో నేను దేన్ని ముందుగ ముట్టుకుంటానో దాన్ని నాకిచ్చేయాలి. బదులుగా నీకు పదివేల రూపాయలు ఇస్తాను.

**ధర్మయ్య :** అయ్య బాబోయ్! పదివేల రూపాయలే! అలాగే నండి.

**భుజంగం:** అలాగే అని తర్వాత మాట తప్పకూడదు.

**ధర్మయ్య:** తప్పనండి. ఈ పేదవాడి ఇంట్లో అంత విలువైనది ఏముంటుంది చెప్పండి.

**(నమస్కరించి వెళ్లి పోతాడు.)**

## సన్నివేశం 2

**(ధర్మయ్య ఇల్లు. అతను కూర్చొని ఉన్నాడు. భార్య, కుమార్తె, కుమారుడు ఎదురుగ ఉన్నారు. జరిగినదంతా భార్య, పిల్లలకు చెప్పాడు.)**

**భార్య :** భుజంగం గారు ఏదో ఎత్తుగడ వేసినట్టు అనిపిస్తుంది అండి. అంత పెద్ద మనిషి ఇలా ఆటలాడదాం అని అంటారా.

**ధర్మయ్య:** నిజమే నాకు ఇప్పుడు అలాగే అనిపిస్తుంది. ఈ ఇల్లు అమ్మినా అంత డబ్బు రాదు కదా అనుకున్నా!

**కూతురు:** ఏది ముట్టుకుంటే అది ఇచ్చేయాలా . తమ్ముడ్ని ముట్టుకుంటే తమ్ముడ్ని ఇచ్చేయాలా?

**ధర్మయ్య:** ఏమోరా చిన్నోడూ నేను అంత దూరం ఆలోచించలేదు.

**భార్య:** ఇందులో ఏదో మోసం ఉంది. ఇలాంటి మోసాలకు మర్యాద రామన్న గారు చక్కటి ఉపాయాలు చెబుతారని అంటారు. ఒకసారి వెళ్లి ఆయనను కలిసి రండి.

**ధర్మయ్య:** అలాగే ఇప్పుడే వెళ్తాను.

## సన్నివేశం 3

**(మర్యాద రామన్న తన ఇంటి వసారాలో కుర్చీలో కూర్చొని ఉన్నారు. చాలా మంది జనం కూర్చొని ఉన్నారు. ధర్మయ్య వెళ్ళి జరిగినది చెప్పాడు.)**



మర్యాద రామన్న: నీవు చెప్పింది వింటూంటే ఇందులో ఏదో మోసం ఉన్నది. మీ ఇంట్లో విలువైన ఏదో వస్తువును భుజంగం కాజేయడానికి చూస్తున్నాడు. మీ ఇంట్లో అంత విలువైన వస్తువులు ఏమున్నాయి.

ధర్మయ్య: బీదవాడిని మా ఇంట్లో ఏముంటాయండి?

మర్యాద రామన్న: సరే! ఒకసారి నేను మీ ఇంటికి వచ్చి చూస్తాను. భుజంగానికి ఏదో ఒక సాకు చెప్పి నాలుగు రోజులు గడువు అడుగు.

ధర్మయ్య: అలాగేనయ్యా!

## సన్నివేశం 4

ధర్మయ్య: అయ్యా దయచేయండి.

**(మర్యాద రామన్న ఇంట్లోకి వచ్చాడు. అందరూ ఆయనకు నమస్కరించారు. ఆయన ఇల్లంతా కలియ తిరిగాడు. లోపలి గదిలోకి వెళ్లి మళ్ళీ బయటకు వచ్చాడు.)**

మర్యాద రామన్న: ధర్మయ్యా! లోపల దేవుడి గదిలో వినాయకుని పంచలోహ విగ్రహం ఎక్కడిది?

ధర్మయ్య: మా తాతలు, ముత్తాతల కాలం నుండి ఆ విగ్రహాన్ని పూజిస్తున్నామండీ.

మర్యాద రామన్న: పాతకాలం నాటి విగ్రహాలను కొనే ముఠా ఒక్కటి నెల రోజులుగా ఈ ప్రాంతాలలో తిరుగుతోంది. బహుశా భుజంగం ఎత్తుగడ అది కావచ్చు. నీవు ఒక పనిచేయి.

**(ధర్మయ్యను దగ్గరికి పిలిచి చెవిలో ఏదో చెప్పాడు.)**

భుజంగం వచ్చే రోజు నేను కూడా మారు వేషంలో వస్తాను. ఏం జరుగుతుందో చూద్దాం. ఎందుకైనా మంచిది భుజంగం వచ్చినపుడు నీ భార్యా పిల్లలను ఇంట్లో ఉంచొద్దు.

ధర్మయ్య:అలాగేనండి.

## సన్నివేశం 5

ధర్మయ్య: అయ్యా దయచేయండి.

**(భుజంగం వచ్చాడు. ధర్మయ్య చిన్న ముంతలో నీళ్ళు తెచ్చి ఇవ్వబోయాడు.)**

ధర్మయ్య: అయ్యా మంచి నీళ్ళు పుచ్చుకోండి.

**(భుజంగం ధర్మయ్యను కిందికి మీదికి ఎగాదిగా చూశాడు.)**

**భుజంగం:** ఏం.. నేనంత పిచ్చోడిలా కనపడుతున్నానా? నీ ఎత్తులు నా దగ్గర పారవు. ఈ ముంతను ముట్టుకొని నీళ్ళు తాగితే నీకు పదివేలు ఇచ్చేయాలని నీ ఆలోచన ...అమ్మా....

**ధర్మయ్య:** అయ్యో అలాంటిదేమీ కాదండి. పెద్దవారు ఇంటికి వచ్చారని మంచి నీళ్ళు ఇచ్చాను.

**(భుజంగం ఒకసారి లోపలి గదిలోకి వెళ్లి మళ్ళీ బయటకు వచ్చాడు.)**

**భుజంగం:** అది సరే పోయినసారి నీవు గణపతి హోమం చేసినప్పుడు లోపల దేవుడి గదిలో ఉండిన వినాయకుని విగ్రహం ఏదీ?

**ధర్మయ్య:** ఓ అదా మొన్న ఇల్లు సర్దుతూ అటక మీద పెట్టించాను.

**భుజంగం:** అటకా! ఎక్కడ? ఎక్కడ?

**ధర్మయ్య:** ఇదిగో చూడండి ఇక్కడే.

**(ధర్మయ్య అటకను చూపించాడు. భుజంగం వెంటనే పక్కనే ఉన్న నిచ్చెన పట్టుకొని పైకి ఎక్కబోయాడు.)**

**ధర్మయ్య:** కాస్త ఆగండి. మీరు ముందుగ నిచ్చెన పట్టుకున్నారు. అది మీరే తీసుకుపొండి.

**భుజంగం:** **(చప్పున నిచ్చెన వదిలేశాడు.)** నేనా నేనెప్పుడు పట్టుకున్నాను. **(అంతలో బయట నుండి మారువేషంలోని మర్యాద రామన్న, ధర్మయ్య భార్యా పిల్లలు, కొందరు పెద్ద మనుషులు లోపలికి వచ్చారు.)**

**మర్యాద రామన్న :** అవును ముందుగా మీరు నిచ్చెన పట్టుకున్నారు. అది తీసుకొని ధర్మయ్యకు పదివేల రూపాయలు ఇచ్చేయండి.

**భుజంగం:** దబాయించి అడుగుతున్నారు. మీరెవరు?

**మర్యాద రామన్న:** **(తన మారు వేషం తొలగించి.)** నేను మర్యాద రామన్నను మర్యాదగా ధర్మయ్యకు మీరు ఇస్తానన్న డబ్బులు ఇచ్చేయండి.

**భుజంగం:** **(నీళ్ళు నములుతూ)** మ.. ర్యా.. ద.. రా.. మ.. న్నా.. అలాగే అలాగే ఇప్పుడే తెచ్చి ఇస్తాను. **(అంటూ బయటికి వెళ్లి పోయాడు.)**

**ధర్మయ్య, భార్యా పిల్లలు అందరు:** మీరు ఉపాయంతో పెద్ద ఆపద నుండి కాపాడారు.

**(అంటూ అందరూ నమస్కరించారు).**

*****

**రచయిత పరిచయం :** ప్రస్తుత పాఠ్యభాగ రచయిత. **డా॥ దాసరి వెంకట రమణ**గారు. వీరు దాసరి వెంకట రమణమ్మ, రంగయ్య అను పుణ్యదంపతులకు 1965 మార్చి 22న జన్మించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పత్రికలలో వీరి రచనలు ఎన్నో ప్రచురితమయ్యాయి. వీరు రచించిన 'ఆనందం' కథల సంపుటకి కేంద్రసాహిత్య అకాడెమి అవార్డు, అమ్మమనసు కథల సంపుటికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి **'ఉత్తమ బాలసాహిత్య పురస్కారం'** లభించాయి.

## I. సంభాషించండి - చర్చించండి.

1) మీ పాఠశాల వార్షికోత్సవంలో మీరు ప్రదర్శించిన నాటిక.

2) మర్యాద రామన్న స్థానంలో మీరు ఉంటే ఏం చేసేవారు?

3) తీర్పులు ఎటువంటి సందర్భాలలో చెప్పవలసి వస్తుంది?

## II. ఆలోచించండి - చెప్పండి - రాయండి.

### అ) పదజాలం పెంపొందించుకుందాం:

ముట్టుకొనుట = తాకుట; పేదవాడు = బీదవాడు; ఎత్తుగడ = వ్యూహం; కుట్ర; ఉపాయం; వసారా=పంచ; నడవ; గడువు=సమయం; కలియతిరుగుట=అన్నిచోట్ల తిరుగుట; ముఠా=సమూహం; దబాయించుట=బెదిరించుట, గట్టిగా వాదించుట.

### ఆ) కింది వాక్యాల్లో తప్పు/ఒప్పులను గుర్తించి రాయండి.

1) భుజంగం గారు ఎత్తుగడ వేసినట్టు అనిపిస్తుంది. ( )

2) మర్యాద రామన్న ఇంటిలోపల బెంచీమీద కూర్చొని ఉన్నారు. ( )

3) నిచ్చెన తీసుకొని ధర్మయ్యకు ఇరవై వేల రూపాయలు ఇచ్చేయండి. ( )

4) మర్యాద రామన్న ఇల్లంతా కలియతిరిగాడు. ( )

### ఇ) కింది వాక్యాలను ఎవరు, ఎవరితో పలికిరో రాయండి.



1) "లోపలి దేవుడి గదిలో వినాయకుని పంచలోహ విగ్రహం ఎక్కడిది?"

2) "పెద్దవారు ఇంటికి వచ్చారని మంచి నీళ్ళు ఇచ్చాను."



## పంక్తులపై చర్చ

పాఠము నుండి కొన్ని పంక్తులు ఇవ్వబడినాయి. వాటిని సహవిద్యార్థులతో చర్చించి వాటి అర్థాన్ని లేదా భావాన్ని మీ లేఖన పుస్తకంలో రాయండి.

అ) ''బహుశా భుజంగం ఎత్తుగడ అది కావచ్చు''

ఆ) 'నీ ఎత్తులు నా దగ్గర పారవు''

## ఆలోచన కొరకు

- కింది అంశాల గురించి ఆలోచించి, మీ నోట్ పుస్తకాలలో రాయండి.

1) ధర్మయ్య, భుజంగం స్వభావాలలోని భేదం.

2) మర్యాదరామన్న తీర్పు.

3) ''ఎత్తుకు పై ఎత్తు'' పాఠం ఆధారంగా వివరించండి.

## భాషావగాహన

**అ) కింది పదములను విడదీసి, సంధిపేరు రాయండి.**

(1) ఆటలేమిటండి (2) ఏముంటుంది (3) జరిగినదంతా

(4) ఆటలాడుదాం (5) చూస్తున్నాడు (6) నాకిచ్చేయాలి

**ఆ) కింది పదాలకు విగ్రహ వాక్యములను, సమాసనామములను రాయండి.**

(1) భార్యా పిల్లలు (2) నాలుగు రోజులు (3) వినాయకుని విగ్రహం.

**ఇ) కింది పదములు ఏ వాచకములకు చెందినవో రాయండి.**

(1) ఇల్లు (2) ధర్మయ్య (3) భార్య

(4) కూతురు (5) తమ్ముడు (6) విగ్రహము

## సృజనాత్మకత

- **నాటకీకరణ :** మీరు మీ పాఠశాలలో ఏదైనా ఒక కల్పిత సమస్యను పరిష్కరించుటకు న్యాయాధికారిగా వ్యవహరించండి. సరియైన తీర్పు చెప్పండి.

**విద్యార్థి సూచన :** ప్రసార మాధ్యమాల్లో మర్యాద రామన్న గారి గురించి తెలుసుకోండి. సంభాషించండి. రాయండి.

హలో పిల్లలూ!

ఎవరైనా మిమ్మల్ని అనుచితంగా అనగా మీ శరీరంలో తాకరానిచోట్లను తాకడం వలన మీకు అసౌకర్యంగా అనిపిస్తే మీరు మౌనంగా ఉండకూడదు.

1) మిమ్మల్ని మీరు నిందించుకోవద్దు. తప్పుగా అనుకోవద్దు.

2) మీకు ఎవరి మీద నమ్మకముందో, మాట్లాడుకోడానికి సౌకర్యంగా అనిపిస్తుందో వారికి చెప్పండి.

3) మీరు POCSO e-box ద్వారా జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమీషన్‌కు కూడా తెలియజేయవచ్చు.

మీకు ఎవరిదైనా సురక్షితంకాని చెడుస్పర్శ తగిలినప్పుడు మీకు తప్పుగా గందరగోళంగా, నిస్సహాయంగా అనిపించవచ్చు. మీరు 'చెడు' గా అనుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అది మీ తప్పు కాదు.




ఈ బటన్ నొక్కండి.

POCSO e-box ncpcr@gov.in వెబ్‌సైట్‌లో లభిస్తుంది.

మీరు 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారైతే, ఇబ్బంది పడుతుంటే, గందరగోళంగా అనిపిస్తే, వేదింపులకు గురైతే మీ కొరకు లేదా అదే స్థితిలో ఉన్న ఇతర పిల్లల సహాయం కొరకు.....

CHILD LINE 1098 NIGHT & DAY

CHILDLINE (చైల్డ్‌లైన్) 1098-అనునది జాతీయ 24 గంటల ఉచిత/టోల్‌ఫ్రీ అత్యవసర ఫోన్‌సేవ. ఇది ఆపదలో ఉన్న పిల్లలకోసం మహిళ మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ మద్దతుతో చైల్డ్‌లైన్ ఫౌండేషన్ ముందంజ వేసి ఏర్పరచిన సేవ.

नए समाज की ओर
Towards a new dawn

విద్యార్థులు మంచి స్పర్శ, చెడు స్పర్శలను గుర్తించుటకుగాను వారి వయోపరిమితి, శారీరక మరియు మానసిక భావోద్వేగాలదృష్ట్యా వారికి మార్గదర్శనం చేయండి.

# राज्यगीत



जय जय महाराष्ट्र माझा, गर्जा महाराष्ट्र माझा
जय जय महाराष्ट्र माझा, गर्जा महाराष्ट्र माझा ।।धृ।।

भिती न आम्हा तुझी मुळी ही गडगडणाऱ्या नभा
अस्मानाच्या सुलतानीला जबाब देती जिभा
सह्याद्रीचा सिंह गर्जतो शिव शंभू राजा
दरी दरीतून नाद गुंजला महाराष्ट्र माझा
जय जय महाराष्ट्र माझा, गर्जा महाराष्ट्र माझा ।।१।।



काळ्या छातीवरी कोरली, अभिमानाची लेणी
पोलादी मनगटे खेळती, खेळ जीवघेणी
दारिद्र्याच्या उन्हात शिजला
निढळाच्या घामाने भिजला
देश गौरवासाठी झिजला
दिल्लीचे ही तख्त राखितो, महाराष्ट्र माझा
जय जय महाराष्ट्र माझा, गर्जा महाराष्ट्र माझा
जय जय महाराष्ट्र माझा ।।२।।




महाराष्ट्र राज्य पाठ्यपुस्तक निर्मिती व अभ्यासक्रम संशोधन मंडळ

మహారాష్ట్ర రాష్ట్ర పాఠ్యపుస్తక నిర్మితి మరియు పాఠ్యప్రణాళిక పరిశోధన సంస్థ, పుణె

बालभारती इयत्ता सहावी (तेलुगु)

₹ 78.00